సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 153

బుధవారం 23-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం॥ 23-8-2023
II

● సృజన

హ్యాపీ స్పేస్


● భార్గవి

**యాంత్రిక ప్రయాణంలో
పోటీ ఎప్పుడూ ఉండేదే!
కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు
అమ్మ కళ్లలో.. కలల్లో
చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది.
'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే
నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి.
హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి
నేచురల్ కలర్స్ వాడకం గురించి
అపార్ట్‌మెంట్ పిల్లలకు
పరిచయం చేస్తూ కనిపించారు.
ఆసక్తితో ఆమె చేస్తున్న
పని గురించి ప్రశ్నించినప్పుడు
పిల్లల కోసం తను సృష్టించిన
సహజ ప్రపంచాన్ని
మన ముందుంచారు..**

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, హైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్‌తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



● ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...
● నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రైన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం


● మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్ళలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకుగానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్ల ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లల్లోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.


అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్గ్ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వి మేళా, అక్షయ్‌కల్ప రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తినిచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

యూత్ పల్స్

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు



సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటీ' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్ట్స్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.


'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్ట్స్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 153
బుధవారం 23-8-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


ప్రజ్ఞానంద-కార్ల్‌సన్ గేమ్ 'డ్రా'
ప్రపంచకప్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్‌ను నిలువరించిన భారత జీఎం -14లో


రిపబ్లికన్ రేస్ షురూ
అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్లు బరిలోకి దిగారు -6లో


ప్రపంచానికి గ్రోత్ ఇంజన్.. భారత్
రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారత్ గ్రోత్ ఇంజన్‌గా మారబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
వివరాలు 6లో ▸


'పసిఫిక్'లో 'అణు' అలజడి
ఫ్యుకుషిమా అణు రియాక్టర్ నుంచి వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేయడానికి జపాన్ సన్నాహాలు చేస్తోంది.
వివరాలు 6లో ▸


అత్యధిక రేటుకు ఉల్లి కొంటాం
ఉల్లి కొనుగోలుకు కేంద్రం హామీనిచ్చింది. మరోపక్క ఉల్లి తినకుంటే నష్టమేమీ లేదని మహారాష్ట్ర మంత్రి దాదా భూసే అన్నారు.
వివరాలు 6లో ▸


మధ్యప్రదేశ్‌లో గెలిస్తే కులగణన
మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే కులగణన నిర్వహిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు.
వివరాలు 6లో ▸

'కారు' మిస్సయిన వారికి.. డోర్లు ఓపెన్!

బీఆర్ఎస్ టికెట్ దక్కని అసంతృప్తులకు ప్రతిపక్షాల గాలం

టికెట్ దక్కని బీఆర్ఎస్ సిట్టింగ్‌లు, ఆశావహుల్లో తీవ్ర నిరాశ
- బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేస్తున్న పలువురు నేతలు
- పోటీ కోసం ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న కొందరు
- ఓవైపు వీరిని బుజ్జగించేందుకు, వినకుంటే వేటు వేసేందుకు బీఆర్ఎస్ యత్నాలు
- 'అసంతృప్త' నేతలతో హరీశ్, ఇతర సీనియర్ల చర్చలు

మరోవైపు ఇలాంటి వారికి గాలం వేసేందుకు కాంగ్రెస్ వ్యూహాలు
- రాష్ట్రవ్యాప్తంగా 50 నియోజక వర్గాల్లోని అసమ్మతి నేతలపై దృష్టి
- తుమ్మల, రాజయ్య, వీరేశం వంటి నేతలతో ఇప్పటికే మంతనాలు షురూ!
- ద్వితీయ శ్రేణి నేతలకూ ఆఫర్లు.. జిల్లాల నేతలకు బాధ్యతలు

బీఆర్ఎస్ అసంతృప్తులను చేర్చుకోవడంపై బీజేపీ ఫోకస్
- బీఎస్పీ, ఇతర పక్షాలూ తెరపైకి.. పలువురు నేతలతో చర్చలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం సీఎం కేసీఆర్ ముందుగానే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను విడుదల చేయడం రాష్ట్రంలో కాక రేపుతోంది. మూడు ప్రధాన రాజకీయపార్టీల్లోనూ వేడి పుట్టిస్తోంది. బీఆర్ఎస్‌లో టికెట్ దక్కని ఆశావహులు అసమ్మతి రాగం ఎత్తుకోగా.. వారిని బుజ్జగించేందుకు బీఆర్ఎస్ కీలక నేతల యత్నాలు ఓవైపు.. ఇలాంటి వారికి గాలం వేసి, తమ తరఫున బరిలోకి దింపేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ ఇతర పార్టీల ప్రయత్నాలు మరోవైపు.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. బీఆర్ఎస్ టికెట్ దక్కని కొందరు నేతలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా.. మరి కొందరు అంతర్గతంగా ఇతర పార్టీలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో
మిగతా 5వ పేజీలో ▶

మైనంపల్లికి ప్రత్యామ్నాయం 8లో


స్టేషన్‌ఘన్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సాష్టాంగ నమస్కారం చేసి రోదిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య


మంగళవారం తనను కలసిన కార్యకర్తల వద్ద కంటతడి పెడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



చంద్రయాన్-3 ల్యాండర్ చందమామపై దిగనున్న సందర్భాన్ని పురస్కరించుకుని చెన్నైలోని ఓ స్కూలు విద్యార్థుల ప్రదర్శన

చందమామను ముద్దాడే క్షణం కోసం..

చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టం నేడే

జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టనున్న ల్యాండర్ మాడ్యూల్

సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్

'జయహో భారత్.. జయహో ఇస్రో' అంటూ నినదిస్తున్న యువత

ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ తన తుది గమ్యాన్ని నేడు ముద్దాడనుంది. చంద్రుడి దక్షిణధ్రువ ఉపరితలంపై ల్యాండర్ మాడ్యూల్ అడుగు పెట్టనుంది. బుధవారం సాయంత్రం 5.27కి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సరిగ్గా 6.04కి జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించడానికి ఇస్రో సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ అపూర్వ ఘట్టాన్ని బుధవారం సాయంత్రం 5.20 నుంచే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. ఈ అద్భుత దృశ్యాల కోసం దేశ ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ల్యాండర్ మాడ్యూల్‌ను నిరంతరం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ప్రస్తుతం చక్కగా పనిచేస్తోందని ఇస్రో మంగళవారం వెల్లడించింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

మీ నాన్నను ఎందుకు అడగలేదు?


చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కావాలని ఢిల్లీలో దొంగ దీక్ష చేసిన కవిత రాష్ట్రంలో మహిళలకు 33% సీట్లు ఇవ్వలేదని తండ్రిని ఎందుకు అడగట్లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నిలదీశారు.
- వివరాలు 8లో▶

లోకేశ్‌తో నాకు ప్రాణహాని


'టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి నాకు ప్రాణహాని ఉంది. నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు. మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర పన్నారు. నేను చనిపోతే దానికి కారణం లోకేశే' అని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి అన్నారు.
- వివరాలు 12లో▶

బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం


62% ఉన్న బీసీలకు కేవలం 23 అసెంబ్లీ సీట్లను సీఎం కేసీఆర్ ప్రకటించడం బీసీలను అణిచివేతకు గురిచేయడమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.
- వివరాలు 8లో▶

తుపాకీ 'గురి' తప్పుతోంది!


ఒకవైపు ఉద్యోగంలో ఒత్తిళ్లు... మరోవైపు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ కలహాలు.. ఇవన్నీ ఖాకీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒత్తిడి తట్టుకోలేక విధి నిర్వహణ కోసం ఇచ్చే ఆయుధంతో ఎదుటివారిని హతమార్చేలా విచక్షణ కోల్పోతున్నారు.
- వివరాలు 7లో▶

ఇదండీ సంగతి


.. నేను సీఎంగా ఉన్నందుకు అనుకున్నాను సార్!

'మార్గదర్శి'లో చేరాం.. మోసపోయాం!

సీఐడీ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదుల వెల్లువ

3 రోజుల్లో ఏకంగా 300 మంది చందాదారుల ఫిర్యాదు
- చందాదారుల సొమ్మును సొంత పెట్టుబడిగా మార్చుకున్న రామోజీ
- అక్రమాలు బయటపడటంతో కొత్త చిట్టీలకు ముందుకురాని చందాదారులు
- రొటేషన్ దందాకు చెక్ పడటంతో దివాలా అంచున 'మార్గదర్శి'
- తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు
- చీరాల బ్రాంచి మేనేజర్ అరెస్టు.. 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు
- చందాదారుల ఫిర్యాదులపై కార్యాచరణను ఉధృతం చేసిన సీఐడీ
- ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబర్ 94931 74065 అందుబాటులోకి



సాక్షి, అమరావతి: ''నేనూ మార్గదర్శిలో చేరా... ఓ మోపెడ్ కొనుక్కున్నా!.. ఓ ఇంటివాడినయ్యా..!!'' ఇలాంటి ప్రకటనలను నమ్మిన వేలాది మంది మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ చందాదారులు నిండా మునిగిపోయారు! ప్రతి నెలా కష్టార్జితం నుంచి పొదుపు చేసి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చిట్టీలు కడితే దారుణంగా మోసపోయామని ఆక్రోశిస్తున్నారు. చందాదారుల సొమ్మును తన కుటుంబ సభ్యుల సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేసిన రామోజీరావు తాపీగా కూర్చోగా చందాదారులు మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కొందరి నుంచి ఆస్తి పత్రాలు, ఎల్ఐసీ బాండ్లు తీసుకుని కూడా డబ్బులివ్వకుండా వేధిస్తున్నారు... మరికొందరు చిట్టీలు పాడినా పాట మొత్తం (ప్రైజ్ మనీ) ఇవ్వకుండా నెలల తరబడి తిప్పుతున్నారు.. ఇంకొందరి సంతకాలను ఫోర్జరీ చేసి మరొకరికి ష్యూరిటీగా చూపిస్తూ చిట్టీ మొత్తం ఇవ్వకుండా వేధిస్తున్నారు. చిట్టీ వాయిదా ఒక్క రోజు ఆలస్యమైనా రూ.500 జరిమానా వసూలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ తాము చెల్లించాల్సిన చిట్టీ పాట మొత్తాన్ని నెలల తరబడి జాప్యం చేస్తున్నా ఒక్క రూపాయి కూడా వడ్డీ చెల్లించడం లేదు.. ఇలా వేలాదిమంది
మిగతా 12వ పేజీలో ▶

మా తడాఖా చూపిస్తాం

బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని సీపీఐ, సీపీఎం ప్రకటన

- కేసీఆర్ మిత్రధర్మాన్ని పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరించారు
- రాజకీయం అంటేనే మోసమనే నిర్వచనం ఇచ్చారు
- బీజేపీతో బీఆర్ఎస్‌కు సఖ్యత ఏర్పడిందన్న అనుమానాలు
- లెఫ్ట్ పొత్తు లేకుంటే 4,5 శాతం ఓట్లు తక్కువగా పడతాయని వ్యాఖ్య
- బీజేపీ వ్యతిరేక పార్టీలతో పొత్తులుంటాయని వెల్లడి


సమావేశంలో ఐక్యత చాటుతున్న సీపీఐ, సీపీఎం నేతలు సీతారాములు, కూనంనేని, తమ్మినేని, చాడ వెంకట్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ రాజకీయం అంటేనే మోసమనే నిర్వచనం ఇచ్చారని, మిత్ర ధర్మాన్ని పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరించారని వామపక్షాలు మండిపడ్డాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించాయి. ''సీఎం కేసీఆర్ నిర్ణయంతో మాకేం నష్టంలేదు. నష్టపోయేది కేసీఆరే. బీజేపీతో బీఆర్ఎస్‌కు సఖ్యత ఏర్పడింది. బీజేపీ అండ ఉంటే
మిగతా 8వ పేజీలో ▶

కట్టా రామచంద్రారెడ్డి, మల్లా రాజిరెడ్డి క్షేమమే

- లేఖ విడుదల చేసిన మావోయిస్టు అధికార ప్రతినిధి మంగ్లీ

చర్ల/మంథని/ సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ క్షేమంగా ఉన్నారని, వారు మృతి చెందారంటూ వచ్చిన కథనాల్లో నిజం లేదని మావోయిస్టు పార్టీ దండకారణ్య ఉత్తర సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి మంగ్లీ పేర్కొన్నారు. ఇది తమ పార్టీకి వ్యతిరేకంగా పాలకవర్గాలు చేపట్టిన మానసిక యుద్ధంలో భాగమేనని పేర్కొంటూ ఆమె పేరిట మంగళవారం మీడియాకు లేఖ విడుదల చేశారు. మల్లా రాజిరెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి మరణించినట్లుగా ఈనెల 19న తెలుగు, హిందీ దినపత్రికల్లో వచ్చిన అబద్ధపు కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆ ఇద్దరు నేతలు క్షేమంగా, సురక్షితంగా ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో
మిగతా 5వ పేజీలో ▶

బీజేపీ పార్లమెంటు కన్వీనర్ల నియామకం 3లో
ప్రకటించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మెదక్ నుంచే ప్రగతి శంఖారావం

బీడీ ప్యాకర్లకు, టేకేదార్లకు ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు రూ. 4,016 పింఛన్ పథకాలు..
- నేడు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారన్న మంత్రి హరీశ్
- కేసీఆర్ వ్యూహానికి విపక్షాలు విలవిల్లాడుతున్నాయని ఎద్దేవా

- వివరాలు 8లో▶



రూ. 2 లక్షల పంట రుణాలు తీసుకోండి.. మాఫీ చేస్తాం



రైతులకు రేవంత్‌రెడ్డి భరోసా
- ఇందిరమ్మ రాజ్యంలో నెలకు రూ. 4 వేల పింఛన్
- కేసీఆర్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజం
- కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల బీఆర్ఎస్, బీజేపీ నేతలు

3లో


TATA ఉత్పాదన
TANISHQ
ఆర్నా
వరమహాలక్ష్మి వ్రతం
శుభాకాంక్షలు
ఉచిత బంగారు నాణెం*
ప్రతి బంగారు ఆభరణాల కొనుగోలుపై
ఆగస్టు 23 నుంచి 26 వరకు ఆఫర్.
20% వరకు తగ్గింపు*
వజ్రాల ఆభరణాల విలువప్పై.
స్మార్ట్ ఎంపిక చేయండి
TANISHQ ఎక్స్చేంజ్

మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలి

- దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్‌: మద్యం దుకాణాలు దక్కించుకున్న వారందరూ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ రూపొందించిన నిబంధనలు పాటించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఎక్సైజ్‌శాఖపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ..మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని నియంత్రించాలని అధికారులకు ఆదేశించారు. సరిహద్దు వెంట ఉన్న చెక్ పోస్టులను మరింత బలోపేతం చేయాలని, చెక్ పోస్టులలో పని చేసే అధికారులకు, సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, రవాణా శాఖ చెక్‌పోస్ట్‌తో కలిపి సమీకృత తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల కేటాయింపును విజయవంతం చేసిన అధికారులను ఆయన సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ ఫరూఖీ, జాయింట్ కమిషనర్ శాస్త్రి, డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, సహాయ కమిషనర్‌లు చంద్రయ్య గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రకటన సరైంది కాదు

తప్పుబట్టిన ఐజేయూ, టీయూడబ్ల్యూజే

లక్డీకాపూల్ (హైదరాబాద్): జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామనీ, అయితే ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు ఇస్తున్న మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇచ్చేది లేదని ప్రకటించడం మాత్రం ఏ విధంగానూ సమర్థనీయం కాదని ఇండియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్‌రెడ్డి, వై.నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియాలో అవాస్తవ కథనాలు వస్తే వివరణ ఇవ్వడం, ఖండించడం, ఇంకా కాదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి హక్కు ఉంటుంది కానీ.. ఆ మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వ సౌకర్యాలను ఇవ్వబోమని చెప్పడం సబబు కాదని సీఎంకు సూచించారు. మీడియా సంస్థల ఎడిటోరియల్ పాలసీకి జర్నలిస్టులను జవాబుదారీ చేయడం అసంబద్ధమన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్నందుకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల జీతభత్యాలను, సౌకర్యాలను, నియోజకవర్గ అభివృద్ధి నిధులను నిలిపివేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి అందరిని సమదృష్టితో చూసినప్పుడే గౌరవంగా, హుందాగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు



సాక్షి, హైదరాబాద్‌: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ఇప్పటికే నడుపుతున్న ప్రత్యేక రైళ్లను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సైతం పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుపతి–కాజీపేట్, హైదరాబాద్–నర్సాపూర్, హైదరాబాద్–తిరుపతి, విజయవాడ–నాగర్‌సోల్, మచిలీపట్నం–సికింద్రాబాద్, తిరుపతి–సికింద్రాబాద్, హైదరాబాద్–తిరుపతి, అకోలా–తిరుపతి, పూర్ణ–తిరుపతి, ధర్మవరం–మచిలీపట్నం తదితర మార్గాల్లో నడిచే 20 రైళ్లను అక్టోబర్ నెలాఖరు వరకు పొడిగించనున్నారు. కాకినాడ–లింగంపల్లి మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కాకినాడ–లింగంపల్లి (07439/07440) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 9.10 గంటలకు నాంపల్లి నుంచి బయలుదేరి, మర్నాడు ఉదయం 9.15 గంటలకు లింగంపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 6.25 గంటలకు లింగంపల్లి నుంచి బయలుదేరి, మర్నాడు ఉదయం 7.10 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

సీసీ కెమెరాలు తిప్పేస్తున్నారు!

ఆర్టీసీ బస్సుల్లో పక్క చూపు చూస్తున్న సీసీ కెమెరాలు

- ప్రయాణికుల భద్రత కోసమే వాటి ఏర్పాటు..
- కానీ, అవి తమపై నిఘా కోసమేనని డ్రైవర్లలో భయం
- దీంతో వారే కెమెరాలను పక్కకు తిప్పేస్తున్నారంటున్న అధికారులు
- ఇటీవల ఓ ఉన్నతస్థాయి సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన అధికారులు
- డ్రైవర్లకు అవగాహన కల్పించాలని ఉన్నతాధికారుల నిర్ణయం



సాక్షి, హైదరాబాద్‌: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోణంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు ఇప్పుడు ఆర్టీసీ డ్రైవర్లను భయపెడుతున్నాయి. తమపై నిఘా కోసమే వాటిని ఏర్పాటు చేశారన్న అపోహలో ఉన్న డ్రైవర్లు గుట్టు చప్పుడు కాకుండా కెమెరాలను ఓ పక్కకు తిప్పేస్తున్నారు. దీంతో బస్సులోపల ప్రయాణికులు ఉండే భాగం కాకుండా, బస్సు గోడలు, కిటికీల ప్రాంతం కెమెరాల్లో రికార్డు అవుతోంది. తాజాగా బస్‌భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో అలాంటి డ్రైవర్లకు సీసీ కెమెరాలపై అపోహలు తొలగిపోయేలా అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

చర్యలు తీసుకుంటారన్న భయంతో..: ఇటీవలే ఆర్టీసీ దాదాపు 700 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను సమకూర్చుకుంది. ఇప్పటి వరకు కొన్ని ఏసీ బస్సుల్లో తప్ప మిగతా ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు లేవు. బస్సులో ఏ ఘటన జరిగినా స్పష్టంగా తెలుసుకునే వీలు లేకుండా పోతోంది. దీంతో ప్రయాణికుల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని భావించి, కొత్తగా కొనుగోలు చేసే బస్సుల్లో వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. ఇలా కొత్త సూపర్ లగ్జరీ బస్సులను కంపెనీ నుంచి వచ్చినవి వచ్చినట్టు రోడ్డెక్కిస్తున్నారు. ఆ బస్సుల్లో లోపల డ్రైవర్ క్యాబిన్ ఎదురుగా ఒక కెమెరా, డ్రైవర్ క్యాబిన్ వెనక మరో కెమెరా ప్రయాణికులు కనిపించేలా ఉంటాయి. మరో కెమెరా బస్సు వెనక రివర్స్ చేసేప్పుడు డ్రైవర్‌కు సౌలభ్యం కలిగించేలా ఉంటుంది. అయితే ఇప్పుడు క్యాబిన్ ముందువైపు ఉన్న కెమెరాను చూడగానే డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా సస్పెన్షన్ వేటు పడుతుండటమే దీనికి కారణం. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ వినియోగం సాధారణ విషయంగా మారింది. ఇంటి నుంచి కాల్ వచ్చినా, అత్యవసర పనులకు సంబంధించి ఫోన్ కాల్‌వచ్చినా డ్రైవర్లు మాట్లాడేస్తుంటారు. అయితే బస్సు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడటాన్ని నేరంగా పరిగణిస్తారు. అలాగే కొందరిలో డ్రైవింగ్‌లో అప్పుడప్పుడు ఏమరపాటు వ్యక్తమవుతుంటుంది. ఇలాంటివన్నీ సీసీ కెమెరాలో రికార్డు అవుతాయి. ఇది తమపై చర్యలకు కారణమవుతుందేమోనన్నది డ్రైవర్ల భయానికి కారణంగా ఉంటోందని అధికారులంటున్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లకు సంకటం..

దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో అడ్వాన్సు టికెట్ బుకింగ్ సమయంలో డ్రైవర్ ఫోన్ నంబర్‌ను కూడా తెలియజేస్తారు. ప్రయాణికులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి బస్సు ఎక్కడి వరకు వచ్చిందో వాకబు చేస్తుంటారు. కాగా, విశాఖపట్నం, బెంగళూరు లాంటి దూర ప్రాంతాల సర్వీసులు మినహా మిగతా బస్సుల్లో ఒకే డ్రైవర్ ఉంటున్నాడు. ప్రయాణికుల నుంచి ఫోన్ కాల్ వస్తే అతనే మాట్లాడాల్సి వస్తోంది. ఇది రికార్డయితే, దానిని కూడా నేరంగా పరిగణిస్తారన్న భయం డ్రైవర్లలో ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బస్సులో కెమెరా యాంగిల్‌ను తిప్పేస్తున్నారన్నది అధికారుల మాట. దీంతో డ్రైవర్లలో అపోహలు తొలగించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆ కెమెరాలు ప్రయాణికుల భద్రత కోసమే కేటాయించాన్న విషయాన్ని తెలిపి, వారిలో ఆందోళన పోగొట్టాలని అధికారులు నిర్ణయించారు.

రూ. 2 లక్షల పంట రుణాలు తీసుకోండి.. మాఫీ చేస్తాం

- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి భరోసా
- కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్‌: రైతులు బ్యాంకుల నుంచి రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ విధంగా తీసుకున్న రుణాలను తాము అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమం కోసం తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. చేవేళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఏర్పడే ఇందిరమ్మ రాజ్యంలో నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని పునరుద్ఘాటించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, ఫైలేరియా, డయాలిసిస్ పేషంట్లకు నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామన్నారు.

ఒక్క హామీ నెరవేర్చని కేసీఆర్

తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని చెప్పిన కేసీఆర్, అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమాన్ని విస్మరించారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రైతు వ్యతిరేకి అయిన కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలో 88 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర సంపదను తన కుటుంబసభ్యులకు దోచి పెడుతున్నారని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. వేల ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే పోలీసులను పంపి కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులు భరిస్తామని, ఇల్లు కట్టుకునే ప్రతి పేదవాడికి రూ.5 లక్షల సాయం చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

కేసీఆర్‌కు ఎదురుదెబ్బ ఖాయం

- అవినీతి ఎమ్మెల్యేలు అని చెప్పి మళ్లీ సీట్లా?
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ ధ్వజం
- కేసీఆర్‌కు అవినీతిలో ఆస్కార్ ఇవ్వొచ్చని ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ప్రకటించిన 115 మంది అభ్యర్థుల జాబితాను చూస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ తగలడం ఖాయమని స్పష్టమవుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ పేర్కొన్నారు. కనీసం 20 మంది ఎమ్మెల్యేలు దళిత బంధు పథకంలో 30శాతం లంచం తీసుకుంటున్నట్టు తనకు సమాచారం ఉందన్న కేసీఆర్.. ఆ అవినీతిని సమర్థిస్తూ మళ్లీ అభ్యర్థులుగా ఖరారు చేయడం దేనికి సంకేతమని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ''పాచిపోయిన కూరను మళ్లీ వేడి చేసినట్టు.. చెడిపోయిన ఎమ్మెల్యేలనే మళ్లీ ప్రజలకు అందించే ప్రయత్నంలో కేసీఆర్ ఉన్నారు. కేసీఆర్, ఆయన పార్టీ సిగ్గు తప్పిన విధానాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. సీఎం కేసీఆరే స్వయంగా పెద్ద అవినీతిపరుడు. అవినీతిలో ఆయన ఆవిష్కరిస్తున్న కొత్త విధానాలకు ఆస్కార్ స్థాయి అవార్డు ఇవ్వవచ్చు..''అని తరుణ్ ఛుగ్ వ్యాఖ్యానించారు.

మహిళలకు సీట్లు ఏవి?

అసెంబ్లీ, పార్లమెంట్‌లో మహిళలకు 30శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీలో ధర్నా చేశారని.. ఇప్పుడు బీఆర్‌ఎస్ 115 మంది అభ్యర్థుల్లో ఏడుగురే మహిళలకు టికెట్ ఇవ్వడం దేనికి సంకేతమని తరుణ్ ఛుగ్ నిలదీశారు. సొంత పార్టీలో మహిళలకు జరిగిన అన్యాయాన్ని కవిత ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో సీపీఐ, సీపీఎంలతో దోస్తీ కట్టి, కలిసే ఉంటామని ప్రకటించిన కేసీఆర్.. ఇప్పుడు వదిలేశారని పేర్కొన్నారు. కేసీఆర్ అవకాశవాద రాజకీయాలకు ఇది నిదర్శనమని.. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యమకారులను వాడుకుని వదిలేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు బీఆర్‌ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని, వచ్చేదీ బీజేపీ డబుల్ ఇంజన్ సర్కారేనని పేర్కొన్నారు.

బీజేపీ పార్లమెంటు కన్వీనర్ల నియామకం

జాయింట్ కన్వీనర్లు కూడా.. • 17 పార్లమెంటు నియోజకవర్గాలకు ప్రకటించిన కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నియమించారు. ఆయా లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని వివిధ జిల్లాల నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించారు. వివరాలు...

లోక్‌సభ స్థానం	కన్వీనర్	జాయింట్ కన్వీనర్
ఆదిలాబాద్	అయ్యన్నగారి భూమయ్య	కె.కిరణ్, మయూర్ చంద్ర
పెద్దపల్లి	పి.మల్లికార్జున్	ఎస్.వెంకటేశ్వర్ గౌడ్
కరీంనగర్	బోయినపల్లి ప్రవీణ్ రావ్	ఎం.దశరథ్‌రెడ్డి, ఎ.రవీందర్
నిజామాబాద్	జి.శ్రీనివాస్	జి.సదాశివ్
జహీరాబాద్	జి.రవికుమార్ గౌడ్	కాసర్ల శ్రీనివాస్, జగన్‌మోహన్ రెడ్డి
మెదక్	వి.రామ్మోహన్ గౌడ్	చింతా సంతోష్, కె. సంగమేశ్వర్ రావు
మల్కాజిగిరి	ఆర్.కె. శ్రీనివాస్	బండారి భాస్కర్, జేవీ నర్సింగ్‌రావు, ఎంఆర్‌ఎస్ రాజు
సికింద్రాబాద్	టి.రాజశేఖర్ రెడ్డి	---
హైదరాబాద్	ఎ.ఇంద్రసేనా రెడ్డి	కె.మహేశ్, ధర్మతేజ
చేవెళ్ల	ఎస్.మల్లారెడ్డి	కె.అనంతయ్య గౌడ్, ఎస్. అమరేందర్ రెడ్డి, జి.మోహన్ శ్రీనివాస్
మహబూబ్‌నగర్	బి.పవన్‌కుమార్ రెడ్డి	ఎ.నర్సింహ గౌడ్, భీమ్ రెడ్డి
నాగర్‌కర్నూల్	రాగి రామకృష్ణారెడ్డి	జి.కృష్ణయ్య, పి.కమలేశ్, ఎం.సంజీవ భరద్వాజ
నల్లగొండ	బండారు ప్రసాద్	మన్మథ రెడ్డి
భువనగిరి	బండారపు లింగస్వామి	కొంతం శ్రీనివాస్, సి.నారాయణ యాదవ్
వరంగల్	తాళ్లపల్లి కుమారస్వామి	ఎ.నాగరాజు, యుగంధర్ రెడ్డి, రఘునాథరెడ్డి
మహబూబాబాద్	ముస్కు శ్రీనివాస్ రెడ్డి	ఎస్.సతీష్, టి.దేవేందర్ రావు, జె.సంతోష్‌నాయక్
ఖమ్మం	ఎన్.రామలింగేశ్వర్ రావు	పి. నిరంజన్ రావు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

- హుజూర్‌నగర్ నుంచే పోటీచేస్తా: ఉత్తమ్
- కోదాడ, హుజూర్‌నగర్‌లో 50 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తాం



మఠంపల్లి, భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 నుంచి 80 వరకు ఎమ్మెల్యే సీట్లు గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ పార్టీ ఉప్పెనలో బీఆర్‌ఎస్ కొట్టుకుపోవడం తథ్యమని నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, అలాగే మఠంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తాను కార్యకర్తల అభీష్టం మేరకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను కార్యకర్తలంతా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అంగబలం, అర్థబలంతో ఎన్నికష్టాలు పెట్టినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా కార్యకర్తలంతా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మిలిటెంట్లలాగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ స్థానాల్లో 50 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తామని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఓపికతో వ్యవహరిస్తారని, రెండుసార్లు కేసీఆర్‌కు అధికారమిచ్చి.. ఇక మూడోసారి ఇచ్చేది లేదన్న నిర్ణయానికి వచ్చారని తెలిపారు. వ్యవసాయంలో అద్భుతాలు చేస్తున్నట్లుగా సీఎం చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని, దేశంలోనే క్రాప్ ఇన్సూరెన్స్ లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. హౌసింగ్ స్కీమ్‌లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అవినీతిలో ముందంజలో ఉందన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు పోలీసు వ్యవస్థను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఇసుక, మైనింగ్, వసూళ్లు, లిక్కర్ ఇలా అన్నిరకాలుగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి, పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు నేతల తాకిడి



దరఖాస్తు ఇస్తున్న కొనగాల మహేశ్

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే నేతలు గాంధీభవన్‌కు క్యూ కడుతున్నారు. బీఫారం కోసం దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించడంతో.. ఆ పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే నాయకులు గాంధీభవన్‌ను చుట్టుముడుతున్నారు. దరఖాస్తులు ఇచ్చి వెళ్తున్నారు. ఈనెల 18న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ 25వ తేదీన ముగియనుండగా, మంగళవారానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 300కు పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. మంగళవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్, కరీంనగర్ అసెంబ్లీ నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు తదితరులు.. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.



ద్వేషానికి ఏకైక చికిత్స స్నేహమే.
అది మాత్రమే కచ్చితంగా శాంతిని తేగలదు.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 23 ఆగస్టు 2023

మణిపూర్ గవర్నర్ మౌనమేల?

ఇంటి దీపమని ముద్దాడితే మీసాలు తెగకాల్చిందని సామెత. మణిపూర్‌లో కల్లోలం జాడలు కనబడినప్పుడు అక్కడున్నది 'డబుల్ ఇంజన్' సర్కారే కదా అని ఉపేక్షించిన కేంద్ర ప్రభుత్వానికి తదుపరి కర్తవ్యం బోధపడటం లేదని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. సోమవారం ప్రారంభం కావాల్సిన మణిపూర్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల గురించి 24 గంటలు గడిచినా అతీగతీ లేకపోవటం దాన్నే సూచిస్తోంది. ఆగస్టు మూడోవారంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని గత నెల 27న కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ ప్రకటించారు. అందుకు సంబంధించిన సిఫార్సును ఈనెల 4న లాంఛనంగా గవర్నర్ అనసూయ ఊకే ఆమోదానికి పంపారు. అసెంబ్లీ ప్రోరోగ్ అయింది గనుక నిబంధనల ప్రకారం పక్షం రోజుల ముందు అసెంబ్లీ సమావేశాలపై రాజ్‌భవన్ నుంచి నోటిఫికేషన్ వెలువడాలి. కానీ ఆశ్చర్యకరంగా అలాంటిదేమీ జరగలేదు. హింసాకాండ మొదలై నాలుగు నెలలు గడిచినా ఇంతవరకూ రాష్ట్రంలో ప్రశాంతత ఏర్పడలేదన్నది వాస్తవం. హత్యాకాండలో 160 మందికి పైగా మరణించగా వందలాది మంది పౌరులు గాయపడ్డారు. బాధితులు ఇప్పటికీ సహాయ శిబిరాల్లో తలదాచుకునే పరిస్థితులే ఉన్నాయి. భద్రతా బలగాలు సోదాలు నిర్వహిస్తూ పోలీస్ స్టేషన్ల నుంచి అపహరించిన మారణాయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకుంటున్నాయి. వివిధ నేరాలతో సంబంధమున్నదని భావిస్తున్న దాదాపు 1,500 మందిని అరెస్టు చేశారు. అయినా చెదురుమదురుగా ఎక్కడో ఒకచోట హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మరోపక్క కొండ ప్రాంతాలకు నిత్యావసర సరుకులు సరఫరా కాకుండా ప్రత్యర్థి మైతేయి తెగ అడ్డుకుంటున్నదని ఆరోపిస్తూ ఇంఫాల్-అస్సాంలోని సిల్చార్‌ల మధ్య ఉన్న 37వ నంబర్ జాతీయ రహదారిని కుకీలు దిగ్బంధించారు. ఇంఫాల్-నాగాలాండ్‌లోని దిమాపూర్ మధ్య గల రెండో నంబర్ జాతీయ రహదారిపై సైతం ఉద్యమకారుల దిగ్బంధంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. భద్రతా బలగాలు రంగంలోకి దిగినా పరిస్థితి ఇంకా పూర్తిగా మెరుగుపడలేదని మీడియా కథనాలు చెబుతున్నాయి.

సమస్యల వలయం నుంచి మణిపూర్ ఇంకా బయటపడలేదన్నది నిజం. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే భద్రతా కారణాల రీత్యా తాము హాజరుకావటం అసాధ్యమని వివిధ పార్టీల్లోని కుకీ తెగ శాసనసభ్యులు పదిమంది గవర్నర్‌కు విడివిడిగా వినతిపత్రాలు పంపిన మాట కూడా వాస్తవం. ఇందులో ఇద్దరు సభ్యులున్న అధికార కూటమి భాగస్వామ్య పార్టీ కుకీ పీపుల్స్ అలయెన్స్ కూడా ఉంది. నాగా తెగకు చెందిన మరో పదిమంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కావొద్దని మణిపూర్‌లోని యునైటెడ్ నాగా కౌన్సిల్ (యూఎన్‌సీ) కోరడాన్ని విస్మరించలేం. అంతేకాదు, అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి రాష్ట్ర సమగ్రత పరిరక్షణకు తీర్మానం చేయాలని మైతేయిలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మణిపూర్ సమగ్రత సమన్వయ కమిటీ (కొకోమీ) గత జూలైలో జరిపిన ర్యాలీలో డిమాండ్ చేయటం కూడా వాస్తవమే. అలాగని కేబినెట్ సిఫార్సుపై గవర్నర్ మౌనం వహించటం సరికాదు. రాష్ట్రంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ఉనికిలో ఉంది. 60 మంది సభ్యులుండే అసెంబ్లీలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు ఇప్పటికైతే మెజారిటీ ఉంది. ఆయనకు మద్దతు ఉపసంహరించుకుంటున్నామని ఎమ్మెల్యేలు ఎవరూ ప్రకటించలేదు. అసెంబ్లీ కూడా రద్దు కాలేదు. మణిపూర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గత మార్చిలో జరిగాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోగా వర్షాకాల సమావేశాలు నిర్వహించాల్సివుంది. అంటే వచ్చే నెల 2లోగా అసెంబ్లీ సమావేశం కావాలి. అటువంటప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయకపోతే అది రాజ్యాంగ సంక్షోభానికి దారితీయదా? గవర్నర్ విధి నిర్వహణ మంత్రివర్గం సలహాలకు లోబడివుంటుందని రాజ్యాంగంలోని 163వ అధికరణ చెబుతోంది. అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ లేదా దాని ప్రోరోగ్, అసెంబ్లీ రద్దు అధికారాలు గవర్నర్‌కు ఉంటాయని 174వ అధికరణ వివరిస్తోంది. అయితే మంత్రివర్గాన్ని సంప్రదించి మాత్రమే ఈ అధికారాలను వినియోగించాల్సి వుంటుందని హిమాచల్ ప్రదేశ్ స్పీకర్ దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2016లో తీర్పునిచ్చింది. మణిపూర్‌లో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడిందని గవర్నర్ భావించివుండొచ్చు. ప్రభుత్వానికి తగిన మెజారిటీ లేదని అనుకొనివుండొచ్చు. అదేమిటో ప్రకటించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌కు లేదా? అంతా సవ్యంగా ఉందనుకుంటే సమావేశాల నోటిఫికేషన్ విడుదలకు అభ్యంతరం దేనికి?

సమస్యలున్నప్పుడే ప్రజలెన్నుకున్న సభల ప్రాధాన్యత పెరుగుతుంది. చుట్టుముట్టిన ఉద్రిక్త పరిస్థితులను ఉపశమింపజేయడానికి అనుసరించాల్సిన మార్గాలపై చర్చిస్తే, సభ్యుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందిస్తే, ఏకగ్రీవ తీర్మానం ద్వారా ప్రజానీకానికి భరోసా ఇవ్వగలిగితే దాని ప్రభావం ఎంతో ఉంటుంది. అందుకు భిన్నంగా గవర్నర్ వ్యవహరించటం రాజ్యాంగ విరుద్ధం మాత్రమే కాదు, రాజ్యాంగ సంక్షోభానికి దారి తీసే చర్య కూడా. చిత్రమేమంటే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్‌ను నియమించాలన్న జూలై 5 నాటి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు ఫైలును మణిపూర్ సర్కార్ ఆమోదానికి కేంద్రం పంపింది. అదేమైందో తెలియదు. మణిపూర్‌లో సర్కారు ఉంటే అది సక్రమంగా పని చేస్తున్నదో లేదో తేల్చవలసిన బాధ్యత కేంద్రంపై ఉంది. నిరవధిక అనిశ్చితి మణిపూర్‌ను మరింత సంక్షోభంలోకి నెడుతుందని అందరూ గుర్తించాలి.

ఈసీ స్వతంత్రతను హరించే బిల్లు

విశ్లేషణ



గౌతమ్ భాటియా

భారత ఎన్నికల సంఘం తప్పనిసరిగా కార్యనిర్వాహక వర్గానికి అంటే ప్రభుత్వానికి దూరంగా, స్వతంత్రంగా ఉండాలనే నిబంధనకు అనుగుణంగానే, పార్లమెంటు ఆమోదించే ఏదైనా చట్టం ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎన్నికల కమిషనర్ల బిల్లులోని అసలు సమస్య 'సీఈసీ' ఎంపిక కోసం ఉద్దేశించిన త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని మార్చి, ప్రధాని నామినేట్ చేసే క్యాబినెట్ మంత్రిని చేర్చడం కాదు... ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో ప్రభుత్వమే నిర్ణయాత్మక పాత్రను పోషించడం! మరోమాటలో, ఇది కార్యనిర్వాహక వర్గానికి సీఈసీని నియమించే అధికారాన్ని ఇవ్వడమే. అంటే, ఒక ఆటగాడికే రిఫరీని నియమించే అధికారం ఇచ్చినట్లు!

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లు, 2023ను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టడం తీవ్ర వివాదానికి కారణమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (చీఫ్ ఎలక్షన్ కమిషనర్-సీఈసీ) ఎంపికపై అనూప్ బరన్‌వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ బిల్లు భర్తీ చేస్తుందనే విషయంపైనే ఎక్కువగా చర్చ జరిగింది. సీఈసీ ఎంపికను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ తప్పనిసరిగా చేయాలని సుప్రీంకోర్టు ఆ తీర్పులో పేర్కొంది. అయితే కొత్త ఎన్నికల కమిషనర్ల బిల్లు వల్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలోకి ప్రధానమంత్రి నామినేట్ చేసే క్యాబినెట్ మంత్రి వస్తారు. ఈ కారణంగానే అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ బిల్లు ఎలా బలహీనపరుస్తుందనే అంశంపై విమర్శలు కేంద్రీకృతమయ్యాయి. అయితే, తాము చేసిన ఏర్పాటు తాత్కాలికమనీ, పార్లమెంటు ఈ విషయంలో ఒక చట్టాన్ని ఆమోదించే వరకే ఇది అమలులో ఉంటుందనీ అత్యున్నత న్యాయస్థానం స్వయంగా గుర్తించిందనే వాస్తవాన్ని బిల్లు సమర్థకులు ఎత్తి చూపారు.

ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండటం, లేదా లేకపోవడంపై మాత్రమే దృష్టి సారించడం ద్వారా, ఈ చర్చలోని అసలైన విషయం పక్కకు పోతోంది. సీఈసీ కోసం ఉద్దేశించిన ఎంపిక కమిటీలో ప్రత్యేకంగా ఎవరు ఉండాలనే దానిపై కాకుండా, భారత ఎన్నికల సంఘం నిర్మాణాత్మకమైన, కార్యాచరణ స్వతంత్రతను కాపాడటం పైనే అనూప్ బరన్‌వాల్ కేసు తీర్పు ప్రధానంగా దృష్టి పెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(2), పార్లమెంటు చేసే ఏదైనా చట్టానికి లోబడి, సీఈసీ నియామక అధికారాన్ని రాష్ట్రపతికి కట్టబెడుతోంది. అనూప్ బరన్‌వాల్ కేసులో, సుప్రీంకోర్టు ఈ నిబంధనకు చెందిన చరిత్రను పరిశీలించింది. రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశ్యం ప్రకారం, భారత ఎన్నికల సంఘ స్వతంత్రతకు హామీ ఇచ్చే చట్టాన్ని పార్లమెంటు త్వరలో అమలు చేస్తుందని ఆశించింది. అయితే, పార్లమెంటు ఎన్నడూ ఇలాంటి చట్టాన్ని ఆమోదించకపోవడంతో, తీర్పునిచ్చిన న్యాయమూర్తుల అంచనాలు తారుమారయ్యాయి. ఇది



రాష్ట్రపతి (అంటే కార్యనిర్వాహక వ్యవస్థ) అధికారాలను ప్రభావవంతంగా శాశ్వతం చేసింది. సీఈసీని నియమించే అధికారాన్ని కార్యనిర్వాహక వ్యవస్థకు ఇవ్వడం అనేది భారత ఎన్నికల సంఘ స్వతంత్రతకు విరు ద్ధంగా ఉందనీ, తద్వారా ఇది తీర్పు చెప్పిన వారి ఉద్దేశం, రాజ్యాంగ రూపకల్పన రెండింటికీ పొసగడం లేదనీ ఉన్నత న్యాయస్థానం గుర్తించింది. దీనికి కారణం స్పష్టమే. పార్లమెంటరీ వ్యవస్థలో, అధి కార పార్టీ నుండి కార్యనిర్వాహక వర్గాన్ని ఎంచుకుంటారు. అందుకే ఎన్నికల క్రీడలో కార్యనిర్వాహకవర్గమే ఆటగాడిగా ఉంటుంది. ఇది కార్యనిర్వాహక వర్గానికి, అంటే ప్రభుత్వానికి సీఈసీని నియమించే అధికారాన్ని ఇవ్వడమే. అంటే, ఒక ఆటగాడికే రిఫరీని నియమించే అధికారం ఇచ్చినట్లు అవుతుంది.

రాజ్యాంగ బద్ధంగా ఏర్పడే ప్రజాస్వామ్య వ్యవస్థలలో- ఎన్నికల పర్యవేక్షక విభాగాలు అనేవి, అంటే ఎన్నికల కమిషన్లు, సమాచార కమిషన్లు మొదలైనవి, నాల్గవ శాఖా సంస్థల విభాగానికి చెందుతాయి. ఓటు హక్కు, సమాచార హక్కు మొదలైన పౌర హక్కులను ప్రభావవంతంగా మలచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా పర్యవేక్షించడం, అమలు చేయడమే వాటి ప్రాథమిక పని. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం, ఈ నాల్గవ శాఖా సంస్థలు సమర్థవంతంగా, కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం) నుండి స్వతంత్రంగా ఉండాలి. ఎందుకంటే ప్రభుత్వ మితిమీరిన జోక్యాన్ని తనిఖీ చేయడం ఈ సంస్థల పాత్రలలో ఒకటి.

ఈ అంతర్దృష్టి అనూప్ బరన్‌వాల్ కేసు తీర్పులో అంతర్భాగంగా ఉంది. భారత ఎన్నికల సంఘానికి సంబంధించి ఒక చట్టాన్ని రూపొందించే అంతిమ అధికారం పార్లమెంటుకు ఉందని రాజ్యాంగం స్వయంగా స్పష్టం చేసింది కాబట్టే సుప్రీంకోర్టు తన త్రిసభ్య కమిటీని మధ్యంతర ఏర్పాటు అని పేర్కొంది. అయితే, న్యాయస్థానం కూడా గుర్తించినట్లుగా, ఇది హద్దులేని లేదా తనిఖీ చేయని అధికారం మాత్రం కాదు. భారత ఎన్నికల సంఘం తప్పనిసరిగా కార్యనిర్వాహక వర్గానికి అంటే ప్రభుత్వానికి దూరంగానూ, స్వతంత్రంగానూ ఉండాలనే నిబంధనకు అనుగుణంగానే, పార్లమెంటు ఆమోదించే ఏదైనా చట్టం ఉండాలి. కాబట్టి, ఎన్నికల కమిషనర్ల బిల్లులోని సమస్య సీఈసీ ఎంపిక కోసం ఉద్దేశించిన త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని మార్చడం కాదు. ఎందుకంటే కొత్త పాలనావ్యవస్థలో, కార్యనిర్వాహక వర్గానికి స్పష్టమైన మెజారిటీ ఉంది - అందువలన, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో ప్రభుత్వమే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆచరణను పరిశీలిస్తే, ఈ విషయంలో భారతదేశం చాలా దూరంగా ఉందని మరింత స్పష్టంగా తెలుస్తుంది. చాలా ప్రజాస్వామ్య దేశాల్లో, ఎన్నికల కమిషన్‌ను నియమించే విధానం పక్షపాత రహితంగా ఉంటుంది. పైగా, ఈ నియామకం విషయంలో చాలామందికి జోక్యం ఉంటుంది. ఉదాహరణకు, పార్లమెంటులో మూడింట రెండు వంతుల ఆమోదం అవసరం. లేదా మంత్రులు, ప్రతిపక్షాలు, పౌర సమాజ సభ్యులు, బహుళ-సభ్యుల కమిటీ పాత్ర కీలకం. ఎన్నికల సంఘం ఎంపికలో కార్యనిర్వాహక ఆధిపత్యం ఉండకూడదనే సంకల్పమే దీనంతటికీ కారణం. కాబట్టి, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిని మినహాయించడం గురించి కాక, భారత ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మొత్తం చర్చను పునర్నిర్మించడం అత్యవసరం. అంతకుమించి, అధికారంలో ఉన్న పార్టీతో సంబంధం లేకుండా ఎన్నికల కమిషన్ స్వతంత్రతను నిర్ధారించే నియామకాల కోసం ఒక యంత్రాంగాన్ని రూపొందించడంలో పార్లమెంట్, పౌర సమాజం కలిసి పనిచేయడం చాలా అవసరం.

వ్యాసకర్త ఢిల్లీ న్యాయవాది
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదే వేదిక



మీరు మీ రాతలకు మరింత స్వేచ్ఛనూ, అధిక ఆదాయాన్నీ కోరుకునే జర్నలిస్టు అయితే నేరుగా ఇదే వేదిక మీద (ట్విట్టర్/ఎక్స్) ప్రచురించండి.

- ఎలాన్ మస్క్, 'ఎక్స్' అధినేత

బలహీనమయ్యామా?



కోవిడ్ అనంతరం, వైరల్ జ్వరాలు ఇంతకుముందులా 2-3 రోజుల్లో నయం కావడం లేదు. వారం నుంచి పది రోజులు తీసుకుంటున్నాయి. ఎవరైనా గమనిస్తున్నారా?

- తుషార్ గుప్తా, సంపాదకుడు

బతకనీయరా?



పాకిస్తాన్‌లో క్రైస్తవుల మీద దాడి సాగుతూనే ఉంది. తహరీక్-ఎ-లబ్బైక్ పాకిస్తాన్ ఇస్లామిస్టులు పట్టపగలు జారావాలాలోని చర్చీ గోడల మీద అల్లానూ, మహమ్మద్‌నూ కీర్తిస్తూ రాశారు. ఇప్పుడు చర్చీ గనక వాటిని తొలగిస్తే, మళ్లీ దైవదూషణ పుకార్లు లేచి హింసా ప్రమాదం ఉంటుంది.

- ఫరాజ్ పెర్వాయిజ్, క్రైస్తవ యాక్టివిస్ట్

ఏమవుతున్నారు?



పాకిస్తాన్‌లోని ముస్లిమేతరుల జనాభా 1947లో 23 శాతంగా ఉండింది. 2023లో వారి జనాభా కేవలం 3 శాతం. ఇది సున్నా శాతం కావడానికి ఎన్నేళ్లు పడుతుందో లెక్కించండి.

- ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఎఫ్‌బీఐని రద్దు చేస్తా!



ఎఫ్‌బీఐ (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్)కి 35,842 మంది ఉద్యోగులున్నారు. ఇందులోని 56 శాతం మంది ప్రొఫెషనల్ బ్యూరోక్రాట్లు. వీరందరినీ తక్షణం తొలగించాలి. కేవలం 44 శాతం ఉద్యోగులు మాత్రమే స్పెషల్ ఏజెంట్లు, నిఘా విశ్లేషకులు - ఈ 15,770 మందిని ఇదే ప్రత్యేకమైన పని చేస్తున్న ఇతర న్యాయ అమలు యంత్రాంగాల్లో సర్దుబాటు చేయాలి.

- వివేక్ రామస్వామి, అమెరికా 'అధ్యక్ష అభ్యర్థి'

ఎందుకీ ఉదారత?



ఇటీవల పార్లమెంటులో మోదీ ప్రస్తావించినట్టుగా, 1974లో కచ్చాతీవు ద్వీపాన్ని శ్రీలంకకు భారత్ బహుమానంగా ఇచ్చింది. అదొక్కటే మన ఏకపక్ష ఉదారతకు ఉదాహరణ కాదు. 1953లో మణిపూర్ అన్నపూర్ణ కాబా లోయను మయన్మార్‌కు భారత్ బహుమానంగా ఇచ్చింది. బదులుగా మనవే అయిన కోకో ద్వీపాల మీద మన ఆధిపత్యాన్ని నిలుపుకోవడంలో విఫలమైంది. 1954లో చైనీస్ దళాలతో ఏ క్విడ్ ప్రో కో లేకుండానే టిబెట్ మీద అతిప్రాదేశిక హక్కులను వదులుకుంది. ఇక (సింధునదీ జలాల వాటాలో ఉదారతకు తోడుగా), 1972లో చర్చల బల్లమీద ఏ విధమైన ప్రతిఫలం పొందకుండానే పాకిస్తాన్‌కు యుద్ధ ఫలాలను వదులుకుంది.

- బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

పోస్టాఫీసులకు అప్పగించాలి!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 'స్పెషల్ సమ్మరీ రివిజన్' పేరుతో ఓటర్ లిస్టులను అప్‌డేట్ చేసే ప్రక్రియ నడుస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి 1,000 మంది నుంచి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసి ఓటర్ల లిస్టు అప్‌డేట్ చేసేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)లను నియమించడం జరిగింది. వీరు, తమ బూత్‌ల పరిధిలో ఇంటింటికీ తిరిగి చనిపోయిన ఓటర్లను తొలగించడం, 18 ఏళ్ళు నిండిన, కొద్ది నెలల్లో 18 ఏళ్ళు నిండుతాయన్న వారికి ఓటు హక్కును కల్పించడం, ఓటర్ లిస్టులో పేర్లు, ఇంటి అడ్రస్‌లలో తప్పులుంటే సరిచేయడం చేస్తున్నారు. ఒక నియోజకవర్గంలోని ఓటర్లు, అదే నియోజకవర్గంలో మరో నివాసానికి మారడం, ఒక పోలింగ్ బూత్ నుండి మరొక పోలింగ్ బూత్ పరిధికి మారడం, ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి నివాసం మారడం తదితర మార్పులతో కొత్త ఓటర్ల లిస్ట్ రూపొందించడం శరవేగంగా జరుగుతోంది.

కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి ఓటర్ల జాబితా రూపకల్పనలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వాములను చేయడం జరిగింది. ఈ ప్రక్రియ దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఒక ప్రహసనంగా మారి అధికార పార్టీ, ప్రతి పక్షాల మధ్య వాగ్వివాదాలకు తావిస్తోంది. నేడు అత్యాధునిక కంప్యూటర్లు, ట్యాప్‌లు, యాప్‌ల వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కేవలం ఎన్నికల సమయంలోనే ఓటర్ లిస్టులను అప్‌డేట్ చేయటం కాకుండా, దీనిని నిరంతర ప్రక్రియగా మార్చవలసిన అవసరం ఉంది. అలాగే ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న విషయమూ తెలిసిందే (కోవిడ్ కారణంగా 2021లో జన గణన జరగలేదు). ఈ జనాభా లెక్కల సేకరణను కూడా నిరంతరం జరిగేలా చూడవచ్చు. గతంలో ఈ పనులు స్కూల్ టీచర్స్ చేసేవారు. ఈ విధుల నిర్వహణ సమయంలో టీచర్లు బడులను వదిలి ఊళ్లలో తిరగడం వల్ల పిల్లల చదువులు అటకెక్కేవి.

దీనిని నివారించడానికి మారిన పరిస్థితుల్లో పోస్టల్ (తపాలా) సిబ్బందికి ఈ విధులను అప్పగించడం సముచితంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా నగర స్థాయి నుండి గ్రామీణ స్థాయి వరకు పోస్టల్ వ్యవస్థ విస్తరించి ఉండడం, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వచ్చాక భౌతికంగా ఉత్తరాల రూపంలో సమాచారాన్ని అందించడం, పొందడం తగ్గిపోయిన నేపథ్యంలో పోస్టాఫీసులకు ఈ బాధ్యతలు అప్పగించడం సబబే. పోస్ట్‌మ్యాన్ తన పరిధిలో ఎవరు పుట్టినా, చనిపోయినా కంప్యూటర్‌లలో అప్‌డేట్ చేసే విధంగా ట్రైనింగ్ ఇవ్వవచ్చు. అలానే కంప్యూటర్‌లో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు వచ్చేలా ఆప్షన్ సెట్ చేస్తే, ఆటోమాటిక్‌గా అది అటువంటివారి లిస్టును సిద్ధం చేస్తుంది. ఈ ప్రక్రియ సాధ్యాసాధ్యాలను కేంద్రం పరిశీలించాలి.

- డాక్టర్ టి. సేవకుమార్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు
మొబైల్: 75697 02090

భాష మగవారిది మాత్రమే కాదు

తూర్పు తీరం



కె. ఎన్. మల్లీశ్వరి

నాలుగేళ్ల కిందట ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడిన సందర్భం. భారత పైలట్ పాకిస్తాన్‌లో బందీగా ఉన్నప్పటి కాలం. దేశమంతా యుద్ధం కావాలనో, వద్దనో తీవ్రంగా నినదిస్తున్న సమయంలో పాక్ ప్రధాని, బందీ అయిన భారత పైలట్‌ని విడుదల చేస్తామని ప్రకటన చేశారు. అది భారతదేశ విజయంగా, మరీ ముఖ్యంగా ప్రధాని సాధించిన వీరోచిత విజయంగా మీడియా ప్రశంసలు చేసింది. అందులో ఒక తెలుగు చానల్ ఒకడుగు మరీ ముందుకేసి, 'ఈడు మగాడ్రా బుజ్జీ!' అన్న శీర్షికతో, మోదీ ఫోటో పెట్టి అరగంట స్టోరీ చేసింది. పాక్ పీచమణిచిన మగాడిగా జేజేలు పలికింది. ఈ శీర్షికలో అతిశయోక్తులు, వ్యక్తిపూజ, వాస్తవ వక్రీకరణలతో పాటు ప్రమాదకరంగా అనిపించిన విషయం, 'మగతనం' అనే మూసని మీడియా ప్రజల్లోకి ఎలా వ్యాపింపజేస్తోందీ అన్నది.

ఇది మగవారి భాషా ప్రపంచం. అక్షరాలు, పదాలు, వాక్యాలు వారికి అనుగుణంగా వారి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. మన వాడుకభాష, చాలా శాతం స్త్రీలను అసమర్థులుగా, సుకుమారులుగా, అమాయకులుగా, శక్తిహీనులుగా చూపిస్తుంది. నిజానికి స్త్రీల పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. కానీ వాటిని ప్రతిబింబించే భాషని మనమింకా తయారు చేసుకోలేదు. ఆయా మార్పులను నలుగురిలోకి తీసుకువెళ్లాల్సిన భాష కూడా జెండర్ మూసలోనే ఉందీ అంటే మార్పు స్వభావం మీదనే సందేహం కలుగుతుంది. దీనిని దేశ అత్యున్నత న్యాయ స్థానం గుర్తించింది కనుకనే కంబాటింగ్ జెండర్ స్టీరియోటైప్స్' పేరుతో ఇటీవల హాండ్ బుక్‌ని విడుదల చేసింది. భాషని ప్రజాస్వామ్యీకరించడంలో ఇది పెద్ద మలుపు.

ఈ పుస్తకానికి జస్టిస్ ధనుంజయ వై. చంద్రచూడ్ రాసిన ముందుమాట విలువైనది. చట్టం ముందు అందరూ సమానులేననీ, పక్షపాతం, భయం, చెడు తలపు లేకుండా న్యాయం అందిస్తామనీ చేసిన ప్రమాణానికి జెండర్ మూస ధోరణి ఆటంకం కలిగిస్తుందని అంటారు. న్యాయానికి జీవం పోసేది భాషేననీ, దాని ద్వారానే చట్టబద్ధ విలువలు నలుగురికీ చేరతాయనీ, అటువంటి భాష జెండర్ వివక్షతో ఉంటే, చేసిన ప్రమాణాలకి కట్టుబడినట్లు కాదంటారు. న్యాయవాదులు, న్యాయమూర్తులతో సహా న్యాయభాషకి అంతర్గర్భితంగా పితృస్వామిక స్వరం ఉంటుందని చెప్పడం ఇన్నాళ్ళ స్త్రీల పోరాటాలు సాధించిన విజయం. ఇటువంటి వివక్షా స్వరంతో కేసులు వాదించడం, తీర్పులు చెప్పడం, ఆయా తీర్పులని సమాజం ఆదర్శంగా తీసుకోవడం గురించిన ఆవేదన ఈ ముందుమాటలో కనిపిస్తుంది.

రెండు దశాబ్దాల కిందట 'పాపులేషన్ సర్వీసెస్



ఇంటర్నేషనల్' అనే సామాజిక సేవాసంస్థ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం కోసం కొత్త ప్రచారం నిర్వహించింది. 'పులిరాజా ఎవరు?', 'పులిరాజాకి ఎయిడ్స్ వస్తుందా?' అన్న ప్రశ్నలతో మొదలైన ప్రచారం పెద్ద దుమారం రేకెత్తించడమే కాకుండా మగవారి లైంగిక సామర్థ్యాల చుట్టూ అల్లుకున్న అనేక భ్రమలను పటాపంచలు చేసింది. నిజానికి ఇది ఎయిడ్స్ గురించిన ప్రచారమే కానీ సాధించిన ప్రయోజనాల్లో లైంగిక మూస ఆలోచనలను భాష ద్వారా బద్దలు కొట్టడం ముఖ్యమైనది. 'వాడికేంటి వాడు మగాడు, వాడు రాజా, వాడు పులి, ఎందరితోనైనా తిరుగుతాడు, అది మగతనం' అన్న ఆధిక్యపు ఆలోచనల మీద చావుదెబ్బ కొట్టింది ఆ ప్రచారం. దాన్ని అంది పుచ్చుకున్న సమాజం, మరిన్ని ప్రయోగాలు చేస్తే బావుండేది. అక్కడితో అది సద్దుమణిగింది.

తీర్పులు ఇవ్వడంలోనూ, తీర్పు ప్రతిని రాయడంలోనూ ప్రమాదకరమైన జెండర్ మూసనుంచి తప్పించుకోవడానికి 'కంబాటింగ్ జెండర్ స్టీరియోటైప్స్' మార్గదర్శకంగా ఉంటుంది. భాషాపరంగా స్త్రీలకి, పురుషులకి అంట గట్టిన అనేక మూసలను తిరస్కరిస్తూ ప్రత్యామ్నాయ పదాలను, వాక్యాలను, భావాలను విస్తృతంగా ఉదాహరణ కోసం ఇచ్చారు. అందులో కొన్ని: విధేయమైన/ విశ్వసనీయమైన /మంచిభార్య అన్న పదాల స్థానంలో 'భార్య' అని మాత్రమే వాడాలని. 'ఈవ్ టీజింగ్' స్థానంలో 'స్ట్రీట్ సెక్సువల్ హెరాస్మెంట్'. 'హౌస్ వైఫ్' బదులు 'హోమ్ మేకర్', 'ప్రాస్టిట్యూట్' బదులు 'సెక్స్ వర్కర్', 'పెళ్లి కాని తల్లి' బదులు 'తల్లి' వంటివి.

కేవలం పదాలే కాకుండా అనేక 'మిత్'ల గురించి కూడా ఈ పుస్తకం వివరించింది. 'ప్రతీ స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది, పెళ్ళికాని స్త్రీలు పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోవడానికి సమర్థులు కారు, పురుషుల కన్నా స్త్రీలు నిష్క్రియాపరులు, బైటపనికి వెళ్ళే స్త్రీలు పిల్లల్ని బాగా చూసుకోరు, స్త్రీలు పురుషులవద్ద అణిగిమణిగి ఉండాలి, సంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించని స్త్రీలు మగవారితో లైంగికచర్యలకి సిద్ధంగా ఉన్నట్లు, అటువంటి దుస్తులు వేసుకున్న స్త్రీని ఆమెకి ఇష్టం లేకున్నా పురుషుడు తాకితే అది ఆమె తప్పే' వంటి వాటికి చట్టపరిధిలో దీటైన సమాధానాలు ఇచ్చింది ఈ పుస్తకం. ఇటువంటి మార్పు కోరే పుస్తకాలు వ్యక్తిగత పరిధిలో ప్రచారం పొందడం కన్నా సమూహాలను ప్రభావితం చేసే వ్యవస్థల మార్గదర్శకాల్లో భాగం కావాలి. న్యాయపరిధికి అవసరమైనవి, న్యాయ వ్యవస్థ తయారు చేసుకున్నట్లు విద్యావ్యవస్థలో, మరీ ముఖ్యంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ఇటువంటి ప్రయత్నాలు జరగాలి. సమాజం ఎంత భావ విప్లవం తీసుకువచ్చినా దాన్ని మోసుకుపోవాల్సిన భాష మూసనీ, వివక్షనీ వదుల్చుకోకపోతే విప్లవాలన్నీ అసంపూర్ణాలే అవుతాయి.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
ఈ-మెయిల్: Malleswari.kn2008@gmail.com

మంచి చెడు-పాలు నీళ్లు

మంచి, చెడుల మిశ్రమం మనిషి. 'కోరిక' అనే సామాన్యార్థంలో 'తాపత్రయం' అనే మాటను తరచూ రోజువారీ సంభాషణలలో వింటూవుంటాం. తాపము, త్రయము అనే రెండు మాటల సమ్మేళనమైన ఈ మాటకు 'ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనే మూడింటికి సంబంధించిన ఖేదం' అన్నది అసలైన అర్థం. జ్వరం, జలుబు, దగ్గు వంటి సామాన్య రుగ్మతలు మొదలుకొని మనిషిని అనేక రకాలుగా బాధపెట్టగలిగే మధుమేహం, గుండెజబ్బు వంటి ప్రమాదకరమైన తన సొంత శరీర సంబంధ రుగ్మతల వలన కలిగే అపరిమిత ఖేదం ఆధ్యాత్మికం. తన భార్య, పిల్లలకు సంభవించే బాధల వలన కలిగే ఖేదం ఆధిభౌతికం. అకస్మాత్తుగా, దైవికాలైనట్టి ప్రకృతి వైపరీత్యాల వలన కలిగేది ఆధిదైవికం.

జ్యోతిర్మయం

ఎలాంటి మనిషినైనా ఈ తాపత్రయం కొన్ని సందర్భాలలో లొంగదీసుకుని విచక్షణను పోగొట్టుకునేలా చేసి చెడువైపునకు దారి మళ్ళించే ప్రభావం కలిగినదై ఉంటుంది. అయితే ఇందులో గ్రహించవలసిన అంశం ఏమిటంటే, అది అతడి ప్రవృత్తిలో శాశ్వతమైన మార్పులు చోటుచేసుకోవడానికి సాధారణంగా దారి తీయదు. కొన్ని రోజుల తరువాత తాను చేసిన పనికి తానే చింతించి, పశ్చాత్తాప పడటం కూడా కొందరిలో జరగవచ్చు. అందువలన మనుషులలో ఎవరూ శాశ్వతమైన మంచివారుగా, అలాగే శాశ్వతమైన చెడ్డవారుగా ఉండరన్నది గ్రహించాలి. ఈ న్యాయాన్ని అర్థం చేసుకున్నప్పుడు, ఏ మనిషినైనా కేవలం మంచివానిగా లేదా పూర్తిగా చెడ్డవానిగా చూడడం వివేకవంతులు చేయవలసిన పని కాదు అని తెలుసుకుంటాము.

'క్షీర నీరంబుల వేరు చేసి, పాల/గ్రోలు రాయంచలట్టుల గొప్పవారు/మంచిగుణముల నెలమి గ్రహించి యెపుడు/విడిచి పుత్తురు తప్పుల వేడ్కతోడ' అని 'చంద్రకళా స్వయంవరము' అనే పేరున్న ఒక పూర్వ నాటకపు ప్రస్తావనలో నాటకకర్త చెప్పారు. ఆయన చెప్పినట్లు మనుషులను వారు చేసే పనులను బట్టి మాత్రమే బేరీజు వేసి, పాలునీళ్ళు కలిసివున్న మిశ్రమం నుండి పాలను నేర్పుగా వేరు చేసి నీళ్ళను పనికి రానివిగా గుర్తించి విడిచిపెట్టే హంసల వలె, ప్రతి మనిషి వివేకవంతుడై ప్రవర్తిస్తూ, ఎదుటి వ్యక్తిలోని మంచిని మాత్రమే గ్రహించి, చెడును వదిలిపెట్టి ప్రశాంత చిత్తులై ఉండాలి. అంతే తప్ప, కనిపించిన కొద్దిపాటి చెడుని భూతద్దంలో చూసి భంగ పడి తన మానసిక స్థితికి హాని కలిగించుకుని, సౌఖ్యానికి దూరం కాకూడదు అని గ్రహించాలి.

- వెంకట్ భట్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి రా.10.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** విశాఖ తె.5.04 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.10.19 నుండి 11.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.36 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** రా.8.04 నుండి 9.42 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.19.

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్



సమావేశంలో పాల్గొన్న భద్రాద్రి జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లాల అధికారులు

బూర్గంపాడు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల ఉన్నతాధికారులు భద్రాద్రి జిల్లా సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలను కలెక్టర్, ఎస్పీ వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని, ఎన్నికల సమయంలో మద్యం, నగదు సరఫరాను పూర్తిగా నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు వచ్చి, వెళ్లే మార్గాల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టనున్నట్లు వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సరిహద్దు రాష్ట్రాల సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సుకుమా జిల్లా కలెక్టర్ హరీశ్, ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పి.కరుణాకర్, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కట్టా రామచంద్రారెడ్డి, మల్లా రాజిరెడ్డి క్షేమమే

▶ మొదటి పేజీ తరువాయి

వాళ్ల క్షేమ సమాచారం కోసం ఆతృతంగా ఎదురుచూస్తున్న విప్లవ ప్రజానీకం, సంస్థలు, వారి కుటుంబీకులు, బంధుమిత్రులకు తెలియజేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలను ఆయోమయంలో పడేయడానికి, విప్లవ విజయంపై అవిశ్వాసం కలిగించడానికి పోలీసు, ఇంటలిజెన్స్ ఉన్నతాధికారుల కనుసన్నల్లో తరచూ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. పాలక వర్గాలు చేసే ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆమె కోరారు.

మావోయిస్టు పార్టీ ముఖ్య నేత అరెస్ట్

పోలీసుల అదుపులో అతడి భార్య రామి..



అశోక్‌రెడ్డి



రామి

చర్ల: మావోయిస్టు పార్టీ ముఖ్యనేత, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు అశోక్‌రెడ్డితో పాటు అతడి భార్య రామి అలియాస్ కుమారిని మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన కూసం అశోక్‌రెడ్డి అలియాస్ బాల్దేవ్ అలియాస్ వినయ్ మావోయిస్టు పార్టీలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు. అయితే..వీరిద్దరూ మధ్యప్రదేశ్‌లోని పాతార్సీ ప్రాంతంలో సంచరిస్తున్నారనే సమాచారం మేరకు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా పెట్టి ఇద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

వర్గీకరణ చేయకుంటే భూస్థాపితం చేస్తాం

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ అంశంలో మోసగించే రాజకీయ పార్టీలను భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. కొల్లాపూర్‌లో మంగళవారం నిర్వహించిన మాదిగల విశ్వరూప సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదిస్తే బీజేపీకి అండగా నిలబడదామని, లేదంటే ఆ పార్టీని నామరూపాల్లేకుండా చేద్దామని మాదిగలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ కూతురు కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో జైలుకు వెళ్తుందని దేశవ్యాప్తంగా ప్రచారం జరిగిందని.. కేసీఆర్ వారం రోజులు ఢిల్లీలో మకాం వేశారని ఆ తర్వాత ఏం జరిగిందో కవితపై కేసులు, చార్జిషీట్లు లేవని ఎద్దేవా చేశారు.

కేసీ వేణుగోపాల్‌తో భట్టి విక్రమార్క భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న భట్టి విక్రమార్క పార్టీ అధిష్టాన పెద్దలతో వరుసగా సమావేశమయ్యారు. మంగళవారం వేణుగోపాల్‌తో సమావేశంలో భాగంగా తాను నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్ర, తెలంగాణలో ప్రస్తుత రాజకీయాలు, అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమయ్యేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాలపై భట్టి సుదీర్ఘంగా చర్చించారు. కాగా, సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోనూ భట్టి సుమారు గంట పాటు భేటీ అయిన విషయం తెలిసిందే.

ఎస్సీలకు 22 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

టీపీసీసీ చీఫ్ రేవంత్‌కు మాల మహానాడు వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దళిత వర్గాలకు చెందిన నేతలకు ఈసారి కాంగ్రెస్ పార్టీ 22 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని మాల మహానాడు కోరింది. మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హుస్సేన్, ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతిరావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, కార్యదర్శి పిడతల శ్రీను తదితరులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో మాల అనుబంధ కులాల కోసం మాల సంక్షేమ భవన్‌ను నిర్మించాలని, ఇందుకోసం ఐదెకరాల భూమి, రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీల వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలని కోరారు.

ఆదిలాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఈమేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి కరుణ వాకాటి నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్టీయూ రిజిస్ట్రార్, రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు.

కారు మిస్సయిన వారికి.. డోర్లు ఓపెన్!

▶ మొదటి పేజీ తరువాయి

ఏయే నేతలు ఏ పార్టీ వైపు వెళ్తారనేది చర్చనీయాంశంగా మారింది.

ప్రత్యామ్నాయంపై అసంతృప్తుల లెక్కలు

ఉద్యమకాలం నుంచి పార్టీలో పనిచేస్తూ టికెట్లు ఆశిస్తున్నవారు, వివిధ సందర్భాల్లో బీఆర్‌ఎస్ గూటికి చేరినవారితో సుమారు 40కిపైగా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ బహుళ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. అలాంటి నేతల్లో ప్రస్తుతం టికెట్ దక్కనివారు తమ రాజకీయ భవిష్యత్తు, ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తమ రాజకీయ భవిష్యత్తుపై అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. అవకాశం దక్కనిచోట ఎందుకు ఉండాలని, ఇతర పార్టీల్లోకి వెళదామని అనుచరులు నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. దీనితో ఏ పార్టీలో చేరితే ఏ మేర ప్రయోజనం ఉంటుందన్న దానిపై అసంతృప్తులు అంచనాలు వేసుకుంటున్నారు. ఇలాంటి నేతలతో కాంగ్రెస్, బీజేపీ కీలక నేతలు ఇప్పటికే మంతనాలు ప్రారంభించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో విభేదిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులను కూడా పార్టీలో చేరాలని ఆహ్వానిస్తున్నారు.

ఎవరెవరు.. ఏ దిశగా?

- బీఆర్‌ఎస్ టికెట్ దక్కని ఏడుగురు సిట్టింగ్‌లలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్ గూటికి చేరుకోవడం దాదాపు ఖాయమైంది. మిగతా సిట్టింగ్‌లలో బాపూరావు రాథోడ్, తాటికొండ రాజయ్య, ఆత్రం సక్కు, రాములు నాయక్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటనలు చేశారు. కానీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే నాటికి ఒకరిద్దరు పునరాలోచనలో పడే సూచనలు కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అనుచరులు కాంగ్రెస్‌లోకి వెళ్దామంటూ ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది.
- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ ట్విట్టర్ వేదికగా అసంతృప్తి ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ నుంచి రమేశ్ బాబాయి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కుమారుడు వికాస్‌రావు పోటీచేసే అవకాశం ఉండటంతో.. ఆయనకు రమేశ్ మద్దతు ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది.
- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కూడా తన రాజకీయ భవిష్యత్తుపై సన్నిహితులతో మంతనాలు జరుపుతున్నారు.
- పాలేరులో టికెట్ దక్కని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అనుచరులు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమై బీఆర్‌ఎస్‌ను వీడుదామంటూ విజ్ఞప్తి చేశారు. అయితే హైదరాబాద్‌లో ఉన్న తుమ్మలను మంత్రి హరీశ్‌రావు కలసి పార్టీతో కలసి సాగాలని కోరినట్టు సమాచారం.
- కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుతో బీజేపీ నాయకులు టచ్‌లోకి వచ్చినట్టు సమాచారం.
- జనగామ టికెట్ కోసం పోరాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తనకు టికెట్ లభించని పక్షంలో తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. రెండు దఫాలుగా అక్కడ గెలిచిన ముత్తిరెడ్డి.. బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వకుంటే బీజేపీవైపు అడుగు వేసే అవకాశం ఉందని ఆయన అనుచరులు చెప్తున్నారు.
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వీరేశం ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై అసమ్మతి వ్యక్తం చేస్తూ, టికెట్ ఆశించిన పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి తన రాజకీయ భవిష్యత్తుపై అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు.
- పెద్దపల్లి టికెట్ ఆశించిన నల్ల మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా ప్రకటించడంతోపాటు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు.
- వీరితోపాటు రామ్మోహన్‌గౌడ్ (ఎల్‌బీ నగర్), మన్నెం రంజిత్‌యాదవ్ (నాగార్జునసాగర్), బొమ్మెర రామ్మూర్తి (మధిర), మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, నల్లాల ఆనంద్ (మానకొండూరు), తీగల కృష్ణారెడ్డి (మహేశ్వరం), శశిధర్‌రెడ్డి (కోదాడ) తదితరులతో విపక్షాలు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.
- జహీరాబాద్‌లో టికెట్ ఆశించిన ఢిల్లీ వసంత్ 'యుద్ధం మిగిలే ఉంది..' అని ప్రకటన చేయగా.. పటాన్‌చెరు స్థానం ఆశించిన నీలం మధు ఈ నెల 24న తన రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తానని వెల్లడించారు.
- మాజీ మంత్రి, మాజీ ఎంపీ గెడ్డం నగేశ్ బోథ్ నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. ఆయన బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. దీనిపై తన అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది.
- సూర్యాపేటకు చెందిన డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జంగయ్యయాదవ్ కూడా.. మంత్రితో విభేదాల నేపథ్యంలో పార్టీని వీడే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ 'ఆపరేషన్ అసంతృప్తులు'!

బీఆర్‌ఎస్‌లో టికెట్ రాని అసమ్మతులపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేసింది. టికెట్‌రాని కీలక నేతలతోపాటు ఎమ్మెల్యేలను వ్యతిరేకిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు 'ఆపరేషన్ అసంతృప్తులు' చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాలపై ఆ పార్టీ కేడర్‌లోనే వ్యతిరేకత ఉన్నట్టుగా కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. ఆయా నియోజకవర్గాల్లో జనంలో ఉన్న వారెవరు? ఓట్లు వేయించగలిగిన వారెవరు? చేరిక అనంతరం పార్టీ ఇమేజ్‌కు దోహదపడేవారెవరు? బీఆర్‌ఎస్ అభ్యర్థులను గట్టిగా దెబ్బకొట్టగలిగేవారెవరు? తమ నాయకులకు ఇతోధికంగా దోహదపడే సమీకరణాలకు ఎవరు సరిపోతారు? అనే కోణాల్లో బీఆర్‌ఎస్ అసంతృప్తులను జల్లెడ పట్టి వెతికే పనిలో పడింది.

ఇప్పటికే చర్చలు మొదలు

పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి తదితరులు రంగంలోకి దిగారని.. బీఆర్‌ఎస్ అసంతృప్తులతో చర్చలు జరిపి పార్టీలోకి తీసుకువచ్చే బాధ్యతను ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు, జిల్లాల ముఖ్య నేతలకు అప్పగించారని తెలిసింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు, నల్లగొండ నుంచి వేముల వీరేశం, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి రాజయ్య, ఖానాపూర్ నుంచి రేఖానాయక్‌లతో ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్లు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులనూ ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్‌లో అన్యాయం జరిగినందున రాజకీయంగా తాము న్యాయం చేస్తామని.. తప్పకుండా టికెట్ ఇస్తామని.. లేదంటే పార్టీలో తగిన గౌరవం కల్పిస్తామని హామీ ఇస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలో కాంగ్రెస్ అగ్రనేతలతో నిర్వహించే బహిరంగ సభల్లో ఈ చేరికలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో 26న చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఆధ్వర్యంలో జరగనున్న సభలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాం నాయక్, మరికొందరు నేతలను చేర్చుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిసింది.

కేసీఆర్‌పై నిఘా పెంచాలి: నాగం



కందనూలు: సీఎం కేసీఆర్‌పై నిఘా పెట్టాలని, ఆయన విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవినీతిపరులపై చర్యలు తీసుకోకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో వారికే టికెట్లు కేటాయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వం రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడుతూ మాఫియాను పెంచి పోషించిందని ఆరోపించారు. పోరాటాలు చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని దొంగలపాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల్లో మార్కండేయ ప్రాజెక్టు పూర్తి చేస్తానని, లేకపోతే తనకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తానన్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తనకు మద్దతుగా ప్రచారం చేస్తే కారులో డీజిల్ పోయించి.. ఖర్చులకు డబ్బులు కూడా ఇస్తానని మర్రికి సూచించారు.

ఆ 115 మంది ఆస్తుల లెక్కలు తీయండి

కార్యకర్తలకు ఎంపీ కోమటిరెడ్డి పిలుపు



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్ ప్రకటించిన 115 మంది అభ్యర్థుల ఆస్తుల లెక్కలు తీయాలని టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ వివరాలను సేకరించి ప్రజల ముందుంచాలని చెప్పారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ టూర్‌లో భాగంగా కర్ణాటకలోని కూర్గ్‌లో ఉన్న ఆయన మంగళవారం ఈమేరకు స్పందించారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారని, కేసీఆర్ రాజకీయ ప్రస్థానం మొదలైందే కాంగ్రెస్ నుంచి అని గుర్తుచేశారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, కల్వకుర్తి, శ్రీరాంసాగర్ లాంటి ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్సేనని, 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో కేసీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో పింఛన్లు ఒకటో తేదీకల్లా ఇచ్చామని, బీఆర్‌ఎస్ హయాంలో మాత్రం 15వ తేదీకి కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. విశ్వవిద్యాలయాల్లో కనీసం బాత్‌రూంలు కట్టించలేని ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని అని ఎద్దేవా చేశారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులోకి నెట్టిన కేసీఆర్‌కు కాంగ్రెస్ గురించి ప్రశ్నించే హక్కు లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయాంలో 32 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తే కేసీఆర్ ప్రభుత్వం మాత్రం ఓట్ల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తోందని చెప్పారు.

ఏఐసీసీని రేవంత్ తప్పుదోవ పట్టించారు

- జనగామ కాంగ్రెస్ విధేయుల పేరుతో మల్లికార్జున ఖర్గేకు లేఖ
- జనగామ డీసీసీ అధ్యక్షుడి నియామకాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: జనగామ డీసీసీ అధ్యక్షుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని నియమించే విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించారంటూ జనగామ కాంగ్రెస్ విధేయుల పేరుతో కొందరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. గాంధీభవన్ వర్గాల్లో ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది. ప్రతాప్‌రెడ్డి దశాబ్దాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి ఏఐసీసీకి పంపిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారని, కానీ ఆయన నాలుగు పార్టీలు మారి నాలుగేళ్ల క్రితమే కాంగ్రెస్‌లో చేరారని కాంగ్రెస్ విధేయులు తమ లేఖలో తెలిపారు. 'ప్రతాప్‌రెడ్డిని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి ప్రతిపాదించారని ఏఐసీసీకి పంపిన లేఖలో రేవంత్ పేర్కొన్నారు. జనగామ జిల్లాలో కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ప్రతాప్‌రెడ్డి జనగామ జిల్లాకు చెందిన వ్యక్తి కాదు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఆయనను జనగామ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే'అని జనగామ కాంగ్రెస్ విధేయుల లేఖలో పేర్కొన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడి నియామకాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

టికెట్ల కేటాయింపుపై సీఎం కేసీఆర్ పునరాలోచించుకోవాలి

- లేదంటే బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు వెనుకాడం: ముదిరాజ్ మహాసభ హెచ్చరిక

పంజగుట్ట (హైదరాబాద్) : ముదిరాజ్‌ల పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శీతకన్ను వేయడం బాధాకరమని, అసెంబ్లీ టికెట్ల జాబితాపై ఆయన పునరాలోచించుకోవాలని ముదిరాజ్ మహాసభ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జగన్ ముదిరాజ్ మాట్లాడుతూ...తమకు సీట్ల కేటాయింపులో సీఎం కేసీఆర్ అన్యాయం చేశారన్నారు. ఈ నెల 25న ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాశ్ ముదిరాజ్ అధ్యక్షతన ప్లీనరీ నిర్వహించనున్నామని, ఆలోగా సీఎం కేసీఆర్ ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని కోరారు. తమకు సీట్లు కేటాయిస్తేనే ఎన్నికల్లో బ్రహ్మరథం పడతామని లేదంటే బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు.

ఆ రెండుచోట్లా కేసీఆర్‌ను ఓడిస్తాం

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని రాజకీయంగా బొందపెడతామని, కేసీఆర్‌ను గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లోనూ ఓడిస్తామని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ హెచ్చరించింది. గ్రామాల్లో, మండల, పట్టణాల్లో బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మను దహనం చేయాలని పిలుపునిచ్చారు.

ఆ భూ కేటాయింపుపై జోక్యం చేసుకోలేం

పార్టీలకు భూములు ఇవ్వడంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సహా ఇతర పార్టీలకు కేటాయించిన భూముల విషయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ల వద్ద నుంచి ప్రభుత్వం భూమిని సేకరించలేదని, వారికి పార్టీలకు కేటాయించిన భూమిపై హక్కులు లేవని వ్యాఖ్యానించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు భూ కేటాయింపులను సవాల్ చేస్తూ సికింద్రాబాద్ తిరుమలగిరి వాసులు హైకోర్టులో 310 పిటిషన్లు వేశారు. వీటిలో 222 పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సుబ్రహ్మణ్యం వాదిస్తూ... బోయినపల్లిలోని సర్వే నంబర్ 503, 502లో 10 ఎకరాలను కాంగ్రెస్ పార్టీకి, గండిపేట మండలం కోకాపేటలోని సర్వే నంబర్ 239, 240 సర్వే నంబర్లలో 11 ఎకరాలను బీఆర్‌ఎస్‌కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. బోయినపల్లిలోని మురికివాడల ప్రజలకు ఇళ్లు కేటాయిస్తామని మూడు దశాబ్దాలుగా హామీలు ఇస్తున్నా.. ఇప్పటికీ అది నెరవేర్చలేదన్నారు. ఎకరం రూ.800 కోట్ల వరకు విలువ ఉన్న ఈ భూమిని రూ.2 లక్షల చొప్పున కేటాయించిందని చెప్పారు. పేదలకు ఇచ్చేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తూ.. పార్టీలకు మాత్రం ఆగమేఘాల మీద భూమి ఇచ్చిందని వెల్లడించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్ పరిషద్ వాదిస్తూ.. ఈ భూములపై పిటిషనర్లకు ఎలాంటి హక్కులు లేవని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ కేటాయింపు వల్ల పిటిషనర్లకు ఎలాంటి నష్టం లేదన్నారు. వారికి ఇళ్లు కావాలంటే ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వవచ్చని చెప్పారు. మిగిలిన పిటిషన్లపై నేడు విచారణ సాగనుంది.

టిప్పర్ ఢీకొని.. కాపాడండని వేడుకుని..

తీవ్ర గాయాలతో యువకుడి మృతి





టిప్పర్ కింద చిక్కుకుని తనను కాపాడాలని వేడుకుంటూ.. విజయ్‌కుమార్ (ఫైల్)

ఖమ్మం క్రైం: అతి వేగంతో వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొని ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.. టిప్పర్ కింద చిక్కుకుపోయిన యువకుడు తనను కాపాడాలని వేడుకున్నాడు.. పోలీసులు స్పందించి యువకుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలివి. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన దొప్పా వీరబాబు కుమారుడు విజయ్‌కుమార్ ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఖమ్మం శ్రీనివాసనగర్‌లో ఉంటున్న ఆయన మంగళవారం గదికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. పక్కనే అతివేగంగా వచ్చిన ఇసుక టిప్పర్ కుడివైపునకు తిరగడంతో విజయ్‌కుమార్‌ను ఢీకొంది. విజయ్ అదుపు తప్పి లారీ చక్రాల కింద పడిపోయాడు. ఆయన నడుం భాగంపైకి టైర్లు ఎక్కడంతో శరీరం నుజ్జునుజ్జయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ.. తన ప్రాణాలు కాపాడాలని ఆ యువకుడు వేడుకున్నాడు. సమాచారం అందుకున్న ఖమ్మం త్రీటౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ చేరుకుని విజయ్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా టిప్పర్ నడిపిన డ్రైవర్ బుడిగ ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా...

జైలులో లొంగిపోతా: ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీచేయడానికి సన్నాహాల్లో చేసుకుంటున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కేసుల భయం, అరెస్టు భయం వెంటాడుతోంది. 2020లో జార్జియా రాష్ట్ర ఎన్నికల ఫలితాలను మార్చేయడానికి ప్రయత్నించిన కేసులో ట్రంప్ గురువారం ఫుల్టన్ కౌంటీ జైలులో లొంగిపోనున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. అరెస్టు కావడానికి జార్జియాలోని అట్లాంటాకు వెళ్తున్నానని తెలియజేశారు. అక్కడ జిల్లా అటార్నీ ఫానీ విల్లీస్ తనను అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. తన అరెస్టు ప్రక్రియను అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ సమన్వయం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించిన కేసులో ట్రంప్‌తోపాటు మరో 18 మంది ఆగస్టు 25లోగా లొంగిపోవాలని గతంలో జడ్జి ఆదేశించారు. అయితే ట్రంప్‌తో పాటు మరో 18 మంది కూడా సరెండర్ కావడానికి సిద్ధమైనట్లు సమాచారం.

ప్రకాశ్‌రాజ్‌పై కేసు నమోదు

శివాజీ నగర: చంద్రయాన్‌–3 ప్రయోగాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌పై కర్ణాటకలో కేసు నమోదైంది. ఆయనపై హిందూ సంఘాల నేతలు బాగల్‌కోట జిల్లాలోని బానహట్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రకాశ్‌రాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల ఆయనపై ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. లుంగీ కట్టుకున్న ఓ చాయ్‌వాలా టీ వడబోస్తున్న కార్టూన్‌ను ప్రకాశ్‌రాజ్ పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. చంద్రయాన్‌–3 నుంచి వచ్చిన తొలి ఫోటో ఇదే అని కామెంట్ కూడా చేశారు.

సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో భారతీయుడు

సింగపూర్: సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతికి చెందిన థర్మన్ షణ్ముగరత్నం పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని సింగపూర్ అధ్యక్ష ఎన్నికల కమిటీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. 66 ఏళ్ల వయసున్న షణ్ముగరత్నం చైనా సంతతికి చెందిన కాక్ సాంగ్, తన్ కిన్ లియాన్‌తో పోటీ పడతారు. మొత్తం ఆరుగురు నుంచి దరఖాస్తులు రాగా వీరు ముగ్గురు అధ్యక్ష పదవికి పోటీ పడడానికి అర్హత సాధించారని ఎన్నికల కమిటీ ప్రకటించింది. షణ్ముగరత్నం సింగపూర్‌లో 2011 నుంచి 2019 మధ్య కాలంలో ఆర్థిక, విద్యాశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా సేవలు అందించారు. సెప్టెంబర్ 1న ఎన్నికలు జరగనున్నాయి.


చంద్రయాన్‌–3

చందమామను ముద్దాడే క్షణం కోసం

- చంద్రయాన్‌–3 ప్రయోగంలో కీలక ఘట్టం నేడే
- జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టనున్న ల్యాండర్ మాడ్యూల్
- సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండింగ్

ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ తన తుది గమ్యాన్ని నేడు ముద్దాడనుంది. ఈ ప్రయోగంలో అత్యంత కీలకమైన తుదిఘట్టం బుధవారం ఆవిష్కృతం కానుంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ఉపరితలంపై ల్యాండర్ మాడ్యూల్ అడుగు పెట్టనుంది. బుధవారం సాయంత్రం 5.27 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సరిగ్గా 6.04 గంటలకు జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ను సురక్షితంగా దించడానికి ఇస్రో సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ అపూర్వ ఘట్టాన్ని బుధవారం సాయంత్రం 5.20 నుంచే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. ల్యాండర్ మాడ్యూల్ చందమామను చేరుకొనే అద్భుత దృశ్యాల కోసం దేశ ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. 'జయహో భారత్.. జయహో ఇస్రో' అంటూ సోషల్ మీడియాలో యువత నినాదాల హోరు ఇప్పటికే మొదలయ్యింది. ప్రపంచ దేశాలు చంద్రయాన్‌–3 ప్రయోగంపై ప్రత్యేక ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

–సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)





ఇప్పటిదాకా ప్రతి ఆపరేషన్ విజయవంతం

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి గత నెల 14న చంద్రయాన్‌–3 మిషన్‌ను ప్రయోగించింది.
- 41 రోజుల ప్రయాణంలో ఐదుసార్లు భూమధ్యంతర కక్ష్యలో, మరో ఐదుసార్లు లూనార్ ఆర్బిట్(చంద్రుడి కక్ష్య)లో చంద్రయాన్‌–3 మిషన్ కక్ష్య దూరాన్ని పెంచుతూ వచ్చారు.
- ఈ నెల 17న ప్రొపల్షన్ మాడ్యూల్ ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడికి దగ్గరగా విజయవంతంగా వదిలిపెట్టింది.
- చంద్రయాన్‌–3లో ఇప్పటిదాకా చేపట్టిన ప్రతి ఆపరేషన్ విజయవంతమైంది.

...ఇక మిగిలింది ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై క్షేమంగా దించడమే. ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు అహర్నిశలూ శ్రమిస్తున్నారు.

70 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఫొటోల చిత్రీకరణ

ల్యాండర్ మాడ్యూల్‌లోని ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా(ఎల్‌పీడీసీ) కేవలం 70 కిలోమీటర్ల ఎత్తునుంచి చంద్రుడి ఉపరితలాన్ని ఈ నెల 19న చిత్రీకరించింది. ఈ ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది.

సాఫ్ట్ ల్యాండింగ్ ఇలా..

ప్రస్తుతం చంద్రుడి ఉపరితలం నుంచి 25X134 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ల్యాండర్ మాడ్యూల్‌ను సెకన్‌కు 1.68 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా చేసి బుధవారం సాయంత్రం 6.04 గంటలకు సురక్షితంగా దించనున్నారు. ఇందులో ఆఖరి 17 నిమిషాలు అత్యంత కీలకం. దీన్ని '17 మినిట్స్ ఆఫ్ టెర్రర్' అని అభివర్ణిస్తున్నారంటే ఇదెంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. ఈ 17 నిమిషాల్లోనే ల్యాండర్ తనలోని ఇంజిన్లను తానే మండించుకుంటుంది. సరైన సమయంలో ఇంజిన్లను మండించడం, సరైన పరిమాణంలో ఇంధనాన్ని వాడుకోవడం చాలా కీలకం. ల్యాండర్ మాడ్యూల్‌లో నాలుగు థ్రస్టర్ ఇంజిన్లు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలం నుంచి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత వీటిని మండించడం ప్రారంభమవుతుంది. దాంతో ల్యాండర్ వేగం క్రమంగా తగ్గిపోతుంది. తనలోని సైంటిఫిక్ పరికరాలతో ల్యాండింగ్ సైట్‌ను ల్యాండర్ మాడ్యూల్ గుర్తిస్తుంది. అడ్డంకులు ఏవైనా ఉంటే గుర్తిస్తుంది. ల్యాండింగ్ సైట్ చదునుగా ఉంటే బుధవారం ల్యాండింగ్ అవుతుంది. లేదంటే వాయిదా పడే అవకాశం లేకపోలేదు. వాయిదా పడితే ఈ నెల 27న సాఫ్ట్ ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తామని ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేశ్ దేశాయ్ చెప్పారు. పరిస్థితులన్నీ అనుకూలించి, సాంకేతికపరంగా సహకారం అందితే సురక్షితంగా ల్యాండింగ్ అవుతుంది. ల్యాండర్ మాడ్యూల్‌ను నిరంతరం క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, ప్రస్తుతం చక్కగా పనిచేస్తోందని ఇస్రో మంగళవారం వెల్లడించింది. ల్యాండింగ్‌కు రెండు గంటల ముందు అవసరమైన కమాండ్‌లను ల్యాండర్‌లో ఇస్రో అప్‌లోడ్ చేస్తుంది.



ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడిపై ఇలా దిగి రోవర్‌ను బయటకు పంపిస్తుంది

పసిఫిక్‌లో 'అణు' అలజడి

- రేపట్నుంచి ఫ్యుకుషిమా అణు ప్లాంట్ నుంచి సముద్రంలోకి వ్యర్థజలాలు విడుదల
- జపాన్ ప్రభుత్వ నిర్ణయంపై చుట్టుపక్కల దేశాల అభ్యంతరం

టోక్యో: జపాన్‌లో భూకంపంతో దెబ్బతిన్న ఫ్యుకుషిమా అణు రియాక్టర్ నుంచి వ్యర్థ జలాలను గురువారం నుంచి సముద్రంలోకి విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లాంట్‌ను మూసివేయాలంటే వ్యర్థ జలాలను ఫసిఫిక్ మహా సముద్రంలోకి వదిలేయాక తప్పదని జపాన్ ప్రధాన మంత్రి ఫ్యుమియో కిషిదా మంగళవారం చెప్పారు. కేబినెట్ మంత్రులతో సమావేశమైన ఆయన ఈ వ్యర్థ జలాలను ప్రణాళికా బద్ధంగా సముద్రంలోకి పంపాలని ఇందు కోసం ప్లాంట్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 24 నుంచి నీటి విడుదల కార్యక్రమం ప్రారంభమవుతుంది. 2011 మార్చి 11న సంభవించిన తీవ్రమైన భూకంపం అనంతరం ముంచెత్తిన సునామీకి ఈ ప్లాంట్ దెబ్బ తింది. అప్పట్నుంచి ఈ వ్యర్థ జలాలను జపాన్ నిల్వ చేసి ఉంచింది. కానీ ఇప్పుడు వాటిని నిల్వ చేయడానికి చోటు సరిపోక సముద్రంలోకి వదలాలని నిర్ణయించింది. ఈ నీటిని సముద్రంలోకి విడుదల చేయడంపై చుట్టుపక్కల దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. జపాన్ దగ్గర దాదాపుగా 13.4 లక్షల టన్నుల వ్యర్థ జలాలు ఉన్నాయి. వీటిని దశలవారీగా శుద్ధి చేసి సముద్రంలోకి వదులుతారు. ఇలా చెయ్యడానికి కనీసం 30 ఏళ్లు పడుతుందని అంచనా. ఈ నీళ్లను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల మత్స్య సంపదకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నీటి విడుదలకి ఇంటర్నేషనల్ అటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) ఇప్పటికే అంగీకరించింది. జపాన్ పసిఫిక్ సముద్రాన్ని తన సొంత మురికి కాల్వగా భావిస్తోందని చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు విమర్శిస్తున్నాయి.

కార్చిచ్చును కేర్ చేయని ఇల్లు!

హవాయి: అమెరికాలోని హవాయి దీవిలో ఇటీవల చెలరేగిన కార్చిచ్చు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గత వందేళ్లలో ఇది అత్యంత తీవ్రమైన ప్రకృతి విపత్తు అని స్థానికులు చెబుతున్నారు. కార్చిచ్చు ధాటికి వందలాది ఇళ్లు కాలి బూడిదయ్యాయి. రిసార్ట్ నగరమైన 'లాహైనా' బూడిద కుప్పగా మారిపోయింది. ఇక్కడ దాదాపు అన్ని ఇళ్లు మంటల్లో చిక్కుకొని నేలమట్టమయ్యాయి. మంటల తీవ్రతకు వంద మందికిపైగానే మరణించారు. కానీ, ఒక ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా స్థిరంగా నిలిచి ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ఈ ఇల్లు ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లాహైనా సిటీలో రివర్ ఫ్రంట్ వీధిలో ఈ ఇల్లు ఉంది. చుట్టుపక్కల ఉన్న ఇళ్లన్నీ మంటల్లో కాలిపోయాయి. ఇదొక్కటే ఎప్పటిలాగే మెరిసిపోతూ కనిపిస్తోంది. ఇది నిజమేనా? ఫొటోలో ఏదైనా మార్పులు చేశారా? అని నెటిజన్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భవన యజమాని ట్రిస్ మిలికిన్ స్పందించారు. అది నిజమైన ఫొటో అని స్పష్టం చేశారు. 100 సంవత్సరాల క్రితం నాటి ఈ చెక్క ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశామని, పాత పైకప్పును తొలగించి, లోహపు పైకప్పు వేయించామని తెలిపారు. చుట్టుపక్కల గడ్డి లేకుండా బండలు పరిచామని వెల్లడించారు. ఈ జాగ్రత్తల వల్లే తమ ఇల్లు మంటల్లో చిక్కుకోలేదని పేర్కొన్నారు. కార్చిచ్చులో నిప్పు రవ్వలు తమ ఇంటిపై పడినా లోహపు పైకప్పు వల్ల ఎలాంటి నష్టం జరగలేదని ట్రిస్ మిలికిన్ వివరించారు.



ప్రపంచానికి 'గ్రోత్ ఇంజిన్' భారత్

- త్వరలో 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో మోదీ ఉద్ఘాటన

జోహన్నెస్‌బర్గ్: రాబోయే రోజుల్లో ప్రపంచానికి భారత్ 'గ్రోత్ ఇంజిన్'గా మారబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భారత్‌లో సంస్కరణలను మిషన్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, సులభతర వాణిజ్యంలో వేగం పుంజుకుందని చెప్పారు. మంగళవారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో బ్రిక్స్ బిజినెస్ ఫోరం లీడర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. భారత్ త్వరలోనే 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లో ఉందన్నారు. 100కుపైగా యూనికార్న్ కంపెనీలు పని చేస్తున్నాయని వెల్లడించారు. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య భవిష్యత్ సహకారానికి అనువైన రంగాలను గుర్తించడంలో 15వ బ్రిక్స్ సదస్సు సఫలమవుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరిగే బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం ఆయన దక్షిణాఫ్రికా చేరుకున్నారు. కాగా, ఉక్రెయిన్ యుద్ధం విషయమై అంతర్జాతీయ నేర న్యాయస్థానం రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఆయన వర్చువల్‌గా పాల్గొననున్నారు.



జోహన్నెస్‌బర్గ్‌లో తనకు స్వాగతం పలికిన భారతీయులకు మోదీ అభివాదం

లక్షద్వీప్ ఎంపీకి సుప్రీంలో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: హత్యాయత్నం కేసులో లక్షద్వీప్ లోక్‌సభ ఎంపీ మహమ్మద్ ఫైజల్‌కు సుప్రీం కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా తేలుస్తూ గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుని సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ఈ తీర్పుని ఆరువారాల్లోగా పునః పరిశీలించాలని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం బెంచ్ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కేరళ హైకోర్టు ఈ కేసుని విచారించినప్పుడు ఆయన ఎంపీ అన్న కోణంలో విచారించిందని అందువల్ల తప్పిదాలు దొర్లాయని వ్యాఖ్యనించింది. ఎన్‌సీపీకి చెందిన మహమ్మద్ ఫైజల్ 2014 నుంచి లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ అల్లుడైన పదాంత సాలిహ్‌పై మహమ్మద్ ఫైజల్ మరికొందరు హత్యాయత్నానికి పాల్పడినట్టుగా కేసు నమోదైంది. ఈ కేసుని విచారించిన కేరళ సెషన్స్ కోర్టు ఈ ఏడాది జనవరి 11, 2023లో ఫైజల్ మరో ముగ్గురికి 10 ఏళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల చొప్పున జరిమానా విధించింది. ఆ వెంటనే జనవరి 13న ఫైజల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. తీర్పుని సవాల్ చేస్తూ ఫైజల్ హైకోర్టులో సవాల్ చేయగా కింద కోర్టు ఇచ్చిన తీర్పుని కొట్టేసింది. ఒక ఎంపీ దోషిగా తేలితే మళ్లీ ఎన్నికలు జరిగి ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందంటూ కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు తీర్పుపై లక్షద్వీప్ యంత్రాంగం సుప్రీంకోర్టుకెక్కింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎంపీగా తనపై వేసిన అనర్హత వేటును ఎత్తేయాలని ఫైజల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా మార్చిలో లోక్‌సభ సచివాలయం ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది.

కుసుమా నువ్వు గ్రేట్



బనశంకరి: ప్రజల్లో డిజిటల్ ఆర్థిక సాధికారత కోసం బెంగుళూరుకు చెందిన ఒక పోస్టుమాస్టర్ చేస్తున్న కృషికి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ముగ్ధులయ్యారు. పోస్ట్‌మాస్టర్ కె.కుసుమ కృషి అభినందనీయమని సామాజిక మాధ్యమాల్లో ప్రశంసించారు. ఇటీవల బెంగళూరులో ఎందరో సామాజిక కార్యకర్తలను కలిశారు. పోస్ట్‌మాస్టర్ అయిన కుసుమనూ కలిశారు. భారత్‌లో శరవేగంగా సాగుతున్న డిజిటల్ ఆర్థికాభివృద్ధిలో కుసుమ వంటివారు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడిన బిల్‌గేట్స్ ఆమెతో ఉన్న ఫోటోను షేర్ చేశారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిస్తే కులగణన

సాగర్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే కులగణన నిర్వహిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. మన దేశ రాజ్యాంగాన్ని మార్చేయడానికి కొందరు వ్యక్తులు కుట్రలు పన్నుతున్నారని పరోక్షంగా బీజేపీ నేతలపై మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలోనే మధ్యప్రదేశ్‌లో అభివృద్ధి జరిగిందని మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు.

ఈసీ 'నేషనల్ ఐకాన్'గా సచిన్

సాక్షి, న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంచేలా అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి 'నేషనల్ ఐకాన్'గా సచిన్ వ్యవహరించనున్నారు. ఢిల్లీలో బుధవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ తదితరుల సమక్షంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సచిన్ టెండూల్కర్‌తో 3 సంవత్సరాల పాటు కేంద్ర ఎన్నికల సంఘం ఎంఓయూ కుదుర్చుకోనుంది. ఈ ఎంఓయూ ద్వారా యువత, పట్టణ ప్రాంతాల ఓటర్ల భాగస్వామ్యం పెంచే దిశగా టెండూల్కర్ 'నేషనల్ ఐకాన్'గా తన బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా గత సంవత్సరం ప్రముఖ నటుడు పంకజ్ త్రిపాఠి, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎంఎస్ ధోని, అమీర్ ఖాన్, మేరీకోమ్ వంటి ప్రముఖులు కేంద్ర ఎన్నికల సంఘానికి 'నేషనల్ ఐకాన్'లు వ్యవహరించారు.

అత్యధిక రేటుకి ఉల్లిని కొంటాం: కేంద్రం

న్యూఢిల్లీ: టమాటా బాటలో ఉల్లి ధరలు పయనిస్తున్నాయి. ఉల్లి ధరలు భారీగా పెరిగిపోతూ ఉండడంతో వాటిని అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉల్లిపై 40% ఎగమతి సుంకాన్ని విధిస్తూ తీసుకున్న నిర్ణయంపై రైతులు నిరసనలకు దిగుతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లిపాయలని క్వింటాల్‌కి రూ.2,410 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తామని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. మరోవైపు ఉల్లిపాయలు దొరకకపోతే, ధరలు ఎక్కువుంటే ఒక రెండు నుంచి నాలుగు నెలలు తినకపోతే వచ్చే నష్టమేమీ లేదని మహారాష్ట్ర మంత్రి దాదా భూసే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఎవరికైనా అంత ధర ఇచ్చి కొనే శక్తి లేకపోతే వారు రెండు నుంచి నాలుగు నెలలు మానేయచ్చు. దాని వల్ల ఏం నష్టం లేదు' అని వ్యాఖ్యానించారు. రైతులు, వ్యాపారుల ధర్నాతో మహారాష్ట్రలోని నాసిక్‌లోని ఉల్లిమార్కెట్ బోసిపోయింది.



జనంలేక ఖాళీగా ఉన్న నాసిక్‌లోని ఉల్లి మార్కెట్

రిపబ్లికన్ రేస్ షురూ

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ

- బరిలో డొనాల్డ్ ట్రంప్‌తోపాటు మొత్తం 9 మంది
- ఇప్పటికే రేసులో దూసుకుపోతున్న ట్రంప్
- రిపబ్లికన్ ఓటర్లలో 60 శాతం పైగా మద్దతు
- డి శాంటిస్ మాత్రమే పోటీ ఇచ్చే అవకాశం

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఇంకా ఏడాదికి పైగా సమయముంది. 2024 నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. కానీ రెండు ప్రధాన పక్షాల్లో ఒకటైన విపక్ష రిపబ్లికన్ పార్టీ ఇప్పటికే బరిలో దిగింది. పార్టీ అభ్యర్థిని నిర్ణయించే సుదీర్ఘమైన ఎంపిక ప్రక్రియకు బుధవారమే శ్రీకారం చుడుతోంది. ఇప్పటికైతే వివాదాస్పద మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేసులో అందరి కంటే ముందున్నారు. ఇంకా చెప్పాలంటే ఆయన వైపే స్పష్టమైన మొగ్గుంది. అయినా సరే, ట్రంప్‌నకు ఎంతో కొంత పోటీ ఇస్తారని భావిస్తున్న ఫ్లోరిడా గవర్నర్ డి శాంటిస్‌తోపాటు మరో ఏడుగురు ఆశావహులు బరిలో దిగి అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



అర్హత... అంత సులభం కాదు

రిపబ్లికన్ అభ్యర్థిత్వ బరిలో నిలవడం అంత సులువేమీ కాదు. అందుకు పార్టీ నేషనల్ కమిటీ పెట్టే ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మరెన్నో పార్టీపరమైన పరీక్షల్లో నెగ్గాల్సి ఉంటుంది.

- ప్రచారం కోసం కనీసం 40 వేల మంది నుంచి విడివిడిగా విరాళాలు సేకరించాలి.
- మూడు విడివిడి నేషనల్ పోల్స్‌లో కనీసం 1 శాతం ఓట్లు సాధించాలి.
- లేదంటే కనీసం రెండు నేషనల్ పోల్స్‌తో పాటు అయోవా వంటి ఒక అర్లీ ప్రెసిడెన్షియల్ ప్రైమరీలో కనీసం 1 శాతం ఓట్లు సాధించాలి.
- అంతిమంగా నెగ్గి రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష బరిలో దిగే అభ్యర్థికి పూర్తి మద్దతిస్తామని ప్రమాణ పత్రం మీద సంతకం చేయాలి. అయితే రేసులో ముందున్న ట్రంప్ మాత్రం ఇలా సంతకం చేయకపోగా, తిరస్కరించడం విశేషం!

తొలి రౌండ్ డిబేట్ ఎప్పుడు?

- బుధవారం రాత్రి 9 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం)
  వేదిక: రాజకీయంగా అతి కీలకమైన విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్వాకీలో
- రెండో రౌండ్ డిబేట్ సెప్టెంబర్ 27న కాలిఫోర్నియాలో జరుగుతుంది.

డిబేట్‌లో వీరే...

1. టిమ్ స్కాట్ (దక్షిణకరోలినా సెనేటర్)
2. డి శాంటిస్ (ఫ్లోరిడా గవర్నర్)
3. నిక్కీ హేలీ (ఐరాసలో అమెరికా మాజీ రాయబారి)
4. వివేక్ రామస్వామి (భారత సంతతి వ్యాపారవేత్త)
5. క్రిస్ క్రిస్టీ (న్యూజెర్సీ మాజీ గవర్నర్)
6. మైక్ పెన్స్ (మాజీ ఉపాధ్యక్షుడు)
7. డౌగ్ బర్గం (నార్త్ డకోటా గవర్నర్)
8. అసా అచిన్ సన్ (అర్కన్సాస్ మాజీ గవర్నర్)

ఏం ఒరిగేను?

రిపబ్లికన్ అభ్యర్థిగా ట్రంప్‌నకు మద్దతు వెల్లువెత్తుతోందనే చెప్పాలి. తమ అభ్యర్థి ఆయనేనని సీబీఎస్, యూగవ్ గత వారం చేసిన పోల్‌లో ఏకంగా 62 శాతం రిపబ్లికన్ ఓటర్లు కుండబద్దలు కొట్టారు.

అలాంటప్పుడు ఈ డిబేట్లతో పార్టీ సాధించేది ఏముంటుందని ప్రశ్నిస్తున్న వాళ్లూ ఉన్నారు. కానీ ఆశావహులు డిబేట్లలో ట్రంప్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం కాకుండా తమకు ఎందుకు ఛాన్స్ ఇవ్వాలో సమర్థంగా చెప్పగలగాలని అదే సర్వేలో ఏకంగా 91 శాతం స్పష్టం చేశారు. కనుక ఏమైనా జరగొచ్చని, చివరికి అనూహ్యంగా ఎవరైనా అధ్యక్ష అభ్యర్థి కావచ్చని అంటున్న వారికీ కొదవ లేదు.

కొసమెరుపు

రేసులో అందరి కంటే ముందున్న డొనాల్డ్ ట్రంప్ మాత్రం తొలి రౌండ్ డిబేట్‌లో పాల్గొనడం లేదు. 'నాకున్న పాపులారిటీకి ఇలాంటి పిల్ల పందాల్లో పాల్గొనడమా? నాన్సెన్స్! నేనెవరో, అధ్యక్షునిగా ఎంత సాధించానో పార్టీ ఓటర్లందరికీ బాగా తెలుసు'' అంటున్నారాయన! అయితే, సరిగ్గా డిబేట్ల సమయానికే ప్రి రికార్డెడ్ ఇంటర్వ్యూ ప్రసారమయ్యేలా ట్రంప్ ప్లాన్ చేస్తున్నట్టు చెబుతున్నారు.

26, 27 తేదీల్లో జాతీయ దళిత సదస్సు


సాక్షి, హైదరాబాద్: దేశానికి సమగ్ర దళిత ఎజెండాను ఇవ్వడమే లక్ష్యంగా ఈనెల 26, 27 తేదీల్లో హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజాలో జాతీయ దళిత సదస్సు నిర్వహిస్తున్నట్లు పలు సంఘాలు ప్రకటించాయి. ఈ సదస్సులో 26 రాష్ట్రాల నుంచి 80 విభిన్న సంఘాలకు చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించాయి. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్, ఆలిండియా అగ్రికల్చర్ రూరల్ వర్కర్స్ అండ్ లేబర్ అసోసియేషన్ ప్రతినిధి సాయి బాలాజీ, భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య మాట్లాడారు. ఆహ్వాన సంఘం ప్రతినిధులుగా మాజీ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, మల్లేపల్లి లక్ష్మయ్య, జాన్ వెస్లీ, బాలమల్లేష్‌చ రాధికా మీనన్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. దళితుల ఎజెండాను దేశం ముందు పెట్టేందుకే తాము ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. రైతుల కోసం రైతుబంధు సాయం మాదిరిగా, వ్యవసాయ కూలీల కోసం కూలీబంధు తీసుకురావాలని వెంకట్ కోరారు.

అమెరికాలో ఉన్నత విద్యపై 26న హెచ్‌ఐసీసీలో ఫెయిర్



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 'యునైటెడ్ స్టేట్స్‌–ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (యూఎస్‌ఐఈఎఫ్) యూనివర్సిటీ ఫెయిర్‌ను నిర్వహిస్తోంది. ఈనెల 26న హెచ్‌ఐసీసీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ఫెయిర్ కొనసాగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఇందులో పాల్గొనవచ్చని, ఎలాంటి ప్రవేశ రుసుము ఉండదని, కేవలం రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుందన్నారు. అమెరికాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కళాశాలల ప్రతినిధులు దీనికి హాజరవుతున్నారని, ప్రత్యక్షంగా హాజరై వారితో సంప్రదించి అవగాహన పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అమెరికాలో ఉన్నత విద్యాధ్యయనం, అందులో ఉండే అవకాశాలు, యూఎస్ స్టూడెంట్ వీసా పొందే పద్ధతి, అమెరికాలో బస.. తదితర సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు అమెరికా యూనివర్సిటీల ప్రతినిధులు, సలహాదారులు, యూఎస్ ఎంబసీ ప్రతినిధులు ఈ ఫెయిర్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇతర వివరాల కోసం education usaindia@usief.org. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సీపీగెట్‌లో 93.42%ఉత్తీర్ణత



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీపీగెట్ 2023) ఫలితాల్లో 93.42% ఉత్తీర్ణత నమోదైంది. ఈ పరీక్షకు మొత్తం 68,543 మంది దరఖాస్తు చేసుకోగా 59,665 మంది హాజరయ్యారు. అందులో 55,739 (93.42%) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉస్మానియా వర్సిటీ ఉపకులపతి డి.రవీందర్, సీపీగెట్ కన్వీనర్ ఐ.పాండురంగారెడ్డితో కలిసి మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి సీపీగెట్ 2023 ఫలితాలను విడుదల చేశారు. అనంతరం వీసీ డి.రవీందర్ మాట్లాడుతూ...సీపీగెట్‌లో ఉత్తీర్ణులైన వారిలో అధికంగా 37,567 (67.39%) మంది అమ్మాయిలు ఉన్నారని చెప్పారు. అన్ని వర్సిటీల్లో మొత్తం 44,756 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

31న జర్నలిజం పరీక్ష: సీపీగెట్ పరీక్షల్లో ఎం.ఎ జర్నలిజం పరీక్ష ప్రశ్నపత్రంలో గందరగోళం తలెత్తడంతో ఆ పరీక్షను ఈ నెల 31న మళ్లీ నిర్వహించాలని నిర్ణయించినట్లు కన్వీనర్ తెలిపారు.

విద్యార్థులకు 'చంద్రయాన్‌-3' చూపించండి

లైవ్ చూపించాలని గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రభుత్వ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చంద్రయాన్‌-3 ల్యాండింగ్ దృశ్యాలను రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు డీఈవోలు, ప్రిన్సిపాల్స్‌కు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇతర పాఠశాలల విద్యార్థులకు మరుసటి రోజు రికార్డింగ్ కార్యక్రమాన్ని చూపించాలని హెడ్‌మాస్టర్లను ఆదేశించింది. ఉస్మానియా వర్సిటీలోని ఖగోళశాస్త్రం విభాగంతో కలిసి టీశాట్, నిపుణ చానళ్లలో లైవ్ టెలికాస్ట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో స్క్రీన్లు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు చూపించనున్నారు. సాయంత్రం 5.20 గంటలకు టీశాట్, నిపుణ చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ అవుతుందని ఇస్రో వెల్లడించింది.



తుపాకీ 'గురి' తప్పుతోంది!

దేశంలో ఆందోళన రేపుతున్న సాయుధ బలగాల బలవన్మరణాలు
దేశవ్యాప్తంగా 13 ఏళ్లలో 1,532 మంది ఆత్మహత్య
తెలంగాణలో పదుల సంఖ్యలో ప్రాణాలు తీసుకున్న పోలీసులు
మానసిక ఒత్తిడిలో ఆత్మహత్య.. లేదంటే కాల్పులకు తెగబడుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్

ఇటీవల జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ చేతన్ సింగ్ విచక్షణారహితంగా కాల్పులకు తెగబడిన విషయం తెలిసిందే. తన మతిలేని చర్యతో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ టికారామ్‌తో సహా ముగ్గురు ప్రయాణికులు బలయ్యారు. వీరిలో హైదరాబాద్ బజార్‌ఘాట్‌కు చెందిన సయ్యద్ సైఫుద్దీన్ ఉన్నారు. సాయుధ అధికారిగా ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు ఇలా చేస్తుండటంపై పోలీసు వర్గాల్లో ఆందోళ వ్యక్తమవుతోంది. అసలు ఆ పరిస్థితులు ఎందుకు వస్తున్నాయి? వృత్తిపరమైన పని ఒత్తిడిని జయించేందుకు పోలీస్‌శాఖ అనుసరిస్తున్న వ్యూహాలు ఏంటి? తదితర అంశాలపై పోలీస్ ఉన్నతాధికారుల్లోనూ చర్చ జరుగుతోంది.

ఒకవైపు ఉద్యోగంలో ఒత్తిళ్లు... మరోవైపు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ కలహాలు, ఇతర సమస్యలు. ఇవన్నీ ఖాకీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాయుధ సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడిలోకి జారిపోయి విచక్షణ కోల్పోతున్నారు. విధి నిర్వహణ కోసం ఇచ్చే ఆయుధంతో ఆ మానసిక స్థితిలో ఎదుటివారిని హతమార్చేలా విచక్షణ కోల్పోతున్నారు. లేదంటే తమను తాము కాల్చుకుని ఎంతో విలువైన జీవితాన్ని, కుటుంబాన్ని విషాదాంతం చేస్తున్నారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన ఖాకీలు ఇలా ఎందుకు చేస్తున్నారు?

13 ఏళ్లలో 1,532 మంది..

➤ గత 13 ఏళ్లలో కేంద్ర సాయుధ బలగాలైన సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, సశస్త్ర సీమాబల్, ఇండో టిబెటన్ సరిహద్దు పోలీస్, సీఐఎస్‌ఎఫ్, అస్సాం రైఫిల్స్, ఎన్‌ఎస్‌జీలకు చెందిన 1,532 మంది ఆత్మహత్య చేసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. సాయుధ బలగాల్లో ఆత్మహత్యలపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఇటీవల ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ ఏడాది (2023)లోనూ జనవరి నుంచి జూలై నెలాఖరు వరకు 71 మంది సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. వీటిని నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తెలంగాణలో నమోదైన పోలీసు ఆత్మహత్యలు కొన్ని...

➤ జనగాం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ గత ఏప్రిల్ 6న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే రోజు ఉదయం శ్రీనివాస్ భార్య స్వరూప బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది తట్టుకోలేకే శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

➤ 2016లో ఆదిలాబాద్ జిల్లా కెరిమెరిలో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

➤ 2019లో హెడ్ కానిస్టేబుల్ డి.ప్రకాశ్ రెడ్డి తన పైఅధికారి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం పొందారు.


➤ 2020లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రూపేషానంద్ కుటుంబ సమస్యల ఒత్తిడికి లోనై తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

➤ 2020 నవంబర్‌లో సికింద్రాబాద్‌లో ఓ బ్యాంక్ వద్ద గార్డ్ డ్యూటీలో ఉన్న నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ మధు తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

➤ 2017 జూన్‌లో సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అధికారుల వేధింపులే ఇందుకు కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

కేంద్ర టాస్క్‌ఫోర్స్ నివేదికలో ఏముంది?

➤ సాయుధ బలగాలు ఆత్మహత్యలు చేసుకోవడం లేదా తోటి సిబ్బందిపై కాల్పులు జరపడానికి కారణాలు విశ్లేషించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ గత జనవరిలో ఓ సమగ్ర నివేదికను సమర్పించింది. అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు సర్వీస్–వర్కింగ్ కండిషన్స్, వ్యక్తిగత, కుటుంబ కారణాలు సాయుధ పోలీసుల ఆత్మహత్యలకు, తోటి సిబ్బంది, ఇతరులపై కాల్పులు జరపడానికి కారణమవుతున్నాయని తెలిపింది.



శిక్షణ నుంచే అలవాటు చేయాలి..

➤ పోలీస్ ఉద్యోగం అంటేనే 24 గంటలూ విధుల్లో ఉండాలి. ఇప్పటితో పోలిస్తే గతంలోనే విపరీతమైన పని ఒత్తిడి ఉండేది. అప్పట్లో ఒకవైపు శాంతిభద్రతల సమస్యలు.. మరోవైపు నక్సల్ సమస్యలు ఉండేవి. ఇలా అనేక రకాల పరిస్థితుల్లో మేం ఉద్యోగానికి వచ్చిన తొలిరోజుల్లో పనిచేశాం. కానీ కాలంతోపాటు ఆ పరిస్థితులు మారాయి. ఇప్పుడు కూడా పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదే. అయితే ఆ పని ఒత్తిడి ఇటీవలే పెరిగింది కాదు. అయితే, పరిస్థితులను తట్టుకునేంతగా ఇప్పటి సిబ్బంది మానసికంగా ధృడంగా ఉండట్లేదన్నది నా అభిప్రాయం. శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంచేలా ప్రత్యేక శిక్షణ అవసరం. మానసిక ఒత్తిడిని తట్టుకునేలా మనల్ని మనం సంసిద్ధం చేసుకోవాలన్నది ఉద్యోగంలో చేరిన మొదటి నుంచే అలవడేలా యువ అధికారులు, సిబ్బందిని తీర్చి దిద్దాలి. అప్పుడే ఆత్మహత్యలు జరగకుండా నివారించగల్గుతాం అని నా అభిప్రాయం.

- నారాయణ, రిటైర్డ్ ఎస్పీ

కేంద్ర టాస్క్‌ఫోర్స్ నివేదికలో ఏముందంటే...

➤ సాయుధ బలగాలు ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు... పనిగంటలు పెరగడం, సరైన విశ్రాంతి లేకపోవడం, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారితో పోలిస్తే విధుల్లో సంతృప్తి లేకపోవడం, అన్నింటికి మించి సాంఘికంగా తమను దూరం పెడుతున్నారన్న భావన పెరగడం, కుటుంబ మద్దతు లేకపోవడం, సిబ్బంది ఇచ్చే ఫిర్యాదులను పరిష్కరించే సరైన యంత్రాంగం లేకవపోవడం.

పోలీస్ సెన్సిటివిటీ ట్రైనింగ్ సైతం అవసరం



➤ తీరిక లేని ఉద్యోగంతో పని ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ విధుల్లోనూ అనేక రకాల పరిస్థితులను వారు చక్కబెట్టాల్సి ఉంటుంది. కాబట్టి పోలీసు అధికారులకు, సిబ్బందికి పోలీస్ సెన్సిటివిటీ ట్రైనింగ్ ఇవ్వడం ఎంతో ముఖ్యం. నేను తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉన్న వారికి కొన్ని తరగతులు తీసుకున్నాను. శిక్షణ సమయంలో నేర్చుకున్న విషయాలను వారు ఉద్యోగంలోకి వచ్చాక ఆచరిస్తే మానసిక ఒత్తిడిని జయించవచ్చు. మానసికంగానూ దృఢంగా ఉంటే వృత్తిగత జీవితంతోపాటు వ్యక్తిగతంగానూ ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

- డా.ప్రజ్ఞ రష్మి, సైకాలజిస్ట్

ట్రాన్స్‌జెండర్ వేధింపులు తట్టుకోలేక యువకుడి బలవన్మరణం



ధరావత్ శివరామ్ (ఫైల్)

గూడూరు: ట్రాన్స్‌జెండర్ వేధింపులు తట్టుకోలేక ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట శివారు కోమటిపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. కోమటిపల్లికి చెందిన ధరావత్ శివరామ్ (26) చెన్నరావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కొర్ర ప్రవీణ్ అలియాస్ తాప్సీతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నారు. కొద్దికాలం తర్వాత మనస్పర్థలు రావడంతో నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకుని విడిపోయారు. అనంతరం కుటుంబసభ్యులు మరో అమ్మాయితో శివరామ్‌కు పెళ్లి కుదిర్చారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌జెండర్ తాప్సీ తరచూ శివరామ్‌కు ఫోన్ చేస్తూ పెళ్లి ఎలా చేసుకుంటావని మానసికంగా వేధిస్తోంది. అమ్మాయి తరఫువాళ్లకు అసలు విషయం చెబుతాననంటూ ఇబ్బంది పెడుతోంది. దీంతో మనోవేదనకు గురైన శివరామ్ సోమవారంరాత్రి ఇంట్లో పురుగులమందు తాగి పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే మానుకోట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

ఎంపీ అర్వింద్ మాటలపై అనుమానాలున్నాయి: సతీష్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎవరికి ఓటేసినా తానే గెలుస్తానని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్న మాటల వెనక అనుమానాలున్నాయని తెలంగాణ రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. గతంలో జరిగిన ఎన్నికలు, బీజేపీ గెలుపుపైనా అనేక సందేహాలు కలుగుతున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని, ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని, గత ఎన్నికల్లో ఎలా గెలిచాడనే దానిపై విచారణకు ఆదేశించాలని సతీశ్‌రెడ్డి కోరారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

హుజూర్‌నగర్: గురుకుల పాఠశాల విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బక్కయ్యగుడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వీరాచారి, ధనలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె (14) హుజూర్ నగర్ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 21న పాఠశాలలో విద్యార్థినుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరుకావాలని పాఠశాల ప్రిన్సిపాల్.. విద్యార్థిని తండ్రి వీరాచారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. కానీ సమావేశానికి హాజరుకాలేనని, మర్నాడు వచ్చి కలుస్తానని ఆయన చెప్పాడు. అదే రోజు రాత్రి మిగతా విద్యార్థినులతో కలిసి వీరాచారి కుమార్తె కూడా భోజనం చేసి పడుకుంది. మంగళవారం తెల్లవారుజామున విద్యార్థినులు నిద్రలేచి చూసేసరికి.. వీరాచారి కుమార్తె గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. విషయం తెలుసుకుని హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ హరికృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థిని మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. 'ఉన్నత చదువులు చదివి కుటుంబానికి ఆసరా అవుతావనుకుంటే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా బిడ్డా..' అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

భవిష్యత్తు విభజనలపై మార్గదర్శకాలకే పరిమితం

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- రాజకీయ పరమైన అంశాల్లో ఎందుకు జోక్యం చేసుకోవాలని ప్రశ్న
- ఏపీ విభజనకు సంబంధించిన పిటిషన్లలో రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్నాయని వెల్లడి




సాక్షి, న్యూఢిల్లీ: భవిష్యత్తులో రాష్ట్రాల విభజనకు సంబంధించి మార్గదర్శకాలు మాత్రమే ఇవ్వగలమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజకీయ పరమైన అంశాల్లో తాము ఎందుకు జోక్యం చేసుకోవాలని ప్రశ్నించింది. ఏపీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్లలో రాజ్యాంగ పరమైన అంశాలు ఇమిడి ఉన్నాయని పేర్కొంది. ఒకట్రెండు అంశాలు రాజ్యాంగ ధర్మాసనం ముందు విచారణలో ఉన్నాయని గుర్తుచేసిన ధర్మాసనం.. ఆ అంశాలు ముందుగా తేలాల్సి ఉందని వ్యాఖ్యానించింది. విభజన జరిగి తొమ్మిదేళ్లు పూర్తయిందని, పిటిషన్లకు సంబంధించి ఇంకేం మనుగడలో ఉందని ప్రశ్నించింది. ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించి దాఖలైన 26 పిటిషన్లను జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ అరవిందకుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. తెలంగాణకు చెందిన పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపడం సరికాదని, విభజన హామీలు అమలు చేయాలని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుల తరఫు సీనియర్ న్యాయవాది నిరూప్ రెడ్డి, న్యాయవాది శ్రావణ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. 1953, 1956ల్లో జరిగిన విభజన శాస్త్రీయంగా జరిగిందని, కానీ 2014లో జరిగిన ఏపీ విభజన అశాస్త్రీయంగా జరిగిందని చెప్పారు. అనంతరం మరో పిటిషనర్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

నిబంధనలు పాటించకుండానే విభజన: పార్లమెంటులో తగిన నిబంధనలు పాటించకుండానే విభజన ప్రక్రియ పూర్తి చేశారని ఉండవల్లి పేర్కొన్నారు. ఆర్టికల్ 100 ప్రకారం విభజన జరగలేదని, దీని ప్రకారం ప్రొసిడ్యూర్ ఫాలో కాలేదని, హెడ్ కౌంట్ చేయలేదని, వోటింగ్ పెట్టలేదని, కనీసం సభ్యులు ఎస్ లేదా నో చెప్పలేదని తెలిపారు. ఎంపీ అయినా తనను బయటకు పంపారని, విభజన ప్రక్రియ అశాస్త్రీయంగా జరిగిందనడానికి తానే ప్రత్యక్ష సాక్షినని అరుణ్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పార్లమెంటు పరిగణించాలా లేదా అనేది తేలాల్సి ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్రపతికి పంపిన విజ్ఞప్తిపై ఎలాంటి నిర్ణయం లేదన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని రాజకీయ పరమైన అంశంలో తాము ఎందుకు జోక్యం చేసుకోవాలంటూ ప్రశ్నించింది. కాగా తొలుత దాఖలు చేసిన పిటిషన్‌లో తమ అభ్యర్థన మార్చుకున్నామని అరుణ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. విభజన తర్వాత నష్టపోయిన ఏపీకి కేంద్రం సాయం అవసరముందన్నారు. దీంతో రాజ్యాంగ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆయా అంశాలు తేలిన తర్వాతే తాము నిర్ణయం తీసుకోగలమని పిటిషనర్లకు ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.



ఉపగ్రహం మీ నెత్తిన పడితే..

సపోజ్.. ఫర్ సపోజ్..
ఉపగ్రహం లేదా దానిలోని ఓ భాగం మీ నెత్తిన పడితే ఏం చేస్తారు? పోనీ.. మీ నెత్తిన కాదు.. మీ ఇంటిపై పడితే ఏం చేస్తారు? పిచ్చిలేచిందా.. ఇదేం తిక్క ప్రశ్న అనేగా మీ ఫీలింగు..



మీ ఫీలింగును మేము ఫీలయ్యేలోపు.. ఓసారి ఈ ఫొటో చూడండి.. ఇది భూమి కక్ష్యకు సంబంధించి నాసా రూపొందించిన కంప్యూటర్ జనరేటెడ్ ఫొటో... ఇక్కడ కొన్ని కోట్ల సంఖ్యలో భూమి చుట్టూ వేగంగా తిరుగుతున్నాయే.. వీటిల్లో పనిచేస్తున్న ఉపగ్రహాలు మినహాయిస్తే.. మిగతాదంతా కేవలం చెత్త.. అంటే అంతరిక్ష వ్యర్థాలు.. ప్రస్తుతం ఇక్కడ ఉన్నదాంట్లో 95% అదే.. ఇవి అడపాదడపా.. అక్కడక్కడా వచ్చి పడుతుంటాయి... గత నెల్లో భారత్‌కు చెందిన అంతరిక్ష శిథిలం ఒకటి ఆస్ట్రేలియాలో పడింది కూడా.. ఈ నేపథ్యంలో అసలు అంతరిక్ష వ్యర్థాలు అంటే ఏమిటి? పడితే పరిహారంలాంటిది చెల్లించాలా? అసలు దీనికి సంబంధించిన అంతర్జాతీయ చట్టాలేం చెబుతున్నాయి? లాంటి పెద్ద విషయాలతోపాటు అసలు మన నెత్తిన లేదా ఇంటిపై పడే చాన్సుందా.. పడితే.. మనకూ పరిహారం లాంటిదేమైనా ఇస్తారా వంటి చిన్నపాటి వివరాలు కూడా తెలుసుకుందాం..

అంతరిక్ష వ్యర్థం అంటే..

➤ స్పేస్‌లో మిగిలిపోయిన, పనికిరాని భాగాలు.. అది కాలపరిమితి ముగిసిన ఉపగ్రహం కావచ్చు లేదా రాకెట్ ప్రయోగ దశలోని భాగాలు కావచ్చు. వ్యోమగాములు వాడిన గ్లవ్స్‌లాంటివి కావచ్చు. లక్ష్యాలను పూర్తిచేసుకుని పనికిరానివిగా మిగిలిపోయినవి ఏవైనా కావచ్చు.

➤ నాసా లెక్క ప్రకారం ఒక మిల్లీమీటర్ కంటే చిన్నవున్న అంతరిక్ష వ్యర్థాలు 10 కోట్లు ఉంటే.. సాఫ్ట్ బాల్ సైజు కన్నా పెద్దవిగా ఉన్నవి 23 వేలు ఉన్నాయి. కొన్నిటిని శాస్త్రవేత్తలే ఎలాంటి ఇబ్బంది లేకుండా.. నియంత్రిత పద్ధతిలో సముద్రంలో కూలేలా చేస్తుంటారు. ఒకవేళ అలా కాకున్నా.. సాధారణంగా ఎక్కువ శాతం వ్యర్థాలు సముద్రంలో పడిపోతుంటాయి. ఎందుకంటే.. భూమ్మీద నీటి శాతమే ఎక్కువ గనుక.. కొన్ని ఎడారులు, అడవుల్లాంటి నిర్మానుష్య ప్రదేశాల్లో పడుతుంటాయి. చిన్నసైజు వ్యర్థాలు భూవాతావరణంలోకి రాగానే మండిపోతాయి. కొంచెం పెద్దగా ఉండేవి కిందకు వస్తాయి. ఒకవేళ అలా వస్తే..

పైసా నికాలో..

అంతరిక్ష వ్యర్థాల వల్ల పర్యావరణానికి లేదా భూమిపై పడినప్పుడు ఆ ప్రదేశంలో ఏదైనా నష్టం వాటిల్లితే.. దాన్ని ప్రయోగించిన దేశం(లాంచింగ్ కంట్రీ) బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి అంతర్జాతీయంగా కొన్ని నిబంధనలు ఉన్నాయి. 1967 నాటి ఔటర్ స్పేస్ ట్రీటీ, 1972 నాటి స్పేస్ లయబిలిటీ కన్వెన్షన్ ప్రకారం.. నష్టం జరిగిందని బాధిత దేశం కోరితే.. పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

గతంలో ఎవరైనా చెల్లించారా?

ఒక్కసారి జరిగింది. 1978లో కెనడా అప్పటి సోవియట్ యూనియన్ నుంచి పరిహారాన్ని కోరింది. సోవియట్ ఉపగ్రహ భాగం కెనడాలో పడింది. అది కొంచెఅణు ధార్మికత వెదజల్లిందంటూ కెనడా పరిహారాన్ని డిమాండ్ చేసింది. కొంచెం ఎక్కువే అడిగినప్పటికీ.. సోవియట్ యూనియన్‌రూ.18 కోట్లే(ప్రస్తుత లెక్క ప్రకారం) చెల్లించింది.

మన దేశం విషయానికొస్తే..

పశ్చిమ ఆస్ట్రేలియాలో పడిన అంతరిక్ష వ్యర్థం పీఎస్‌ఎల్‌వీ రాకెట్ మూడో స్టేజీకు సంబంధించినదని ఇస్రో నిర్ధారించింది. అది సముద్రంలో పడి.. తర్వాత కొంత కాలానికి తీరానికి కొట్టుకొచ్చి ఉంటుందని తేల్చారు. ఈ సంఘటనలో ఆస్ట్రేలియా పరిహారం కోరితే మనం చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. తొలుత దీని నుంచి ఏమైనా విష రసాయనాలు లీకై ఉంటాయనే అనుమానాలు వ్యక్తమైనా.. తర్వాత అలాంటిదేమీ జరగలేదని శాస్త్రవేత్తలు తేల్చారు. దీన్ని బట్టి.. మన దేశం ఎలాంటి పరిహారాన్ని చెల్లించాల్సిన అవసరం లేదు. అలాగే..



యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ ఔటర్ స్పేస్ ఎఫైర్స్ ప్రకారం.. తమ దేశంలో పడ్డ..విదేశీ అంతరిక్ష భాగాన్ని యాజమాన్య దేశానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. సాధారణంగా మిషన్ అనాలసిస్ కోసం వీటిని తిరిగి తీసుకుంటారు. అయితే.. ఇక్కడ ఈ పరికరం వల్ల పెద్దగా ఉపయోగం ఉండబోదని ఆస్ట్రేలియా స్పేస్ ఏజెన్సీ ప్రతినిధి చెబుతున్నారు. భారత్‌కు ఇది అక్కర్లేకుంటే.. స్కైల్యాబ్ ఉంచిన.. మ్యూజియంలోనే దీన్ని కూడా పెడతామని చెబుతున్నారు.

స్కైల్యాబ్ గుర్తుందిగా.. అమెరికా అంతరిక్ష పరిశోధన కేంద్రం. 1979లో ఇది కూలిపోతుందని చెప్పి.. ఇక ప్రపంచం అంతమే అన్నట్లు.. అదే ఇక చివరి రోజు అన్నట్లు ఆస్తులు అమ్మి విందులు వినోదాలు చేసుకున్నారు.. చాలామందికి స్కైల్యాబ్ పేరిట పిల్లలకు పేర్లు కూడా పెట్టారు. ఆ మధ్య తెలుగులో సినిమా కూడా వచ్చింది. ఆ స్కైల్యాబ్ భాగాలు కూడా పశ్చిమ ఆస్ట్రేలియా ప్రాంతంలోనే కూలాయి.

ఇక మన విషయానికొస్తే...

➤ నిజంగానే మన మీదో లేక మన ఇంటి మీదో పడిందనుకోండి.. మనమేమీ చేయనక్కర్లేదు. మన తరఫున మన దేశమే.. అది ఏ దేశానిదైతే.. ఆ దేశం నుంచి పరిహారాన్ని కోరుతుంది. ఇప్పిస్తుంది కూడా.. అయితే.. ఇప్పటివరకూ ఏ లెక్క ప్రకారం చూసినా.. అలా పడే అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి.

అయినా.. ఏమో గుర్రం ఎగరావచ్చు..
ఎగిరి కింద పడనూవచ్చు..
న్యూటన్ చెప్పింది గుర్తుందిగా..
పైకి వెళ్లే ప్రతీది కిందకు రావాల్సిందే..
బీ కేర్‌ఫుల్ మరి..

- సాక్షి, సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

కిషన్‌రెడ్డి.. ఆరోపణలు నిరూపించు..
లేదంటే ముక్కు నేలకు రాస్తావా?: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్: తాను 260 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఆరోపించిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిరూపించాలని, లేదంటే ముక్కు నేలకు రాయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సవాల్ విసిరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం కిషన్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మంగళవారం మంత్రి స్పందిస్తూ స్థానిక రైతుల దీక్ష శిబిరం వద్దకు వెళ్లారు. మాస్టర్‌ప్లాన్‌లో రైతులు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ అంశాన్నీ ఒప్పుకునేది లేదని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసినా, తాను చెప్పినా రైతులకు నమ్మకం లేకపోతే మంత్రి కేటీఆర్‌తో మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీ మేరకు రైతులు దీక్ష విరమించారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలనూ ఇంద్రకరణ్‌రెడ్డి ఖండించారు.

ఓటమి భయంతోనే కేసీఆర్ రెండుచోట్లా పోటీ
బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్



నారాయణఖేడ్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓటమి భయంతోనే రెండు చోట్లా పోటీ చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పార్టీ శక్తి ప్రదర్శన సభలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఓటమి భయంతోనే ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించారన్నారు. తాము ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించాల్సిన అవసరం లేదని, ఎన్నికల షెడ్యూల్ అనంతరం జనాభా నిష్పత్తితో బీఎస్పీ అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. అంతకుముందు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ నారాయణఖేడ్ చేరుకోవడంతో పార్టీ శ్రేణులు మంగల్‌పేట్ వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం మంగల్‌పేట్ నుంచి రాజీవ్‌చౌక్, బసవేశ్వర చౌక్, శివాజీచౌక్‌ల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో కొరవడిన సామాజిక న్యాయం: దుద్దిళ్ల



కాటారం: బీఆర్ఎస్ పార్టీలో సామాజిక న్యాయం కొరవడిందని, రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెపుతారని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలోని తన స్వగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థుల టికెట్ల కేటాయింపులో కేసీఆర్ అగ్రకులాలకే పెద్దపీట వేశారని, మహిళలు, మైనార్టీలు, బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదని భావించే కేసీఆర్ రెండు నియోజకవర్గాలనుంచి పోటీకి సిద్ధపడుతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌తోనే దళితులకు న్యాయం: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దళితులకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. దళితులకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 26న చేవెళ్లలో జరగనున్న బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆ సభలోనే దళిత డిక్లరేషన్ ప్రకటించి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏం చేయబోతున్నామో చెబుతామని వెల్లడించారు.

కోట్లు ఖర్చు పెట్టేవారికే టికెట్లిచ్చారు
మహేశ్ కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రాజకీయాలు డబ్బు చుట్టే తిరిగేందుకు కారణం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు అక్రమంగా సంపాదించారని, అందులో నుంచి వందల కోట్ల రూపాయలను వచ్చే ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న వారికే ఈసారి టికెట్లు కేటాయించారని ఆరోపించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...బీఆర్ఎస్‌కు సంబంధించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా అన్ని వర్గాలను వంచించే విధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో 55% ఉన్న బీసీలకు కేవలం 23 స్థానాలు మాత్రమే కేటాయించారని, కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనంపల్లికి ప్రత్యామ్నాయం!

- మల్కాజిగిరి తెరమీదకు మర్రి, శంభీపూర్ రాజు తదితరుల పేర్లు
- మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం!



మర్రి రాజశేఖర్‌రెడ్డి



శంభీపూర్ రాజు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో పలు నియోజకవర్గాల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిపై బీఆర్ఎస్ అధిష్టానం దృష్టి పెట్టింది. అలాంటి వారిపై కఠినంగానే వ్యవహరించాలని భావిస్తోంది. అసంతృప్తి, అసమ్మతి పేరిట పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపిస్తే వేటు వేయడానికి కూడా వెనుకాడేది లేదన్న సంకేతాలను ఇస్తోంది. ఈ సమయంలో మల్కాజిగిరి శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు మంగళవారం సైతం.. తన కుమారునికి మెదక్ టికెట్ విషయంలో తాను పార్టీపై కాని, సీఎంపై కానీ ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని అంటూనే తనను ఎవరు టచ్ చేసినా వారిని వదిలే ప్రసక్తే లేదంటూ మాట్లాడడం, హైదరాబాద్ వెళ్లాక కార్యాచరణ ప్రకటిస్తానంటూ వ్యాఖ్యానించడాన్ని పార్టీ అధిష్టానం తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలిసింది. మైనంపల్లికి వ్యతిరేకంగా ఇప్పటికే పలువురు పార్టీ నాయకులు గళం విప్పిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం చేయడం, అదే సమయంలో ఆయన స్థానంలో ప్రత్యామ్నాయం సంబంధిత అంశాలను కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇక టికెట్లు రాక అసంతృప్తితో ఉన్న ఇతర నేతలను సాధ్యమైనంత వరకు బుజ్జగించే యత్నాలు చేస్తూనే, పార్టీ గీత దాటి వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

తెరపైకి కొత్తపేర్లు

మైనంపల్లి స్థానంలో ఇతరులకు టికెట్ కేటాయించేందుకు పార్టీ సన్నద్ధమవుతోందనే వార్తల నేపథ్యంలో కొత్త పేర్లు తెరమీదకు వస్తున్నాయి. మండలి సభ్యుడు శంభీపూర్ రాజు, పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ కార్మిక విభాగం నేత, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత భర్త మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి కోడలు విజయశాంతి పేర్లు కూడా చర్చకు వస్తున్నాయి. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆయనను తిరిగి పార్టీలోకి రప్పించి అభ్యర్థిగా ప్రకటించడం పైనా మంతనాలు జరుగుతున్నట్లు తెలిసింది.

మైనంపల్లికి కాంగ్రెస్ ఆఫర్!

తిరుమల పర్యటనకు వెళ్లిన మైనంపల్లి ఇంకా స్థానిక కేడర్‌కు అందుబాటులోకి రాలేదు. ఆయన నియోజకవర్గానికి చేరుకున్న తర్వాత మల్కాజిగిరి వ్యవహారంలో కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా తన కుమారుడి రాజకీయ భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్న మైనంపల్లికి కాంగ్రెస్ ఓపెన్ ఆఫర్ ఇస్తున్నట్లు సమాచారం. మైనంపల్లికి మల్కాజిగిరి, ఆయన కుమారుడికి మెదక్ అసెంబ్లీ టికెట్లు ఇచ్చేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కేసీఆర్ గీసిన గీత దాటను

బోరున విలపించిన ఎమ్మెల్యే రాజయ్య



విలపిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటినుంచి ఇప్పటివరకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు వీరవిధేయుడిగా ఉన్నానని, ఆయన గీసిన గీత దాటేది లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. రాజయ్యకు టికెట్ రాని నేపథ్యంలో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆయన వర్గీయులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారిని చూసిన రాజయ్య భావోద్వేగానికి గురై బోరున విలపించారు. దీంతో ఆయన వర్గీయులు కొందరు కంటతడి పెడుతూ రాజయ్యకు అనుకూలంగా నినాదాలు చేశారు. తర్వాత పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎమ్మెల్యే కన్నీరుమున్నీరయ్యారు. ఒకదశలో క్యాంపు కార్యాలయంలో కిందపడి, మోకరిల్లి విలపించారు. దీంతో పక్కనే ఉన్న ఆయన భార్య, అభిమానులు, పార్టీ శ్రేణులు కూడా ఏడుస్తూనే ఆయన్ను సముదాయించారు. ఆయన మాట్లాడుతూ ఘన్‌పూర్ టికెట్ విషయమై ఇటీవల పరిణామాలు ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు. తన స్థాయికి తగ్గకుండా సముచిత స్థానం కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల్లో ఉండటమే తనకు ఇష్టమని, నియోజకవర్గమే దేవాలయమని, అవసరమైతే ప్రాణాలు సైతం ఇస్తానన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి సాష్టాంగ నమస్కారం చేసి విలపించారు. ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా తదితరులు వెంట ఉన్నారు.

ఖానాపూర్ బరిలో ఉంటా
ఎమ్మెల్యే రేఖానాయక్ కంటతడి

జన్నారం/ఖానాపూర్: ఎన్నో ఏళ్లుగా పార్టీని అభివృద్ధి చేస్తూ ప్రజలతో కలిసి ఉంటున్న మహిళ అని కూడా చూడకుండా టికెట్ విషయంలో బీఆర్ఎస్ తనకు అన్యాయం చేసిందంటూ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కంటతడి పెట్టారు. పార్టీ టికెట్ నిరాకరించినా ప్రజల మధ్య, వారితోనే ఉండేందుకు ఖానాపూర్ అసెంబ్లీ బరిలో నిలుస్తానని చెప్పారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో కార్యకర్తల భేటీలో, ఖానాపూర్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానికంగా ఉన్న తనను కాదని వలసవాది, స్థానికేతరుడైన వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని రేఖానాయక్ ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ అనుచరుడనే ఒక్క అంశం తప్ప ఆయనకు ఏం అర్హతలు ఉన్నాయని ప్రశ్నించారు. మూడోసారి గెలిస్తే మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే ఇలా చేశారని వాపోయారు. అయినా ప్రజల మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు, కార్యకర్తలతో భేటీ సందర్భంగా రేఖానాయక్ కంటతడి పెట్టారు.

భగత్‌కు మళ్లీ టికెట్‌పై భగ్గు

హాలియా: నాగార్జునసాగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే నోముల భగత్‌కు మరోసారి టికెట్ ఇవ్వడంపై ఆ పార్టీ నేత కడారి అంజయ్య యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన హాలియాలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉప ఎన్నికల సమయంలో బీజేపీలో ఉన్న తనకు.. బీఆర్ఎస్‌లో చేరితే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, వచ్చే ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి న్యాయం చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. కానీ పార్టీలో చేరిన నాటి నుంచే తనను, తన అనుచరులను భగత్ పట్టించుకోకుండా దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

'దేవరకొండ అభ్యర్థిని మార్చండి'

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని, అభ్యర్థి ప్రకటనపై అధిష్టానం పునరాలోచన చేయాలని పలువురు అసమ్మతి నేతలు డిమాండ్ చేశారు. దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం దాదాపు 200 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసమ్మతి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ.. దేవరకొండలో పార్టీ అధిష్టానం సర్వే నిర్వహించి ప్రజాదరణ కలిగిన నాయకుడికి టికెట్ కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పార్టీ కోసం పనిచేసే నాయకులకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదని అసమ్మతి నేతలు ఆరోపించారు.

మెదక్ నుంచే ప్రగతి శంఖారావం

బీడీ ప్యాకర్లకు, టేకేదార్లకు ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్: మంత్రి హరీశ్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మెదక్ ఎస్పీ కార్యాలయం

మెదక్: రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు కొత్త పథకాలకు బుధవారం మెదక్ నుంచి శ్రీకారం చుట్టనుందని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీడీ ప్యాకర్లకు, టేకేదార్లకు ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. మెదక్ నుంచే ప్రగతి శంఖారావం పూరిస్తారని చెప్పారు. బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తెచ్చేలా ఇక్కడ బహిరంగసభ ఉంటుందని, ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు గెలిచి కేసీఆర్‌కు బహుమానంగా ఇస్తామని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదలతో తమ ఆత్మవిశ్వాసం పెరిగిందని, విపక్షాలు మాత్రం విలవిల్లాడుతున్నాయని పేర్కొన్నారు. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి నుంచి కాంగ్రెస్ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. తెలంగాణ పథకాలను కేంద్రంసహా వివిధ రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని, బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష అందిస్తుండగా, దీనిని కేంద్రం కాపీ కొట్టి విశ్వకర్మలకు రూ.లక్ష అప్పు ఇస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. కేసీఆర్ అంటేనే కాలువలు, చెరువులు, రిజర్వాయర్లు అని, బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి అని కొత్త అర్థం చెప్పారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి గుమ్మడిదల, నర్సాపూర్, కౌడిపల్లి మీదుగా మెదక్ పట్టణానికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ కార్యాలయం, 1.20 గంటలకు ఎస్పీ కార్యాలయం, 1.40 గంటలకు కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే బహిరంగ సభలో మాట్లాడతారు. ఏర్పాట్లను మంత్రి హరీశ్ పర్యవేక్షించారు. ప్రారంభానికి ముస్తాబైన జిల్లా పోలీసు కార్యాలయ సముదాయం విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతోంది. కలెక్టరేట్ భవనం, లోపలి చాంబర్లను రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో సిబ్బంది అలంకరించారు.

మా తడాఖా చూపిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

చాలనుకుంటోంది. మునుగోడు ఎన్నికల సమయంలో బీజేపీ ప్రమాదమని చెప్పారు. మరిప్పుడు బీజేపీ ప్రమాదం కాదా? మిత్రధర్మం పాటించరా? కేసీఆర్ దీనికి సమాధానం చెప్పాలి. వామపక్షాలు లేకపోతే మునుగోడులో బీఆర్ఎస్ ఏమయ్యేది? ఆ ఎన్నికల్లో కేసీఆరే మా అండ కోరారు. తర్వాత కూడా వామపక్షాలు మిత్రపక్షాలని చెప్పారు. ఇప్పుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. ఇది ఊహించని పరిణామం. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంలు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. కమ్యూనిస్టుల సత్తా ఏంటో చూపిస్తాం'' అని వామపక్షాల నేతలు ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 115 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడం, పొత్తు మాట ఇంకెక్కడిదని స్పష్టం చేయడంతో కంగుతిన్న సీపీఐ, సీపీఎం నేతలు.. మంగళవారం వేర్వేరుగా, తర్వాత ఉమ్మడిగా సమావేశమయ్యారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రెండు పార్టీలకు చెందిన నేతలు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చెరుపల్లి సీతారాములు, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మ తదితరులు మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్‌తో పొత్తుపై నిర్ణయమేదీ తీసుకోలేదు..: కూనంనేని

15 రోజుల క్రితం బీఆర్ఎస్ నేతలు వినోద్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావులతో పొత్తులపై చర్చ జరిగిందని.. తమకు చెరో అసెంబ్లీ సీటు (సీపీఐకి మునుగోడు, సీపీఎంకు భద్రాచలం), రెండేసి ఎమ్మెల్సీలు ఇస్తామన్నారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ విధమైన పొత్తుకు అంగీకరిస్తే, అప్పటికప్పుడే చెరో ఎమ్మెల్సీని గవర్నర్ కోటాలో ఇస్తామన్నారని.. ఎమ్మెల్సీ సంగతేమో కానీ, చెరో మూడు అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తామని అడిగామని వివరించారు. ''ఇదే సమయంలో బీఆర్ఎస్ బృందం తమ రాజకీయ వైఖరిని కూడా బయటపెట్టింది. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి ఉన్నాయని.. అలా ఉండటం తమకు ఇష్టంలేదని పేర్కొంది. ఇండియా, ఎన్డీఏ రెండు కూటములకు బీఆర్ఎస్ వ్యతిరేకమని కేసీఆర్ మాకు స్పష్టం చేయాలన్నారని బృందం వివరించింది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను, బీజేపీని ఓడించడం కోసం కలిసొచ్చే పార్టీలతో ముందుకు వెళ్తాం..'' అని కూనంనేని తెలిపారు కాంగ్రెస్‌తో పొత్తుపై తామింకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. వామపక్షాల సాయం లేకపోతే బీఆర్ఎస్ మునుగోడులో గెలిచేదా? అని ప్రశ్నించారు. బీజేపీ మునుగోడులో గెలిచి ఉంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీ వైపు వెళ్లేవారు కాదా అని వ్యాఖ్యానించారు.

రాజకీయ వైఖరిలో తేడా వల్లే..: తమ్మినేని

మునుగోడులో బీజేపీని ఓడించటం కోసమే బీఆర్ఎస్‌తో కలిశామని, బీజేపీకి వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు ఏకంగా ఉండాలనేది తమ నిర్ణయమని తమ్మినేని వీరభద్రం వివరించారు. తాము అడిగినన్ని సీట్లు కేసీఆర్ ఇవ్వలేదనే ప్రచారం తప్పు అని, రాజకీయ వైఖరిలోనే తేడా వచ్చిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్ వైఖరిని తమకు వెల్లడించారన్నారు. ''బీజేపీకి వ్యతిరేక నిర్ణయానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ కాంగ్రెస్‌తో జాతీయ స్థాయిలో కలవద్దని బీఆర్ఎస్ నేతలు షరతు విధించారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ తమకు ప్రధాన రాజకీయ శత్రువు కాబట్టి అందులో ఉండబోమని చెప్పారు. 'ఇండియా' కూటమిలో లెఫ్ట్ పార్టీలు ఉన్నందువల్ల మాతో పొత్తు పెట్టుకోలేదని భావిస్తున్నాం. దీనికి కేసీఆర్ సమాధానం చెప్పాలి..'' అని తమ్మినేని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు పొత్తుపై తమకు స్పష్టత ఇవ్వకుండా, నేరుగా అభ్యర్థులను ప్రకటించడం సమంజసం కాదన్నారు. తమకు ఎమ్మెల్సీలు వద్దని, ఎమ్మె ల్యే సీట్లు కావాలని అడిగామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంపై ఎక్కువ పోరాటాలు చేసింది తామేనని.. కేసులు నమోదైంది తమపైనేనని తెలిపారు.

మీ నాన్నను ఎందుకు అడగలేదు?

మహిళలకు 33% సీట్లు కేటాయించకపోవడంపై కవితను ప్రశ్నించిన డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కావాలని ఢిల్లీలో దొంగ దీక్ష చేసిన కవిత రాష్ట్రంలో మహిళలకు 33%సీట్లు ఇవ్వలేదని తండ్రిని ఎందుకు అడగట్లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నిలదీశారు. లిక్కర్ కేసును దారి మళ్లించేందుకే కవిత దీక్ష చేశారని, మహిళా బిల్లును చించేసిన పార్టీలతో కలిసి వెళ్లారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో అరుణ మాట్లాడారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా పెడితే బీఆర్ఎస్ ఆమెకు వ్యతిరేకంగా ఓటు వేసిందని చెప్పారు. ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాల శాఖలను మహిళలకిచ్చిన ఘనత మోదీదేనన్నారు. మహిళల మీద నగరం నడబొడ్డున అకృత్యాలు జరిగినా సీఎం కార్యాలయంలో పనిచేసే ఏ అధికారి మాట్లాడటం లేదని, కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న అధికారులందరికీ రాజకీయ పిచ్చి పట్టుకుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థుల మీద అనేక ఆరోపణలు ఉన్నాయని, అయినా కేసీఆర్ వారినే ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించారని తెలిపారు. అభద్రతా భావంతోనే కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్ గంప గోవర్ధన్ కోరిక మేరకే అని సమర్థించుకోవడం శోచనీయమన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని సీట్లిస్తాయో చూస్తాం

మహిళా రిజర్వేషన్లపై ఆ పార్టీలది ద్వంద్వ వైఖరి: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు మహిళలకు ఎన్ని టికెట్లు కేటాయిస్తాయో చూస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీలు ద్వంద్వ వైఖరి అనుసరిస్తున్నాయని ఆమె ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ టికెట్ల పంపిణీలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ట్విట్టర్ వేదికగా కవిత మండిపడ్డారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బీజేపీ రెండుసార్లు హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. పార్లమెంటులో మెజారిటీ ఉన్నా మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఎందుకు నిలదీయడం లేదని కాంగ్రెస్ అధిష్టానాన్ని రేవంత్ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ఎన్నికల్లో 15 మందికి మాత్రమే అసెంబ్లీ సీట్లు కేటాయించారని, అక్కడ 34 మంది మంత్రుల్లో కేవలం ఒక్క మహిళకే అవకాశం దక్కిందని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు.

ప్రగతిభవన్ వద్ద ధర్నాకు సిద్ధమేనా?

ఎమ్మెల్సీ కవితకు కాంగ్రెస్ నేత పాల్వాయి స్రవంతి సవాల్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌లో 33% మహిళలకు టికెట్ల కేటాయింపు కోసం ప్రగతిభవన్ వద్ద ధర్నా చేసేందుకు ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత సిద్ధమేనా అని టీపీసీసీ అధికార ప్రతినిధి, మునుగోడు కాంగ్రెస్ నేత పాల్వాయి స్రవంతి సవాల్ విసిరారు. కల్వకుంట్ల కవితకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే తన తండ్రిపై పోరాటానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ మహిళా నేతలు కోరారు. ఒక పార్టీ అధినేతగా తన తండ్రి కేసీఆర్ చేతిలో ఉన్న టికెట్ల కేటాయింపు అవకాశాన్ని వదిలిపెట్టి ఎక్కడో పార్లమెంటులో బిల్లులు గురించి కవిత మాట్లాడటం, జంతర్‌మంతర్ దగ్గర బూటకపు పోరాటాలు చేయడం సరికాదని హితవు పలికారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు మాట్లాడుతూ...బీఆర్ఎస్ తరఫున మొత్తం 115 మంది అభ్యర్థులను ప్రకటిస్తే అందులో కేవలం ఏడుగురు మహిళలకే టికెట్లు కేటాయించారని, ఆ పార్టీ మహిళాసాధికారిత గురించి మాట్లాడే అర్హత లేదని చెప్పారు. ప్రధాని పదవితో సహా రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ఏఐసీసీ అధ్యక్షురాలి పదవులను మహిళలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తుంచుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితపై వైఎస్ షర్మిల సెటైర్

ట్విట్టర్ వేదికగా 'బీ ది ఛేంజ్ యు వాంట్ టూ సీ' అంటూ సలహా



సాక్షి, హైదరాబాద్: 'బీ ది ఛేంజ్ యు వాంట్ టూ సీ'అంటూ 33% మహిళా రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవితకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సలహా ఇచ్చారు. నిజంగా కవితకు మహిళా రిజర్వేషన్లపై గౌరవం ఉంటే.. రానున్న ఎన్నికల్లో 33% అమలు చేయించాలని మంగళవారం ఆమె ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సిట్టింగులకు ఇచ్చిన సీట్లలో 33 స్థానాలు మహిళా అభ్యర్థులకు అవకాశం ఇప్పించి కవిత తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 33 శాతం రిజర్వేషన్లకు చిత్తశుద్ధితో పార్టీలు కలిసి రావాలని చిలక పలుకులు పలుకుతున్న కవితమ్మ.. ఢిల్లీలో దొంగ దీక్షలు కాదు.. రాష్ట్రంలో సీట్లిచ్చే దమ్ముండాలన్నారు. 115 సీట్లలో 7 స్థానాలు ఇస్తే చిత్తశుద్ధి ఉన్నట్టా అని నిలదీశారు. తెలంగాణ జనాభాలో 50 శాతం మహిళలున్నా కేబినెట్‌లోనూ ప్రాధాన్యత దక్కలేదన్నారు. లిక్కర్, రియల్ ఎస్టేట్ బిజినెస్‌ల గురించి కాకుండా మీ నాన్నతో మాట్లాడి.. కేబినెట్‌లో, పెద్దల సభలో, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్ ఇప్పించాలంటూ సెటైర్ వేశారు. లిక్కర్ స్కాం పక్కదారి పట్టించేందుకు ఎత్తుకున్న నినాదమే 33 శాతం రిజర్వేషన్లు తప్ప.. మీకెక్కడిది మహిళల పట్ల చిత్తశుద్ధి అని మండిపడ్డారు.

బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం

ప్రకటించిన జాబితా మార్చాల్సిందే.. లేదంటే ప్రభుత్వాన్ని మార్చుతాం: జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): 62% ఉన్న బీసీలకు కేవలం 23 అసెంబ్లీ సీట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం బీసీలను అణిచివేతకు గురిచేయడమేనంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యేల లిస్టులో మార్పులు చేసి బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించకుంటే బీసీలంతా ఏకమై ప్రభుత్వాన్నే మార్చుతామని హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల్లో 136 కులాలు ఉంటే కేవలం 5 కులాలకు టికెట్లు ఇచ్చారని, మిగిలిన 131 కులాలు ఓట్లు ఎలా వేస్తారంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో 80 మంది బీసీలు బలమైన అభ్యర్థులుగా ఉన్నారని, అరశాతం లేని రెడ్లకు 40 టికెట్లు కేటాయించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈటలను బర్తరఫ్ చేసిన స్థానాన్ని మరో రెడ్డికి కేటాయించడం దారుణమన్నారు. మహిళా బిల్లు కావాలంటూ ఓ బీఆర్ఎస్ ప్రకటించిన టిక్కెట్‌ల కేటాయింపుపై ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా పూలే, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామన్నారు. 26న బీఆర్ఎస్ పార్టీలో మోసపోయిన అభ్యర్థులతో హైదరాబాద్‌లో మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

బీసీలకు అన్యాయం చేసిన కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సీట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన కాచిగూడలో, సచివాలయం దగ్గర మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలను తొక్కేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అతి తక్కువ సీట్లు కేటాయించారని, గత ఎన్నికల్లో ఇచ్చిన సీట్ల సంఖ్యకు కూడా కోతపెట్టారని, కామారెడ్డి, హుజూరాబాద్‌లలో బీసీల సీట్లను లాక్కున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 11 మందికి బీసీ మంత్రులుగా అవకాశం కల్పిస్తే.. తెలంగాణలో కేవలం ముగ్గురు బీసీ మంత్రులున్నారని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపులో తప్పు సరిదిద్దుకుని, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను సీఎం చేసిందే బీసీలని.. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ వ్యతిరేక చర్యలన్నింటినీ రెండు కోట్ల కరపత్రాలతో ఊర్లలో పంపిణీ చేస్తే పార్టీ ఎమ్మెల్యేలను ఊర్లలోకి కూడా రానివ్వరన్నారు.

గుద్దుడు గుద్దితే కారు అప్పడం కావాలి

మాజీ మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: ఈసారి ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో గుద్దుడు గుద్దితే కారు అప్పడం కావాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే 115 మంది అభ్యర్థుల జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటించారని, వీరంతా గతంలో కూడా పోటీ చేశారని, కానీ రాష్ట్రంలో ఏం జరిగిందని ప్రశ్నించారు. ఈ అభ్యర్థులు ఎలాంటి వారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, ఈర్ల కొమురయ్య, సుంకేపల్లి సుధీర్‌రెడ్డి, బోరెడ్డి అయోధ్యరెడ్డి, బాలకృష్ణలతో కలిసి జూపల్లి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ తొమ్మిదేళ్ల సినిమా ఇప్పుడు ఎండ్‌కార్డు వరకు వచ్చిందని జూపల్లి చెప్పారు. అక్టోబర్ 16న కొత్తగా బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేస్తామని చెపుతున్నారని, మరి గతంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు, సీఎం కేసీఆర్ క్షమాపణలు చెప్పి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

మీ పౌరుషం కేసీఆర్‌కు రుచి చూపాలి

తిరుపతి వెంకటేశ్వర స్వామి సాక్షిగా మంత్రి హరీశ్‌రావుపై ఆ పార్టీ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు ఆరోపణలు చేశారని, మైనంపల్లి దెబ్బ ఏంటో, ఆయన పౌరుషం ఏంటో కేసీఆర్‌కు రుచి చూపించాలని జూపల్లి అన్నారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 23 । ఆగస్టు । 2023



ముద్ర రుణాల వల

సైబర్ నేరస్తులు ముద్ర రుణాల అవతారం ఎత్తారు. వ్యాపారులు, సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌సీ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)లకు ముద్ర రుణాల పేరుతో దోచేస్తున్నారు. -10లో



24న 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

నగరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు డ్రా పద్ధతిలో ర్యాండో మైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. -10లో

..ఖాళీలను భర్తీ చేయండి



వాణిజ్య పన్నుల మల్టీజోన్ 1- 2లలో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆ శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. -10లో

న్యూస్‌రీల్

రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి సేవలు చిరస్మరణీయం

నగర కొత్వాల్ సీవీ ఆనంద్



హిమాయత్‌నగర్: నగర 14వ కొత్వాల్, రెడ్డి కాలేజీల వ్యవస్థాపకుడు రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి సేవలు చిరస్మరణీయమని నగర కొత్వాల్ సీపీ ఆనంద్ అన్నారు. మంగళవారం రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి జయంతిని పురస్కరించుకుని నారాయణగూడ వైఎంసీఏ వద్ద ఆయన విగ్రహానికి రెడ్డి కాలేజీ యాజమాన్యంతో కలిసి సీపీ ఆనంద్ నివాళులు అర్పించారు. అనంతరం బంగారు పతకాలను సిటీ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సైబరాబాద్ సోషల్ మీడియా సెల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. తన తండ్రి రెడ్డి హాస్టల్లో ఉండి చదువుకుని కాలేజీలో సెక్రటరీగా పని చేశారని, తన భార్య ఇంటర్మీడియట్ రెడ్డి కాలేజీలోనే చదివారని ఆయన గుర్తు చేసుకున్నారు. రానున్న రోజుల్లో రెడ్డి కాలేజీలో చదివే విద్యార్థులంతా మంచి పేరు, ప్రఖ్యాతులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఎస్టీపీ నిర్మాణ పనుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: తుది దశ నిర్మాణంలో ఉన్న ఎస్టీపీలను ట్రయల్ రన్ కోసం సిద్ధం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఫతేనగర్, పెద్ద చెరువు, నల్ల చెరువు, నాగోల్ ఎస్టీపీలను సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. మొత్తం 3 ప్యాకేజీల్లో, 5 సర్కిళ్లలో సుమారు రూ.3,866.41 కోట్ల వ్యయంతో కొత్తగా 31 మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. కొత్త ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే.. నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. వీటి ద్వారా రోజూ 1282 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయవచ్చన్నారు. ఆయన వెంట జలమండలి ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎంలు సుదర్శన్, సుజాత తదితరులున్నారు.

శిశు విహార్ అభివృద్ధికి చర్యలు: కలెక్టర్



శిశువిహార్‌లో చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: శిశు విహార్ అభివృద్ధి, నిర్వహణకు సహకారం అందిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం వెంగళరావునగర్‌లోని శిశువిహార్‌ను ఆయన సందర్శించారు. పిల్లలకు శిశు విహార్ అందిస్తున్న వసతులు, మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రాథమిక పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడ కల్పిస్తున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపి, ప్రత్యేక విద్య, వృత్తిలో నైపుణ్య శిక్షణ, వివిధ రకాల సేవలు అందిస్తున్న వారితో మాట్లాడారు. కలెక్టర్ వెంట జిల్లా అభివృద్ధి అధికారి అక్కేశ్వర్ రావు తదితరులున్నారు.

బాలుడిని బలిగొన్న లిఫ్ట్ గుంత



రాఘవేందర్ (ఫైల్)

హయత్‌నగర్: నిర్మాణంలో ఉన్న భవనానికి లిఫ్ట్ కోసం తీసిన గుంత బాలుణ్ని కబళించిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది . పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా పాతర్లపాడుకు చెందిన వి.సైదులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మన్సూరాబాద్ డివిజన్‌లోని ఆదర్శ నగర్ కాలనీలో ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. ఆయన కొడుకు రాఘవేందర్ (7) సోవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి వస్తూ ఆదర్శనగర్‌లో నిర్మాణంలో ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్న బంధువుల పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నిర్మాణంలో ఇంటి వద్ద లిఫ్ కోసం తవ్విన గుంతలో పడ్డాడు, అందులో ఉన్న నీటిలో మునిగి మృతి చెందాడు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు వెతకగా.. గుంతలో శవమై కనిపించాడు. లిఫ్ట్ కోసం తీసిన గుంత చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం, అందులో నీటిని తొలగించకపోవడంతోనే ఈ దుర్ఘటనకు కారణమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సీటు ఎంతో స్వీటు!

రానున్న శాసన సభ ఎన్నికల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలు గాంధీ భవన్‌కు క్యూ కడుతున్నారు. మంది మార్బలంతో హంగామా చేస్తున్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం టికెట్ తనకు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి తన అనుచరులతో కలిసి గాంధీ భవన్‌కు తరలివచ్చారు. లంబాడా మహిళలు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు.

ఇకపై.. లైఫ్ ట్యాక్స్

మినహాయింపు.. ముగింపు..

- కేవలం 8000 వాహనాలకే జీవితకాల పన్ను నుంచి ఊరట
- యథావిధిగా జీవితకాల పన్ను చెల్లించాల్సిందే
- ద్విచక్ర, ఇతర వాహనాలకు ఇంకా కొనసాగింపు
- గ్రేటర్‌లో 50 వేలకు చేరుకున్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు
- ఆటోలు, వస్తు రవాణా వాహనాల అమ్మకాల్లోనూ దూకుడు

సాక్షి, సిటీబ్యూరో: బ్యాటరీ కారు కొనుగోలు చేస్తున్నారా.. ఇక నుంచి జీవితకాల పన్ను చెల్లించాల్సిందే. ఎలక్ట్రిక్ కార్ల కోటా ముగియడంతో అన్ని రకాల వాహనాల్లాగే ఎలక్ట్రిక్ కార్లకు సైతం జీవితకాల పన్ను వసూలు చేసేందుకు రవాణాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసే వాహనదారులు ఇక నుంచి బండి ధరతోపాటు జీవితకాల పన్నును కూడా కొనుగోలు సమయంలోనే చెల్లించాల్సి ఉంటుంది. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు, పర్యావరణ హిత బ్యాటరీ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను జీవితకాల పన్ను నుంచి మినహాయించిన సంగతి తెలిసిందే. వివిధ కేటగిరీలకు చెందిన వాహనాల డిమాండ్, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని కల్పించారు. 5000 కార్లకు పన్ను నుంచి మినహాయింపునివ్వగా, వాహనదారులు, డీలర్లు, తదితర వర్గాల విజ్ఞప్తి మేరకు రవాణాశాఖ మొదట మరో 2000 వాహనాలకు, ఆ తర్వాత మరో 1000 వాహనాలకు ఆ ప్రోత్సాహక రాయితీని అందజేసింది. దీంతో జీవితకాల పన్నునుంచి మినహాయింపు పొందిన వాహనాల సంఖ్య 5000 నుంచి 8000కు పెరిగింది. ఇక నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కేటగిరీకి చెందిన వాహనాలకు పన్ను నుంచి మినహాయింపును ఇవ్వబోమని, అన్ని రకాల వ్యక్తిగత వాహనాల్లాగే ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసే వాహనదారులు సైతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు పలు ఆటోమొబైల్ సంస్థలకు చెందిన డీలర్లు మాత్రం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం గమనార్హం. గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు మరిన్ని వాహనాలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

మరో 90వేల ద్విచక్ర వాహనాలకు అవకాశం..

- నగరవాసులు కొంతకాలంగా బ్యాటరీ ద్విచక్ర వాహనాల పట్ల ఎక్కువ ఆసక్తిని చూపుతున్నారు. కార్లు, ఇతర కేటగిరీలకు చెందిన వాటి కంటే వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. పెరుగుతున్న ఇంధన ధరలు, ఇతర నిత్యావసర వస్తుల ధరలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లుతున్నారు. ఈ మేరకు గత రెండేళ్లుగా వీటి వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు సుమారు 50 వేలకు పైగా ఎలక్ట్రిక్ బైక్‌లు రోడ్డెక్కాయి. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం కార్లతో పాటు 2 లక్షల బైక్‌లకు సైతం జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చింది.
- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఇప్పటి వరకు 1,06,668 ద్విచక్ర వాహనాలు ఈ ప్రోత్సాహకాన్ని అందుకొని రోడ్డెక్కాయి. మరో 90 వేలకు పైగా వాహనాలకు పన్ను మినహాయింపు అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ వాహనాలకు సుమారు రూ.220 కోట్లకు పైగా పన్ను మినహాయింపు లభించినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనాల కేటగిరీలో మరో రెండేళ్ల వరకు ఈ రాయితీ లభించే అవకాశం ఉంది. కమర్షియల్ కేటగిరి కింద కొనుగోలు చేసే వాహనాల్లో 25000 ఆటో రిక్షాలకు మినహాయింపునివ్వగా, ఇప్పటి వరకు 18 వేలకు పైగా ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాయి. 10 వేల తేలికపాటి వస్తురవాణా వాహనాల్లో 7 వేలకు పైగా రోడ్డెక్కాయి.



బ్రాండెడ్ వాహనాల వైపే మొగ్గు..

మరోవైపు సమర్థమైన బ్యాటరీలు కలిగిన బ్రాండెడ్ బైక్‌లకే నగరవాసులు మొగ్గు చూపుతున్నారు. గతంలో చోటుచేసుకున్న కొన్ని ప్రమాద ఘటనల దృష్ట్యా ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఏఐఎస్) ధ్రువీకరించిన ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన వాహనాలకు ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుతం వాహనదారుల డిమాండ్ మేరకు లభించడం లేదు. కొన్ని బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కనీసం 3 నెలల పాటు ఎదురుచూడాల్సి రావడం గమనార్హం. గతంలో ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల వరకు మాత్రమే బండి నడిచేది. ఇప్పుడు వంద కిలోమీటర్ల వరకు పరుగులు పెట్టే నాణ్యమైన వాహనాలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

గంజాయి మత్తులో అఘాయిత్యం

- మీర్‌పేటలో బాలికపై అత్యాచారం కేసు కొలిక్కి
- ఏడుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు
- వివరాలను వెల్లడించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్.. వెనక నిల్చుని ఉన్న నిందితులు

నాగోలు: మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి మత్తులో వీరు అఘాయిత్యానికి పాల్పడినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నగరంలోని లాలాపేట శాంతినగర్‌లో నివాసం ఉండే బాలిక (14) వారం రోజుల క్రితం తన సోదరులతో కలిసి నందనవనంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈ నెల 19న మంగళ్‌హాట్, సీతారాంపేటకు చెందిన మెకానిక్ అబేద్ బిన్-ఖాలీద్ అలియస్ అబేద్ నందనవనం వచ్చాడు. సదరు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక బంధువులు అతడిని మందలించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బాధిత బాలిక తన ఇద్దరు సోదరులతో కలిసి ఇంట్లో ఉంది. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న అబేద్, తన స్నేహితులు తహసీన్ అలియాస్ టైసన్, మహేష్‌తో కలిసి బాలిక ఉంటున్న ఇంటికి వచ్చారు. బాలికపై అబేద్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత తహసీన్, నందనవనం వాంబే కాలనీకి చెందిన మంకాల మహేష్ (20), అదే ప్రాంతానికి చెందిన ఎం.నర్సింగ్ అలియస్ బ్యాంగ్ చిన్నా (23), అష్రఫ్ (20), రసూల్‌పురాకు చెందిన ఎండీ ఫైజల్ (21), ఎండీ ఇమ్రాన్‌లు కత్తితో బెదిరించి సామూహిక అత్యాచారం చేశారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రధాన నిందితుడు అబేద్ బిన్ ఖాలీద్‌ను సంతోష్‌నగర్ చౌరస్తాలో అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మహేష్, నర్సింగ్, అష్రఫ్, ఎండీ ఫైజల్, ఎండీ ఇమ్రాన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న తహసీన్‌ను మంగళవారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు మల్కాజిగిరిలో పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు అబేద్ బిన్ ఖాలీద్‌పై ఇప్పటికే మంగళ్‌హాట్ పీఎస్ పరిధిలో రౌడీ షీట్ తెరిచి ఉన్నట్లు ఆయన చెప్పారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, వీరి నుంచి ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్, డీసీపీ సాయిశ్రీ, అడిషనల్ డీసీపీ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అసంతృప్తి ఆగేనా.. అభ్యర్థి గెలిచేనా?

టికెట్లు దక్కని ఆశావహులు కలిసి పనిచేస్తారా?

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించి.. అది దక్కని ఆశావహులు అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టికెట్ నీకా? నాకా ? అన్నట్లు పోరాడిన వారు తమకు దక్కని టికెట్ ఇతరులకు దక్కితే వారితో కలిసి పనిచేయడం అసాధ్యమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్టానం మాట కాదనలేక కలిసి పని చేయగలమని తలాడించినప్పటికీ, నిజంగా క్షేత్రస్థాయిలో ఏమేరకు పని చేయగలరన్నది వేచి చూడాల్సిందే. ఉదాహరణకు ఉప్పల్ అభ్యర్థికి టికెట్ రాకుండా చివరి నిమిషం వరకు ప్రయత్నం చేసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రస్తుత ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఎన్నికల్లో బండారి లక్ష్మారెడ్డి గెలుపు కోసం పనిచేయగలరా? అని స్థానికులే ప్రశ్నిస్తున్నారు. అలాగే.. అంబర్‌పేటలో టికెట్ కోసం ప్రయత్నించిన ఎడ్ల సుధాకర్, కాలేరు వెంకటేశ్‌కు టికెట్ ఇవ్వొద్దని బ్యానర్లు కట్టి డిమాండ్ చేసిన తాజా, మాజీ కార్పొరేటర్లు, తదితరులు ఆయన విజయానికి పనిచేస్తారా? అనే సందేహాలున్నాయి. ముషీరాబాద్‌లో ఎమ్మెన్ శ్రీనివాసరావు, ఆయన అనుయాయులు ముఠాగోపాల్ కోసం పనిచేస్తారా? అనేది అంతుచిక్కడం లేదు. కంటోన్మెంట్‌లోనూ టికెట్ కోసం కడదాకా పోరాడిన గజ్జెల నగేష్, మన్నె క్రిశాంక్, శ్రీగణేశ్ లాస్యనందితకు సహకరించగలరా అన్నది సందేహాస్పదమే. వీరిలో శ్రీగణేశ్ ఇప్పటికే ఇండిపెండెంట్‌గానైనా సరే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మహేశ్వరం టికెట్ రాని పక్షంలో తీగల కృష్ణారెడ్డి పార్టీ మారతారని ఎప్పటినుంచో వినిపిస్తోంది. ఎల్‌బీనగర్ నుంచి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, రాజేంద్రనగర్ టికెట్ కోసం ప్రయత్నించిన ఎంపీ రంజిత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్ రెడ్డి, శేరిలింగంపల్లిలో టికెట్ తనకే వస్తుందని భావించిన బండి రమేశ్ తదితరులు ఎంపికైన అభ్యర్థుల కోసం ఏమేరకు కృషి చేస్తారో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్న వారు అసంతృప్తులను తమ దారికి తెచ్చుకోగలరా.. వారి నడుమ సఖ్యత సాధ్యమేనా.. అన్నది కాలమే తేల్చనుంది.

పాత ఎపిక్ ఉన్నా.. ఓటు డౌటే!

- ఓటరు జాబితా చూసుకోవాల్సిందే
- లేకుంటే దరఖాస్తు చేసుకోవాలి



సాక్షి, సిటీబ్యూరో: ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్) ఉందనుకొని ఇప్పుడు ఓటరు జాబితాలో పేరుందో లేదో చూసుకోకపోతే.. తీరా పోలింగ్ నాడు వెళ్లినా మీకు ఓటు లేదని నిరాకరించవచ్చు. ఇప్పటికే ఎపిక్ కార్డులున్నప్పటికీ చాలామంది పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉండటం లేవు. వాస్తవానికి ఒక ఓటును తొలగించాలంటే నిబంధనల మేరకు ఎన్నో పాటించాల్సి ఉంది. ఓటరు కచ్చితంగా లేడని నిర్ధారించుకున్నాకే తొలగించాల్సి ఉన్నప్పటికీ ఇవేవీ లేకుండానే ఇష్టానుసారం ఓట్లను తొలగించారు. దీంతో మీకు ఎపిక్ ఉన్నప్పటికీ జాబితాలో మీ పేరు లేకపోవచ్చు. తప్పు ఎవరిదైనా మీకు ఓటు వేసే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో మీ పేరుందో, లేదో చూసుకొని లేకుంటే దరఖాస్తు చేసుకొమ్మని కోరుతున్నారు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్. తాజాగా వెలువరించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరుందో లేదో చూసుకోవాలని సూచించారు.

ఏ అవసరానికి ఏ ఫారం వినియోగించాలంటే..

- 18 సంవత్సరాల వయసు దాటినప్పటికీ, ఇప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు నమోదు చేసుకునేందుకు, ఎపిక్ ఉన్నప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు నమోదు చేసుకునేందుకు, రాబోయే అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండే వారు ఇప్పుడే నమోదు చేసుకునేందుకు ఫారం 6.
- ఆధార్‌తో అనుసంధానానికి ఫారం 6బి.
- జాబితాలోంచి అనర్హుల పేర్లు తొలగించేందుకు, కొత్త ఓటరు చేర్పుపై అభ్యంతరాలు తెలియజేసేందుకు ఫారం 7
- పేరు, వివరాల్లో దోషాలు సరిచేసుకునేందుకు, నియోజకవర్గం పేరు పొరపాటుగా ఉన్నప్పుడు,కుటుంబ సభ్యులందరి పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో కాకుండా వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నప్పుడు, ఫొటో సవ్యంగా లేనప్పుడు, జాబితాలో మొబైల్ నంబర్ అప్‌డేషన్‌కు ఫారం 8.
- ముసాయిదా ఓటరు జాబితాలో పేరుందో లేదో చూసుకునేందుకు www.ceotelangana.nic.in
- జాబితాలో పేరుండి పొరపాట్ల సవరణ, మార్పుచేర్పుల కోసం www.voters.eci,gov.in లేదా voterhelpline app ద్వారా
- ఇతర వివరాలకు ఓటర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1950 సంప్రదించవచ్చు.

ఫుట్‌పాత్ పక్కన నవజాత మృత శిశువు



కవర్‌లో ఉన్న శిశువు మృతదేహం

రహమత్‌నగర్: రహమత్ నగర్ డివిజన్ కార్మికనగర్ ఫుట్ పాత్ పక్కన ఉన్న చెత్తకుప్పలో నవజాత శిశువు మృతదేహం మంగళవారం తెల్లవారుజామున కలకలం రేపింది. కార్మికనగర్ ఫుట్ పాత్ పక్కన ఉన్న చెత్త కుప్పలో తెల్లవారు జామున కవర్‌లో చుట్టి ఉన్న నవజాత శిశువును గమనించిన స్థానికులు మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్నపోలీసులు శిశువును చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మగశిశువు మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతశిశువును ఎవరు ఈ ప్రాంతంలో పడవేశారో అనే దానిపై స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

నేడు జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్‌తో పాటు ఇతరత్రా డిమాండ్ల సాధన కోసం జీహెచ్‌ఎంఈయూ ఆధ్వర్యంలో కార్మికుల సమ్మె నిరవధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు వారికి మద్దతు తెలపనున్నాయి. ఈ నేపథ్యంలో జరిగే సమావేశం సజావుగా సాగనుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. గత సమావేశం రసాభాసగా ముగియడం తెలిసిందే. ఈసారి సమావేశానికి కౌన్సిల్ హాల్‌లోకి మీడియాకు ఆహ్వానం లేదు. నగరంలో తీవ్ర సమస్యలుగా మారిన దోమల స్వైరవిహారం, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సభ్యులు ప్రశ్నించనున్నారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ బాధ్యతలు స్వీకరించాక జరుగుతున్న తొలి సర్వసభ్య సమావేశం ఇది. ఇప్పటికే స్టాండింగ్‌కమిటీలో ఆమోదం పొందిన అంశాలతో సహ 40 అంశాలకు పైగా అజెండాలో ఉన్నాయి.

ఢీకొని.. 100 మీటర్లు ఈడ్చుకెళ్లి..

- ద్విచక్ర వాహనదారు మృతి
- బైక్‌ను ఢీకొట్టిన ఫార్మా కంపెనీ బస్సు
- చెలరేగిన మంటలు.. రెండు వాహనాలూ బుగ్గి



మంటల్లో బస్సు

శామీర్‌పేట్: ఓ ప్రైవేటు కంపెనీ బస్సు, బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారు అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగి బస్సు, బైక్ పూర్తిగా దగ్ధమైన ఘటన మంగళవారం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామానికి చెందిన సంపత్ కుమార్ గౌడ్ బైక్‌పై తుర్కపల్లిలో తను పనిచేసే యూజియా ఫార్మా కంపెనీకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జైడస్ ఫార్మా కంపెనీకి చెందిన బస్సు కొల్తూర్ వైపు నుంచి పోతారం వైపు వెళ్తోంది. కొల్తూర్ గ్రామ పరిధిలోకి రాగానే సంపత్‌కుమార్ బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో సంపత్ కుమార్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. సుమారు 100 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లడంతో బైక్ పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగి బస్సుకు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో బస్సుకు పూర్తిగా మంటలు వ్యాపించడంతో బైక్, బస్సు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తిగా కాలిపోయిన బస్సు, బైక్



సంపత్ కుమార్ గౌడ్



కృతజ్ఞతలు సార్!

కంటోన్మెంట్ అసెంబ్లీ సీటును తనకు ఇచ్చినందుకు దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

బాలుడిపై హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కూన మహాలక్ష్మినగర్‌లో లక్ష్మి, దుర్గయ్య దంపతుల కుమారుడు ఆదిత్యను గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు ఆటో డ్రైవర్ యాదగిరిని పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సాయం

నేడు టూరిజం ప్లాజాలో చెక్‌ల పంపిణీ

లక్డీకాపూల్ : జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 96 జర్నలిస్టు కుటుంబాలకు మీడియా అకాడమీ చెక్కుల పంపిణీ చేయనుంది. 'సంక్షేమ నిధి పాత్రికేయుల పెన్నిధి' పేరిట ప్రభుత్వం గత ఏడేళ్లలో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు, పనిచేయలేని, నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రూ. 42 కోట్ల జర్నలిస్టుల సంక్షేమ నిధి మూలధనంపై వచ్చిన వడ్డీతో మీడియా అకాడమీ ఆర్థిక చేయూతనందిస్తుంది. బేగంపేట్‌లోని, హోటల్ టూరిజం ప్లాజాలో ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ చెక్కులను పంపిణీ చేయనున్నారు.

బీసీ బంధుకు మోక్షం

- నేటి నుంచి ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

సాక్షి,సిటీబ్యూరో: బీసీ కుల, చేతివృత్తులకు ఆర్థిక చేయూత అందించే బీసీ బంధు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున చెక్కుల పంపిణీకి రంగం సిద్ధమైంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో రెండున్నర నెలల క్రితం లాంఛనంగా ఐదుగురు లబ్ధిదారులకు మాత్రమే చెక్కులు పంపిణీ చేయగా.. తాజాగా మిగిలిన లబ్ధిదారులకు బుధవారం నుంచి చెక్కుల పంపిణీకి శ్రీ కారం చుట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 20,724 మంది దరఖాస్తు చేసుకోగా, వాటిపై క్షేత్ర స్థాయి విచారణ తర్వాత ఎమ్మెల్యేల ఆమోదంతో నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఎంపిక చేశారు. వారిని ఎమ్మెల్యేల చేతులు మీదుగా చెక్కులు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఈ నెల 23, 24 తేదీల్లో పలు నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు మరింత అభివృద్ధి సాధించేందుకు వారికి చేయూతను అందించాలనే లక్ష్యంతో రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. 23న సనత్ నగర్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, అంబర్ పేట నియోజకవర్గాల పరిధిలో, 24 న ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

సుల్తాన్‌బజార్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నేషనల్ హెల్త్‌మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న వివిధ కేడర్ల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మనెంట్ చేయాలన్నారు. జీఓ నెంబర్ 510తో అన్యాయానికి గురైన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో గత 25 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్న తమకు ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు ఎండీ కరీం, బాలసుబ్రమణ్యం, రమణకర్, నరేష్, రమేష్, శ్రీనివాస్, నవకాంత్, సత్యవతి, అనిత, జయసుధ, వాణి, స్వప్న, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ముద్ర రుణాల వల!

వ్యాపారులు, ఎంఎస్‌ఎంఈ సంస్థలే లక్ష్యంగా మోసాలు

- ముద్రలోన్ నకిలీ వెబ్‌సైట్లు సృష్టించిన నిందితులు
- దరఖాస్తు, పరిశీలన, రుణ విడుదల అంతా వాట్సాప్‌లోనే
- ఉత్తరాది రాష్ట్రాల నుంచి కార్యకలాపాలు
- రూ.20 లక్షల రుణానికి రూ.47 లక్షలు చార్జీలు వసూలు
- మోసపోయిన బాలానగర్‌కు చెందిన వ్యాపారి



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరస్తులు ముద్ర రుణాల అవతారం ఎత్తారు. వ్యాపారులు, సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)లకు ముద్ర రుణాల పేరుతో వల విసిరి దోచేస్తున్నారు. వీరు ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) నకిలీ వెబ్‌సైట్లు సైతం సృష్టించడం గమనార్హం. దరఖాస్తుల ప్రాసెసింగ్, టీడీఎస్, జీఎస్‌టీ అంటూ రకరకాల చార్జీల పేరుతో జేబు ఖాళీ చేస్తున్నారు. తాజాగా ఈ ముఠా వలలో చిక్కిన నగరవాసి నుంచి రూ.20 లక్షల ముద్ర రుణం జారీ కోసం రూ.47 లక్షలు చార్జీల రూపంలో వసూలు చేసి టోకరా వేశారు.

గూగుల్‌లో సెర్చ్..

బాలానగర్‌కు చెందిన వ్యాపారి వ్యాస్ చరణ్ గూగుల్‌లో వ్యక్తిగత, వ్యాపార రుణం కోసం సెర్చ్ చేశాడు. దీంతో ముద్ర లోన్‌కు సంబంధించిన ఒక మొబైల్ నంబర్ కనిపించగా.. ఫోన్ చేశాడు. కానీ, ఎవరూ లిఫ్ట్ చేయలేదు. తర్వాత కొద్ది సేపటికి అదే నంబర్ నుంచి బాధితుడికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి హిందీలో మాట్లాడుతూ.. తనను పీఎంఎంవై ఉద్యోగి మోహిత్ సింగ్‌గా పరిచయం చేసుకున్నాడు. అతని గుర్తింపు కార్డును బాధితుడికి వాట్సాప్‌కు పంపించాడు. దీంతో వ్యాస్ అతడిని నమ్మాడు.

చార్జీల పేరిట వసూలు..

సైబర్ నేరస్తులు బాధితుడి వాట్సాప్‌కు పీఎంఎంయూడీఆర్‌ఏవైఓజేఏఎన్‌ఏ.కామ్ వెబ్‌సైట్ లింక్‌ను పంపించారు. అందులో అతను తన వ్యక్తిగత వివరాలను నమోదు చేశాడు. అనంతరం నిందితుల సూచన మేరకు ఆధార్, పాన్ కార్డులతో పాటు ఐటీ రిటర్న్‌లను వాట్సాప్‌కు పంపించాడు. దీంతో రూ.20 లక్షల రుణానికి అర్హత ఉందని, 3 శాతం వడ్డీ రేటు అని చెప్పారు. ఇందుకుగాను రూ.4,200 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరడంతో.. బాధితుడు పంపించాడు. దీంతో రుణం ఆమోదం అయినట్లుగా సూచించే డాక్యుమెంట్‌ను ఫొటో కాపీని బాధితుడి వాట్సాప్ ద్వారా పంపించారు. అనంతరం ఇన్సూరెన్స్ చార్జీలు రూ.16,200, టీడీఎస్ ఛార్జీలు రూ.37,800 వసూలు చేశారు. ఆలస్య రుసుము, చెక్ అప్‌డేట్ చార్జీలు, ఎన్‌టీసీ, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లతో సహా రకరకాల చార్జీల పేరిట రూ.47 లక్షలు వసూలు చేశారు. ఎంతకీ రుణం మంజూరు కాకపోవటంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నకిలీ ముద్ర వెబ్‌సైట్లు..

సైబర్ నేరస్తులు హెచ్‌టీటీపీ://పీఎంఎంయూడీఆర్‌ఏవైఓజేఏఎన్‌ఏ.కామ్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంయూడీఆర్‌ఏఎఫ్ఐఎన్‌ఎస్‌ఈఆర్‌వీఈ.ఇన్ పాప్ అప్ లింక్‌లతో నకిలీ ముద్ర రుణ వెబ్‌సైట్లను సృష్టించారు. దీంతో గూగుల్‌లో సెర్చ్ చేసినప్పుడు ఈ నకిలీ సైట్లు ప్రత్యక్షమయ్యేలా సాంకేతికతను జోడించారు. పుణే, ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ఈ తరహా కేసులు నమోదయ్యాయని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. ముద్ర రుణాల మోసాలపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలని బ్యాంకులకు కేంద్రం సూచించింది. కార్పొరేటేతర, వ్యవసాయేతర, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు రూ.10 లక్షల వరకు రుణాలను అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2015 ఏప్రిల్ 8న మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ బ్యాంక్ (ముద్ర) పథకాన్ని ప్రారంభించారు.

రెడీ మిక్స్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు



రాములు మృతదేహం

దుండిగల్: వెనుక నుంచి వేగంగా వచ్చిన రెడీ మిక్స్ లారీ బైక్‌ను ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు మంగళవారం చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, నారాయణ్‌ఖేడ్ మండలం, నర్సాపూర్ గ్రామానికి చెందిన పుప్పాల రాములు(40) నగరానికి వలస వచ్చాడు. తన భార్య యశోదతో కలిసి బాచుపల్లిలోని అభ్యాస్ కళాశాలలో కూలీలుగా పని చేస్తూ అక్కడే ఓ గదిలో నివాసం ఉంటున్నారు. రాములు వరుసకు సోదరుడైన దుర్గాని మైసయ్యతో కలిసి ఈ నెల 21న బైక్‌పై బాచుపల్లి నుంచి సూరారం వైపు వెళ్తుండగా బౌరంపేటలోని కోకా కోలా కంపెనీ వద్ద వెనుక నుంచి వచ్చిన రెడీ మిక్స్ లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న రాములు ఎగిరి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మైసయ్యకు స్వల్ప గాయాలు కాగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయండి



సాక్షి, సిటీబ్యూరో: వాణిజ్య పన్నుల శాఖలో ఇటీవల చేపట్టిన బదిలీలతో మల్టీజోన్ 1-2 లో ఏర్పడిన ఖాళీలను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రతినిధుల బృందంతో కలిసి వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ వై సునీత, అడిషనల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు,అబిడ్స్ డివిజన్ జాయింట్ కమిషనర్ లావణ్య, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఖాళీల భర్తీకి తక్షణమే తాత్కాలిక ప్రమోషన్లు చేపట్టి అర్హులకు పదోన్నతులు కల్పించాలన్నారు. జీఎస్టీ అమలులో మెరుగైన సేవలను అందించడానికి అదనపు బాధ్యతలు కాకుండా ప్రమోషన్ కల్పించాలని, దీంతో సీనియర్లకు అన్యాయం జరగకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, అనిల్ కుమార్, శ్రీనివాస్ రావు, ఎం ఏ బారి, ఆనందం, సారయ్య, జలాలుద్దీన్, విక్టర్ పాల్, సునీల్, శ్రీనివాస్, స్వరూపరాణి, కృష్ణవేణి, సునీత, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

24న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక

- ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ద్వారా డ్రా
- అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం డ్రా పద్ధతిలో ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సనత్ నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ల సమక్షంలో డ్రా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ పనితీరును ఎన్ఐసీ అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ తప్పకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తామన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన ఇంటిలో పేద ప్రజలు గొప్పగా బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి పేదలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సరైన వసతులు లేక, ఇరుకు ఇళ్లల్లో అవస్థలు పడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని అంబేడ్కర్ నగర్, బండ మైసమ్మ నగర్, పొట్టి శ్రీరాములు నగర్, జీవైఆర్ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి అర్హులైన వారికి కేటాయించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మారేడ్ పల్లి, మడ్ పోర్ట్ తదితర ప్రాంతాల్లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి అర్హులకు కేటాయించామన్నారు. అర్హులందరినీ గుర్తించి మిగిలిన ఇళ్లను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణ జరిపి అర్హులను గుర్తించి జాబితా అందజేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎవరు కూడా అధైర్య పడవద్దని అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితురాలికి బాసటగా...

- లైంగిక దాడి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి
- విపక్షాల డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ, టీడీపీల ఆధ్వర్యంలో నందనవనంలో ఆందోళనలు



బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న సామరంగారెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నందనవనం కాలనీలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నందనవనం కాలనీలో బాలికపై లైంగికదాడికి నిరసనగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పందించకుండా తనకు టికెట్ వచ్చిన ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు సుధీర్‌రెడ్డికి తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు భీమిడి రామక్రిష్ణారెడ్డి, బుద్ధ సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వేణుయాదవ్, సదాశివుడు, గోపాల్, గౌస్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వై.వెంకట్ గాంధీ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.



కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డిని అరెస్ట్ చేస్తున్న మీర్‌పేట పోలీసులు

బీజేపీ ఆధ్వర్యంలో..

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదని నిత్యం ఏదో ఒక చోటు మహిళలపై దాడులు , అత్యాచారాలు జరుగుతున్నా పాలకులకు పట్టడం లేదని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. నందనవనం కాలనీ ఘటనకు బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. మంగళవారం 'సేవ్ ఎల్‌బీనగర్' పేరుతో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకునే ధ్యాసలో కేసీఆర్ ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌యాదవ్, ఎరుకల మల్లేశ్‌గౌడ్, రాజుగౌడ్, శేఖర్‌గౌడ్, మునిల్ నాయక్, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చందు, బాల్‌రాజ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన సబ్సిడీ ఇసుక!

- ఐసీసీసీ, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆడిటోరియం నిర్మాణానికి టీఎస్‌ఎండీసీ కేటాయింపు
- 17.500 క్యూబిక్ మీటర్ల ఇసుకలో 10.636 క్యూబిక్ మీటర్లు పక్కదారి
- ఆర్‌ఎండ్‌బీ ఈఈ అశోక్, ఇసుక సప్లయర్ రాహుల్‌పై కేసు నమోదు

హిమాయత్‌నగర్: ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు గాను 'తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (టీఎస్‌ఎండీసీ) సబ్సిడీ కింద ఇచ్చే ఇసుక పక్కదారి పట్టింది. 2016లో బంజారాహిల్స్‌లో ప్రారంభమైన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ), ఆ తర్వాత 'సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆడిటోరియం' నిర్మాణాలకు కేటాయించిన ఇసుకను అప్పటి ఆర్అండ్‌బీ ఈఈ ఎస్. అశోక్, మధుర ఇసుక సప్లయర్ రాహుల్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకున్నారు. ఈ విషయం ఇటీవల సీఐడీ దృష్టికి రావడంతో ఏడీజీ మహేష్‌భగవత్ తన బృందంతో దర్యాప్తు చేపట్టారు. ఈ విచారణలో దాదాపు టీఎస్‌ఎండీసీ సంస్థకు రూ. 2.80 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. దీంతో కొద్దిరోజుల క్రితం హోంశాఖకు ఫిర్యాదు చేయడమేగా, నగర సీపీ సీవీ ఆనంద్ దృష్టికి తెచ్చారు. తాజాగా సీఐడీ అడిషినల్ ఎస్పీ కే.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

10,636 క్యూబిక్ మీటర్ల ఇసుక పక్కదారి

ఐసీసీసీ నిర్మాణానికి 14.500 క్యూబిక్ మీటర్‌ల ఇసుక, 'సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆడిటోరియం' నిర్మాణానికి 3 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమ్మా ఆర్ అండ్ బీ ఈఈ ఎస్.అశోక్ (ప్రస్తుతం పదవీ విరమణ చేశారు) రాత పూర్వకంగా టీఎస్‌ఎండీసీని కోరారు. దీంతో ఆ మొత్తం ఇసుకను సబ్సిడీ కింద టీఎస్‌ఎండీసీ కేటాయించింది. అయితే ఈఈ అశోక్ ఇసుక సప్లయర్ రాహుల్‌తో కలిసి భారీ మోసానికి పాల్పడ్డారు. ఈ రెండింటికి రావాల్సిన దాదాపు 17.500 క్యూబిక్ మీటర్ల ఇసుకలో నుంచి 10.636 క్యూబిక్ మీటర్లు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకున్నారు. ఈ వ్యవహారం ప్రాజెక్ట్ మేనేజర్ దృష్టికి వెళ్లడంతో అతనికి కూడా కొంత డబ్బును ఇచ్చి నోరు మూయించినట్లు సీఐడీ విచారణలో బయటపడింది. సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ డీసీపీ మధుమోహన్‌రెడ్డి దర్యాప్తును వేగవంతం చేశారు.

క్లుప్తంగా...

11,116 వడలతో ఆంజనేయస్వామికి అలంకారం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో కొలువుదీరిన శ్రీ ఆంజనేయస్వామికి శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా 11 వేల నూటపదహారు వడలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. స్వామివారి దివ్య అలంకారాన్ని దర్శించి విశేష పూజలు నిర్వహించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం మన్యుసూక్త పారాయణాలు విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి శేష శేలాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు, విక్రమ ఆచార్య వేడుకలను వైభవంగా నిర్వహించారు.

నల్లపోచమ్మ ఆలయంలో మండల పూజలు

రహమత్‌నగర్: కేసీఆర్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ మూర్తులను ప్రతిష్ఠించి నలభై రోజులు అయిన నేపథ్యంలో మండల పూజలు నిర్వహించారు. తిరుపతి నుంచి ప్రత్యేకంగా రప్పించిన సాధువులచే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, శాంతి హోమం నిర్వహించారు. గణపతి పూజలు చేపట్టారు. అన్నదానం కార్యక్రమం చేపట్టారు. బస్తీ నేతలు వల్లపు మాధవ్, మేఘన పద్మ, టైలర్ రాజు, దుర్గయ్య, రాము, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మహిళలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఘనంగా ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బంజారాహిల్స్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గుంజి మాధవి, ఉపాధ్యక్షురాలు టి. అనురాధ, ప్రధాన కార్యదర్శి సరిత, కార్యదర్శి భార్గవి, సోషల్ మీడియా ప్రతినిధి దివ్య, అంకిత, సాత్వికతో పాటు 200 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌జెండా ఎగురవేస్తామన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ నుంచి మరిన్ని చేరికలు ఉంటాయన్నారు.


చంద్రయాన్-3పై విద్యార్థులకు అవగాహన

రహమత్‌నగర్: జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో బోరబండ బాలికల కళాశాల, పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం చంద్రయాన్-3 ప్రయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సి.హెచ్. వెంకటసాయి మాట్లాడుతూ... విద్యార్థులకు ఉపగ్రహాల ప్రయోగాలపై అవగాహన ఉండాలన్నారు. జనవిజ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, నాయకులు సూర్యప్రకాష్, రవీంద్రబాబు, ప్రజాసంఘాల నాయకుడు శేషగిరిరావు, ప్రిన్సిపాల్ విజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు నిరసన

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీలో ఎన్నో ఏళ్ళుగా పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు తమ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామని జీహెచ్ఎంసీ సర్కిల్-18 పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. మంగళవారం నిరసన కార్యక్రమాల్లో భాగంగా విధులు ముగిసిన అనంతరం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. గతంలో సీఎం కేసీఆర్ తమను రెగ్యులరైజ్ చేస్తామని హామీ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో స్వీపర్లతో పాటు ఎస్ఎఫ్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు టికెట్ కేటాయించడంతో జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5లోని దుర్గాభవానీనగర్ బస్తీవాసులు సంబరాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఖైరతాబాద్ ఓటర్లు @ 2,82,080

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులను తొలగించి ముసాయిదా జాబితాను ప్రచురించారు. కొద్ది రోజులుగా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా నవీకరణపై కసరత్తు చేశారు. ఓటరు జాబితాలోని తప్పులు, ఇతర ప్రాంతాలకు బదిలీ, కొత్తగా ఓటు హక్కు నమోదు, రెండేసి చోట్ల ఓటు హక్కు, మృతుల ఓటర్లను తొలగిస్తూ జాబితాను కొలిక్కి తీసుకురావడమే కాకుండా సోమవారం పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఈ జాబితా ప్రచురించారు.



ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు (ఫైల్)

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,82,080 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,47,009, మహిళలు 1,35,046, ఇతరులు 25 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరి 5వ తేదీన ప్రచురించిన జాబితా కంటే స్వల్పంగా ఓటర్లు పెరిగారు. జనవరి 5న ప్రచురించిన జాబితాలో ఓటర్లు 2,79,497 ఉండగా అందులో పురుషులు 1,45,951, మహిళలు 1,33,523, ఇతరులు 23 మంది ఉన్నారు.

- నూతన ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి అక్టోబర్‌లో తుది జాబితా ప్రచురించనున్నారు. మరోవైపు ప్రతీసారి ఓటరు జాబితాలో తప్పులు చోటుచేసుకుంటుండటంతో పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు సర్వసాధారణం అయ్యాయి.
- ఓటర్లు సంబంధిత అధికారులను నిలదీస్తుండటంతో పోలింగ్ రోజున న్యూసెన్స్ క్రియేట్ అవుతున్నది. అధికారుల తప్పిదాలతో కూడా చాలా మంది ఓట్లు గల్లంతు అవుతున్నాయి. బోగస్ ఓట్లకు క్లైం వేసేందుకు ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించారు.
- ఆధార్ అనుసంధానంతో పాటు రెండేసి చోట్ల ఓట్లు, మృతులు, స్థానికేతరుల ఓటర్ల ఫొటోల ఆధారంగా జాబితా నుంచి వారిని తొలగించారు. గతంతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య పెరిగినట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన ఓటర్లు 2583

- ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు
- పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలు

అర్హులందరూ ఓటర్లు కావాలి



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఉన్న 245 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహిస్తాము. మరోవైపు ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం ప్రచురించాము. అభ్యంతరాలను సెప్టెంబర్ 19 వరకు స్వీకరించనున్నాము. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 28లోగా పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇంకా ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని కూడా పరిశీలించి తుది జాబితా రూపొందించేందుకు అక్టోబర్ 1 వరకు అవకాశం ఇచ్చారు. అనంతరం సవరించిన ఓటర్ల తుది జాబితాను అక్టోబర్ 4న ప్రచురిస్తాం. ఇప్పటికే ఓటరు జాబితా సవరణకు బీఎల్‌వోలు ఇంటింటి ప్రచారంలో ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. – ప్రశాంతి, ఎన్నికల అధికారి, ఖైరతాబాద్ నియోజకవర్గం

మరో నాలుగు రోజుల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు

కొత్త ఓటు హక్కు నమోదు కోసం ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పోలింగ్ కేంద్రాల్లో ముమ్మరంగా అవగాహన కలిగించనున్నారు. నూతన ఓటు జాబితాపై సెప్టెంబర్ 19 వరకు సవరణల కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు. తప్పొప్పులను సరిదిద్ది తుది జాబితా రూపొందించనున్నారు.





సీఎంకు అభ్యర్థుల కృతజ్ఞతలు

త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రగతి భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్‌లు కలిసి తమ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ఎస్ఐల కేటాయింపు

బంజారాహిల్స్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో ఎస్ఐల కొరత వేధిస్తుండటంతో కొంత ఊరట కలిగించేలా వెస్ట్‌జోన్ పరిధిలోని ట్రాఫిక్ ఠాణాలకు ఒకరిద్దరు చొప్పున ఎస్ఐలను కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బోయ ఆంజనేయులు, ఎల్.శ్రీనివాసరావు, బంజారాహిల్స్‌కు సయ్యద్ హుస్సేన్ బాషా, ఎస్ఎస్‌జీ. అవినాష్‌బాబు, జూబ్లీహిల్స్‌కు ఎస్. శ్రీధర్‌లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇప్పుడున్న ఎస్ఐల సంఖ్య అరకొరగా ఉండటంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో సమస్య తీవ్రంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఎస్ఐలతోనే నడిపించుకొస్తున్నారు. వచ్చేది ఎన్నికల మాసం కావడంతో వీవీఐపీల రాకపోకలు, కార్యక్రమాలు, పార్టీ కార్యాలయాలు, ప్రముఖుల నివాసాలు ఇవన్నీ రద్దీతో కూడుకొని ఉంటాయి. తెలంగాణ భవన్‌కు సీఎం రాకపోకలు కూడా విరివిగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మూడు పోలీస్ స్టేషన్లకు మరో ఇద్దరు చొప్పున ఎస్ఐలను కేటాయిస్తే సమస్య కొంత వరకు మాత్రమే పరిష్కారం అవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పుడున్న ఎస్ఐలతో ట్రాఫిక్‌ను నియంత్రించడం కత్తి మీద సాములా మారుతున్నది. నిత్యం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు వీవీఐపీల బందోబస్తుతోనే సరిపోతున్నది.

ప్రతి బస్తీకి అండగా ఉంటా

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

పంజగుట్ట: నన్ను మీరు కాపాడుకుంటే నేను ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీకి అండగా ఉంటానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమని అందుకే ఎంతో ఖరీదైన డబుల్ బెడ్ రూం ఇండ్లు, గృహలక్ష్మి పథకం తీసుకువచ్చారన్నారు. తెలంగాణలో అమలవుతున్న దళిత, బీసీ, మైనార్టీబంధు, షాదీముబారక్, గృహలక్ష్మి లాంటి పథకాల్లో ఏ ఒక్కటైనా కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుతున్నాయా అని ప్రశ్నించారు. మంగళవారం ఎర్రమంజిల్ కాలనీ గ్రౌండ్‌లో గృహలక్ష్మి, దళితబంధు పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానం నాగేందర్‌కు మరోమారు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించినందుకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... నియోజకవర్గంలో 17 వేల ఫించన్‌లు ఇస్తున్నామని మరో మూడు వేల వరకు మంజూరయ్యాయన్నారు. రామకృష్ణానగర్ తీసేస్తారని జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. తాను ఉన్నంతవరకు ఆర్‌కే నగర్‌ను ఎవరూ ముట్టుకోరని, ఆర్‌కేనగర్‌లోని ప్రతి కుటుంబానికి గృహలక్ష్మి పథకంలో లబ్ధి చేకేరేలా చూస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ఖైరతాబాద్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో తబేళాబస్తీకి చెందిన యువకులు, మహిళలు దానం సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. డిప్యూటీ తహసీల్దార్ నవీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేందర్ బాబు, నగేష్, మెట్టు రాజు, ప్రసన్నరామ్మూర్తి, మధుకర్ యాదవ్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోటీ

హిమాయత్‌నగర్: సమాజ్‌వాది పార్టీ జాతీయ స్థాయిలో 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో' విలీనం చేస్తున్నట్లు సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు మురళీదేశ్ పాండే వెల్లడించారు. ఈ మేరకు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి నేతృత్వంలో ఈ విలీనం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా దేశవ్యాప్తంగా పలు ఉద్యమాలు చేసి, ప్రజల పక్షాన నిలబడిన సమాజ్‌వాదీ పార్టీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో విలీనం కావడం ఆనందంగా ఉందన్నారు. ఇరువరం కలసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు శివశంకర్, వీరన్న, కోమటిరెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



పంజగుట్ట: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శాశ్వత ఆహ్వానితుడిగా నియమితులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు బొల్లబోయిన రాజు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

క్రైం కార్నర్..

న్యూసెన్స్ కేసులో నిందితుడికి రెండు రోజుల జైలు

బంజారాహిల్స్: ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ బస్తీల్లో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 50 జరిమానా విధిస్తూ 12వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డి. రాజేంద్రకుమార్ తీర్పునిచ్చారు. మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాసబ్‌ట్యాంక్ ఏసీ గార్డ్స్‌కు చెందిన జేబీ అశోక్‌సింగ్(19) విద్యార్థి కాగా స్థానికంగా న్యూసెన్స్‌కు పాల్పడుతుండటంతో పోలీసులకు సమాచారం అందింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా స్టేషన్‌లో క్రమశిక్షణారాహిత్యంగా ప్రవర్తించాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు మాసబ్ ట్యాంక్ ఎస్ఐ జి.శేఖర్ తెలిపారు.

నిబంధనలు పాటించని మసాజ్ సెంటర్ మేనేజర్ల అరెస్టు



నిందితులు మహ్మద్ క్రమాన్‌ఖాన్, అబ్దుల్ అమీర్

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు చేసి ఇద్దరు మేనేజర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 36లోని పెద్దమ్మగుడి ఆర్చీని ఆనుకొని జోనాహ్ నెప్ట్యూన్ భవనంలో కొంత కాలంగా సాల్ స్కేప్ స్పా అండ్ లాంజ్ పేరుతో ఓ స్పాను అమిత్ ఆనంద్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్పా మేనేజర్ మహ్మద్ అబ్దుల్ అమీర్(32), మహ్మద్ కమ్రాన్ ఖాన్(30)లను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భర్తను ఫంక్షన్‌ను పంపి భార్య అదృశ్యం

- స్నేహితుడిపై అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: భర్తను ఫంక్షన్‌ను పంపిన భార్య అతను తిరిగి వచ్చేలోపు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఐ ఉదయ్ సమాచారం మేరకు... జి.ప్రశాంత్, తేజస్వినీలకు 2020 నవంబర్‌లో వివాహం అయింది. వారు రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రశాంత్ కొరియర్ బాయ్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి కిరణ్ తదితర యువకులు పరిచయం అయ్యారు. తరచూ ఆ యువకులు ప్రశాంత్ ఇంటికి వచ్చి మాట్లాడుతూ ఉండేవారు. కిరణ్ కూడా తేజస్వినీని అమ్మా అని, అక్కా అని వివిధ రకాలుగా సంబోధిస్తూ తనవారుగానే ఇతరులకు పరిచయం చేసుకున్నాడు. కాగా ఈ నెల 20వ తేదీ ప్రశాంత్ తమకు తెలిసిన వారి ఫంక్షన్‌కు వెళదామని భార్యను అడగ్గా నీవు ఒక్కడివే వెళ్లు నేను రానని చెప్పింది. అంతేగాకుండా భర్తను అందంగా ముస్తాబు చేసి, త్వరగా ఇంటికి రమ్మని చెప్పి ఫంక్షన్‌కు పంపింది. అతను ఫంక్షన్‌కు వెళ్ల తిరిగి ఇంటికి వచ్చే సరికి భార్య కనిపించలేదు. అంతేగాకుండా ఆమెకు సంబంధించిన దుస్తులు, నగదు, ఇతర వస్తువులు కనబడలేదు. చుట్టుపక్కల విచారించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కిరణ్ అనే వ్యక్తి మినహా అందరూ వచ్చి ఆమె కోసం గాలించారు. అయినా కనిపించకపోవతంతో ప్రశాంత్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్యకు పిల్లలు లేరని, కిరణ్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉండవచ్చని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం కేసులో యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్: బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన సంఘటనలో యువకుడిపై మధురానగర్ పోలీసులు పోక్సో కేసును పెట్టారు. ఎస్ఐ ఉదయ్ సమాచారం మేరకు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగుండ మండలానికి చెందిన దంపతులు ఐదేళ్లి కిందట నుంచి మధురానగర్‌కాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. భర్త వాచ్‌మెన్‌గా, భార్య సర్వెంట్‌గా పనులు చేస్తుండగా, వారి మైనర్ కుమార్తె సేల్స్‌గర్ల్‌గా ఉద్యోగం చేస్తుంది. ఈ నెల 16న యధావిధిగా వాచ్‌మెన్ అతని భార్య అపార్టుమెంట్ బాల్కనీలో నిద్రపోయారు. బాలిక గదిలో పడుకుంది. 17వ తేదీ ఉదయం 5 గంటలకు వాచ్‌మెన్ భార్య నిద్రలేచి తమ గది వద్దకు వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. ఈ క్రమంలో మంగళవారం ఆర్.కె.లక్ష్మణ్ అనే యువకుడు బాలికతో కలిపి రహమత్‌నగర్ చౌరస్తాలో కన్పించాడు. మధురానగర్ పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించి యువకుడిపై పోక్సో చట్టం కింద కేసును పెట్టారు. 17వ తేదీ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. దాంతో అతనిని పట్టుకుని మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చారు.

కేన్సర్ ఆస్పత్రికి రోటరీ క్లబ్ వితరణ



కేన్సర్ బాధిత చిన్నారులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: కేన్సర్ బాధిత చిన్నారులకు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్ చేయూతనందించింది. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో పిల్లల వార్డుకు టీవీతో పాటు 20 బీపీ యంత్రాలు, 20 స్టెతస్కోప్‌లు ఆస్పత్రికి వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నర్గీస్ సకీనా, యార్కాన్, శంకర్‌రెడ్డి, కమల్ కన్నన్, నిఖత్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే జూబ్లీహిల్స్ నుంచి పోటీ

బీజేపీ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్: త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం 66లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2000 సంవత్సరం నుంచి తాను హైదరాబాద్‌లో ఉంటున్నాని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి బస్తీ, కాలనీతో అనుబంధం ఉందన్నారు. 1989లో ఢిల్లీలో అద్వానీ స్ఫూర్తిగా ఆ పార్టీకి పని చేస్తున్నామని, గత రెండున్నర దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలక పాత్రపోషిస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉందని అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేసి గెలిచి తీరుతానన్నారు.

'ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వండి సారూ'

హిమాయత్‌నగర్: ఎస్సీ కేటగిరీలో తనకు నగరంలోని ఏదైనా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు చింతకుంట్ల సంజయ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో ఉంటూ 12 ఏళ్లుగా ఎస్సీ సెల్‌కు ప్రాతినిధ్యం వహించానన్నారు. కార్వాన్, నాంపల్లి లేదా ఏదైనా స్థానంలో పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలంటూ వేడుకున్నారు.


ఉపాధి అంశాల్లో ఉచిత శిక్షణ భేష్



సర్టిఫికెట్స్ అందజేస్తున్న సీఈఓ మీరా షెనాయ్

శ్రీనగర్‌కాలనీ: బధిర విద్యార్థులకు యానిమేషన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయమని యూత్ ఫర్ జాబ్స్ ఫౌండర్ సీఈఓ మీరా షెనాయ్ అన్నారు. మంగళవారం శ్రీనగర్‌కాలనీలోని ఇ-లెర్నింగ్ సెంటర్‌లో మల్టీమీడియా-యానిమేషన్ కోర్సుల్లో శిక్షణ తీసుకున్న బధిర విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్స్‌ను ఓయ్ హ్యాపీ ఫౌండర్ హర్షవర్ధన్ కిమానీ, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ డిజబుల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్‌తో కలిసి అందజేశారు. ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ ద్వారా బధిర చిన్నారులకు ఉచిత పాఠశాల విద్యతో పాటు పెద్దవారికి ఉచిత శిక్షణ అందించి వారికి ఉపాధిని అందిచండంలో ఆశ్రయ్-ఆకృతి డైరెక్టర్ డీపీకే బాబు చేస్తున్న కృషి అద్వితీయమని పేర్కొన్నారు. 8వ తరగతి బధిర విద్యార్థులకు వీడియోల ద్వారా వారికి అర్థమయ్యే రీతిలో సైన్ లాంగ్వేజ్ ద్వారా తెలిపే తరగతులను తిలకించి అభినందించారు. తమ సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలుపుతూ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా 'విల్లామేరీ' వార్షికోత్సవం



కేక్ కట్‌చేస్తున్న డైరెక్టర్ ఫెల్లోమినా

పంజగుట్ట: విల్లామేరీ మహిళా కాలేజీ 32వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సోమాజిగూడలోని కాలేజీలో ఘనంగా నిర్వహించారు. 32వ వార్షికోత్సవం సందర్భంగా 32 బెలూన్‌లు విద్యార్థులు, యాజమాన్యం కలిసి ఎగరవేశారు. 32 గ్లోరియస్ ఇయర్స్ అకడమిక్ ఎక్సలెన్స్‌ని పూర్తి చేసిన సెలబ్రేషన్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. మహిళా సాధికారతను దృష్టిలో ఉంచుకుని 1991లో విల్లామేరీ కాలేజీ ప్రారంభించినట్లు కాలేజీ డైరెక్టర్, కరెస్పాండెంట్ డాక్టర్ ఫెల్లోమినా తెలిపారు. సంస్థ అభ్యున్నతికి నిబద్ధతతో పనిచేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ఎన్‌సీసీతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

'మార్గదర్శి'లో చేరాం.. మోసపోయాం!

▶ మొదటి పేజీ తరువాయి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసులను నమోదు చేసి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. మరోవైపు రాష్ట్రంలో నలుమూలల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద ఎత్తున సీఐడీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఒక్కో చందాదారుడిది ఒక్కో వ్యథ!

మూడు రోజుల్లో 300కిపైగా ఫిర్యాదులు


మోసపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు ఫిర్యాదు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చందాదారులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నంబరు (9493174065) అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మార్గదర్శి చందాదారులు పెద్ద సంఖ్యలో సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వాట్సాప్ నంబర్ అందుబాటులోకి రాక ముందు సీఐడీకి దాదాపు వందకుపైగా ఫిర్యాదులు రాగా ఇప్పుడు మూడు రోజుల్లోనే మూడు వందల మందికి పైగా చందాదారులు ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చందాదారులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల చిట్టా అంతకంతకూ పెరుగుతోంది.

చందాదారుల సొమ్ము సొంతానికి...
మార్గదర్శి దివాళా అంచుకు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రామోజీరావు పాల్పడిన ఆర్థిక అక్రమాలతో చందాదారులు నిండా మోసపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును రామోజీరావు నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్‌లలో పెట్టుబడిగా పెట్టారు. మరికొన్ని నిధులను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా తరలించేశారు. దాదాపు 2 వేలకుపైగా ఉన్న చిట్టీ గ్రూపుల చందాదారులు చెల్లించే చందా మొత్తంలో కొంత మొత్తాన్ని అటూ ఇటూ రొటేషన్ చేస్తూ దశాబ్దాలుగా మోసం చేస్తూ వచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు బయటపడటంతో 2022 నవంబరు నుంచి కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. మరోవైపు భారీగా చందాదారుల సొమ్మును రామోజీ తమ పేరిట స్థిర, చరాస్తులుగా మార్చేశారు. దీంతో ప్రసుత్తం చిట్టీ గ్రూపుల్లో ఉన్న దాదాపు 50 వేల మంది చందాదారులకు ప్రైజ్‌మనీని చెల్లించలేక మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతులెత్తేసింది. రాష్ట్రంలోని 37 బ్రాంచీల పరిధిలో దాదాపు 1,300 మంది చందాదారులకు 9 నెలలుగా ప్రైజ్ మనీ చెల్లించడం లేదని సమాచారం. గత 9 నెలల్లో రూ.1,620 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరోవైపు రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల మొత్తాన్ని కూడా కాల పరిమితి ముగిసినా చెల్లించడం లేదు. వెరసి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బకాయి పడిందని సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైనట్లు సమాచారం.

సీఐడీ సత్వర స్పందన

చందాదారుల ఫిర్యాదుపై సీఐడీ విభాగం సత్వరం స్పందిస్తోంది. ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయని నిర్ధారణ కాగానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతోంది. ఇప్పటికే మూడు కేసుల్లో మార్గదర్శి బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసింది. 'ఘోస్ట్' చందాదారుడి పేరిట భారీ అక్రమ దందాకు పాల్పడిన కేసులో చీరాల మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది.



సీఐడీకి మార్గదర్శి చందాదారుల ఫిర్యాదుల్లో కొన్ని

- విజయనగరంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుడు ఒకరు మొత్తం రూ.6 లక్షలు విలువైన నాలుగు చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చిట్టీ పాట పాడి రెండు ఎల్ఐసీ బాండ్లను ష్యూరిటీగా సమర్పించారు. రూ.5 లక్షలు, రూ.2 లక్షలు విలువైన రెండు బాండ్లను ష్యూరిటీగా ఇచ్చారు. ఆ చిట్టీ గ్రూపుల కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా ఆయనకు ఎల్ఐసీ బాండ్లను తిరిగి ఇవ్వడంలేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ఎన్నిసార్లు కలిసినా అరణ్య రోదనగానే మారింది.
- విశాఖపట్నంలో ఒక చందాదారుడు రూ.40 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడిగా చేరారు. 20 నెలలు వాయిదాలు చెల్లించిన తరువాత రూ.8 లక్షల నష్టానికి అంటే రూ.32 లక్షలకు చిట్టీ పాడారు. కానీ ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఆయనకు చిట్టీపాట మొత్తం చెల్లించడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్ సరైన సమాధానం చెప్పడం లేదు. ఎందుకంటే ఆ చిట్టీగ్రూపులో పెద్ద సంఖ్యలో నకిలీ చందాదారులు ఉన్నట్టు తెలిసింది. ఆ వాయిదాల ను మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చెల్లించడం లేదని చందాదారుడికి తెలిసింది. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా.. నీకు దిక్కున్న చోట చెప్పుకో, చిట్టీ మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయాడు.
- బాపట్లలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో ఒకరు సభ్యుడిగా చేరారు. కొన్నినెలలు పాటు రూ.40 వేలు వాయిదాలు చెల్లించిన తరువాత ఆయన గ్రూప్ నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో మరొకరిని చందాదారుడిగా చేర్చారు. ప్రత్యామ్నాయ చందాదారుడిని చేర్చుకున్న తరువాత వైదొలగిన చందాదారునికి అప్పటికే చెల్లించిన వాయిదాల మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. కానీ ఆ మొత్తం వెనక్కి ఇవ్వడం లేదు. దీనిపై బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా చందాదారుడే తిరిగి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు రూ.25 వేలు చెల్లించాలని దబాయిస్తున్నారు.
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు నాలుగు చిట్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన చందా వాయిదా చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా రోజుకు రూ.500 చొప్పున జరిమానా వసూలు చేశారు. ఆ చందాదారుడు ఓ చిట్టీ గ్రూపులో పాట పాడి మూడు నెలలు దాటినా ప్రైజ్‌మనీ ఇవ్వడం లేదు. నిబంధనల మేరకు ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదు. దీనిపై సంబంధిత బ్రాంచి మేనేజర్‌ను ప్రశ్నించగా కంపెనీలో ప్రస్తుతం డబ్బులు లేవని అనధికారికంగా చెప్పడంతో చందాదారుడు నిర్ఘాంతపోయారు.
- విశాఖలో మరో చందాదారుడు రూ.5 లక్షలు చిట్ గ్రూపులో చేరి 38 నెలలు సక్రమంగా వాయిదాలు చెల్లించారు. తన కుమారుడి చదువు కోసం చిట్టీ పాడేందుకు వెళ్లగా ఆయన పాడేసి డబ్బులు తీసేసుకున్నట్టు రికార్డుల్లో కనిపించింది. ఆయన పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యమే పాట పాడేసి డబ్బులు తీసేసుకున్నట్లు తెలిసింది.

అదో విష వలయం.!

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులను పక్కా పన్నాగంతో అష్టదిగ్బంధనం చేస్తోంది. వారిని శాశ్వత రుణగ్రహీతలుగా మార్చేస్తూ వారి సంపాదననే కాకుండా ఆస్తులను కూడా కాజేస్తోంది. కొందరు చందాదారులను అనధికారికంగా పలు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరుస్తోంది. ఆ విషవలయం నుంచి తప్పించుకోవడం చందాదారుల తరం కావడం లేదు. ఓ బాధితుడు సీఐడీకి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శి అక్రమాల బాగోతం బయటపడింది.
- ఓ చందాదారుడు మొత్తం రూ.4.72 కోట్ల విలువైన చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన రూ.3.33 కోట్ల విలువకు చిట్టీ పాటలు పాడారు. అంటే ఆయనకు రూ.3.33 కోట్లు చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ)గా రావాలి. కానీ ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతిలో పెట్టింది ఎంతో తెలుసా?
- కేవలం రూ.23లక్షలు. నివ్వెరపోయినచ ఆయన ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఆ చందాదారుడికి తెలియకుండా ఆయన్ను ఎందరో చందాదారులకు ష్యూరిటీదారుడిగా నమోదు చేసేశారు. గతంలో ఆయనతో ఖాళీ కాగితాలపై తీసుకున్న సంతకాలతోపాటు మరికొన్ని సంతకాలను ఫోర్జరీ చేసి ఇరికించారు.
- ఆయన 65 చిట్టీ గ్రూపుల్లో సభ్యుడిగా చేరితే మార్గదర్శి రికార్డుల్లో మాత్రం 90 గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు నమోదు చేశారు. అంటే ఆయన సభ్యుడిగా చేరని 25 చిట్టీ గ్రూపులకు కూడా బకాయి ఉన్నట్టుగా చూపిస్తూ ప్రైజ్‌మనీలో కోత విధించారు. దీనిపై ఆ చందాదారుడు సీఐడీకి ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే నమోదైన 3 కేసులివీ...

- సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారుడిగా చేర్చారు. బుక్ అడ్జస్ట్‌మెంట్ల ద్వారా ఆయన చందా చెల్లించినట్టు కనికట్టు చేశారు. ఆయన పేరిట ప్రతి నెల డివిడెండ్‌తోపాటు ఒక నెల ప్రైజ్‌మనీ మొత్తాన్ని కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఖాతాలో వేసుకుంది. అంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే డివిడెండ్లు, ప్రైజ్‌మనీ కొల్లగొట్టి ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించింది. తమ ఆధార్ కార్డును దుర్వినియోగంచేయడంతోపాటు తమకు తెలియకుండా చందాదారుడిగా చేర్చడంపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు చీరాల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మార్గదర్శి చీరాల శాఖ మేనేజర్ సురేంద్రను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.
- అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తరువాత రూ.4,61,989కు చిట్టీ పాట పాడారు. ఆయన ఎన్నిసార్లు చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఆయన ష్యూరిటీ ఇచ్చిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని ఆయన మొత్తుకున్నా బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలను చూపించి బెదిరించారు. ఆ కాపీలు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.
- కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కా నీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్ నిరాకరించారు. విజయ్‌కుమార్ తన స్నేహితుడు మల్లికార్జునరావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ప్రైజ్‌మనీ ఇవ్వలేమని చెప్పారు. నిజానికి మల్లికార్జునరావు చిట్టీ గడువు అప్పటికే తీరిపోయింది. తనను మార్గదర్శి యాజమాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లోకేశ్‌తో నాకు ప్రాణహాని

సాక్షి, అమరావతి : టీడీపీ నేత నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తీవ్ర ఆరోపణ చేశారు. అందుకోసమే తనపై పురునష్టం దావా వేశారని.. ఈ కేసులో మంగళగిరి కోర్టుకు వెళ్లివచ్చే సమయంలో తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోతే దానికి లోకేశే కారణమని ఇదే తన మరణ వాంగ్మూలంగా భావించాలన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. పోసాని ఇంకా ఏమన్నారంటే..

గతంలో లోకేశ్ నన్ను పార్టీలోకి రావాలని కోరారు. నేను నిబద్ధత కలిగిన నాయకుల వెంటే ఉంటానంటూ తిరస్కరించా. పైగా వారి అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నాను. అందుకే వాళ్లు నాపై కక్షగట్టారు. నేను ఎప్పుడో కంతేరులో లోకేశ్ భూములు కొన్నారని చెప్పానట. దానిని పట్టుకుని నాపై రూ.4 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. అంతేకాదు.. రెండేళ్ల జైలుశిక్ష కూడా వేయిస్తారట. కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా? లోకేశ్ భూములు దోచేశారు.. కబ్జా చేశారనలేదే నేను. కొన్నారనే చెప్పాను. మీ కుటుంబ సభ్యులు కొంటే నీకు సంబంధం లేదా? మీ తల్లి, భార్య పేరు మీద ఉన్న ఆస్తులు ఎవరికి లోకేశ్?

పవన్ వ్యాఖ్యలు మర్చిపోయారా?

అల్‌ఖైదా అంటే లాడెన్ గుర్తొచ్చినట్లు.. హెరిటేజ్ అంటేనే చంద్రబాబు గుర్తొస్తారు. నిత్యం బూతులతో జపంచేసే లోకేశ్‌పై తాను పురువు నష్టం కేసువేస్తే 20 ఏళ్ల జైలులో ఉండాల్సి ఉంటుంది. గతంలో దళితులు, ముఖ్యమంత్రి జగన్‌ను, పోలీసు అధికారులను దుర్భాషలాడిన లోకేశ్ వీడియోలను, విదేశీ మహిళలతో అర్ధనగ్నంగా దిగిన ఫొటోలను మీడియా ఎదుట పోసాని ప్రదర్శించారు. గతంలోనే లోకేశ్ బతుకును పవన్ రోడ్డున పడేశారు. ప్రతి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణం చేశారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా? సమాజంలో బూతులు మాట్లాడేవాళ్ల కంటే బూతుపనులు చేసే లోకేశ్ లాంటి వ్యక్తులతోనే ఎక్కువ ప్రమాదం.

ఏపీలోని నా ఆస్తి మొత్తం ఇచ్చేస్తా..

చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే సత్తా ఉంది. అందుకే 16 కేసుల్లో స్టేలు తెచ్చుకున్నాడు. పుంగనూరులో పోలీసులపైనే దాడులు చేయించారు. నేనెంత బక్కవాడిని. నాలుగు పోట్లు వేస్తే నేను అవుట్. లోకేశ్ ఏంచేసినా కాపాడటానికి చంద్రబాబు ఉన్నారు. లోకేశ్ కంటే నాకు విశ్వసనీయత ఎక్కువ ఉంది.. అంతేగాని, అమ్ముడుపోయే వాడిని కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా గెలవొచ్చు.. కమ్మ కులమే గెలవాలనుకోవడం దుర్మార్గం. ఎవరు గెలిచినా ప్రజలకు ఎంత మంచి చేస్తున్నారో చూడాలే తప్ప కులం దురాభిమానంలో పడకూడదు. రాజధానిలో ఐదు శాతం భూములు పేదలకు ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని తుంగలో తొక్కారు. కొంతమందికి కులం పిచ్చి ఎక్కించి నన్ను తిట్టిస్తున్నారు. రాజధానిలో పేదలకు సెంటు భూమి ఇవ్వడంలో తప్పేంటని నేను ప్రశ్నిస్తే.. ఓ కమ్మ రైతు పెదకాకాణిలో నాకున్న 16 ఎకరాలు ఇవ్వమంటూ బూతులు తిట్టాడు. అసలు నాకు అక్కడ భూమేలేదు. ఐదారు ఇళ్ల స్థలాలు, రెండు పెంకుటిళ్లు ఉన్నాయి. జగ్గయ్యపేట దగ్గర 30 ఏళ్ల కింద కొన్న కొంత భూమి ఉంది. మా నాన్న డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నారు. నేను సినిమాల్లోకి వెళ్లిన తర్వాతే సంపాదించుకున్నా. అయినా, ఏపీలోని నా ఆస్తి మొత్తం పేద ప్రజలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులకు మానవత్వం ఉంటే పేదలకు సెంటు భూమి ఇవ్వండి. కోర్టు కేసులను వెనక్కితీసుకోండి.

రాజధాని భూముల్లో త్యాగాల్లేవు..

రాజధాని భూముల్లో వ్యాపారం తప్ప త్యాగాల్లేవు. రాజధాని ప్రకటన కంటే ఆరు నెలల ముందే రామోజీరావు, చంద్రబాబు ఫిల్మ్‌సిటీలో కూర్చుని భూముల కొనుగోలుపై చర్చించుకున్నారు. వైఎస్సార్ రూ.11వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే అందులో తమ కులం వాళ్లు కూడా హాయిగా లబ్ధిపొందారు.. ఇప్పుడు పేదలకు తమ భూములు ఇవ్వొద్దని వారు చెప్పడం సిగ్గుచేటు.

ఇదే నా మరణ వాంగ్మూలం

- నాపై పరువు నష్టం దావా అందుకే వేశారు
- మంగళగిరి కోర్టుకు వెళ్లి వచ్చే సమయంలో హతమార్చాలని కుట్ర పన్నారు
- నేను చనిపోతే దానికి కారణం లోకేశే
- కంతేరులో హెరిటేజ్ పేరిట భూములు కొన్నది వాస్తవం కాదా?
- లోకేశ్‌కు తెలీకుండానే ఆయన తల్లి, భార్య భూములు కొన్నారా?
- వాళ్ల కుటుంబ సభ్యుల ఆస్తులతో లోకేశ్‌కు సంబంధం లేదా?
- నిత్యం బూతులు మాట్లాడే లోకేశ్‌పై నేను పరువునష్టం దావా వేస్తే 20 ఏళ్లు జైల్లో ఉండాలి
- ఏపీలోని నా ఆస్తి మొత్తం పేదలకు ఇచ్చేస్తా.. రాజధాని రైతులు స్టే వెనక్కి తీసుకోవాలి
- మీడియాతో పోసాని కృష్ణమురళి



నగర వార్తలు

సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

కల్వకుంట్ల కవిత



కవితకు వినతిపత్రం ఇస్తున్న మత్స్యశాఖ ఉద్యోగులు

ముషీరాబాద్: మత్స్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. మత్స్యశాఖలో గత ఏడు సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు చేస్తున్న 193 మందిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాముల రమేష్ నేతృత్వంలో మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఇందిరాపార్కు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ఏడు సంవత్సరాలుగా మత్స్యశాఖలో వివిధ రకాల సంక్షేమ పథకాలైన చేప పిల్లలు, రొయ్యపిల్లల పంపిణీ, సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కిరణ్, ప్రధాన కార్యదర్శి ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఛాయా చిత్ర ప్రదర్శన

- అబ్బురపరుస్తున్న కాశీ విశ్వనాథ్ చిత్రాలు
- జేఎన్ఏఎఫ్ఏయూలో నేటితో ఎగ్జిబిషన్ ఆఖరు

నాంపల్లి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ నెహ్రూ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనలో ఫైనల్ ఇయర్ విద్యార్థి కాశీ విశ్వనాథ్ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 19న ప్రారంభమైన చిత్ర ప్రదర్శన 23న ముగియనుంది. ఇందులో సుమారు 40 మంది విద్యార్థులు తమ చిత్రాలను ప్రదర్శించారు. కాగా విశాఖపట్నం ప్రాంతానికి చెందిన కాశీ విశ్వనాథ్ పల్లి సముద్ర అంతర్భాగంలోని దృశ్యాలను తన కెమెరాలో బంధించాడు. స్కూబా డైవింగ్‌లో సర్టిఫికెట్ పొందిన కాశీ విశ్వనాథ్ హిందూ మహా సముద్రంలో తీసిన జీవరాశుల చిత్రాలు సందర్శకులను ఆకర్షింపజేస్తున్నాయి. సుమారు 50 నిమిషాల నిడివితో సముద్రంలో ఫొటోలు తీయడం జరిగిందని విశ్వనాథ్ తెలిపారు. చిన్నప్పటి నుంచి తనకు ఫొటోగ్రఫీ మీద అమితమైన ఆసక్తి ఉందని, ఆ ఇష్టంతోనే జేఎన్ఏఎఫ్ఏయూలో ఫొటోగ్రఫీ కోర్సులో చేరడం జరిగిందన్నారు. బీబీసీ ఛానల్లో పనిచేయడమే తన ముందున్న లక్ష్యమని తెలిపారు.



కాశీ విశ్వనాథ్ చిత్రాలను వీక్షిస్తున్న సందర్శకులు



సముద్రం అంతర్భాగంలో తీసిన ఫొటో

25న యాదవ మహాసభ

పంజగుట్ట: ఈ నెల 25న నాగోల్ శుభం కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న యాదవ యుద్ధభేరి సభకు ఇంటికో మనిషి, ఊరికో వాహనంతో రావాలని యాదవ విద్యావంతుల వేదిక కన్వీనర్ చెలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలభారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, చింతల రవీంద్రనాథ్, సినీ నటి కరాటే కళ్యాణి యాదవ్‌లతో కలిసి మాట్లాడారు. ఆగస్టు 25న బీపీ మండల్ జయంతి పురస్కరించుకుని యాదవ యుద్ధభేరి నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీపీ మండల్ మనవడు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ హాజరౌతున్నారని తెలిపారు. యాదవుల ఐక్యత, చైతన్యం చేసేందుకే ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ టిక్కెట్ల కేటాయింపులో కేవలం 5 సీట్లు మాత్రమే ఇచ్చిందని, 18 శాతం జనాభా ఉన్న యాదవులకు జనాభా దామాషా ప్రకారం టిక్కెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జవహర్‌నగర్ కార్పొరేటర్ మేకల లలిత, ఓరుగంటి వెంకటేష్, రాంచందర్ యాదవ్, సమత, గౌతం, రేణుక, మంజుల, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న యాదవ సంఘాల ప్రతినిధులు

ప్రపంచస్థాయి సినిమాలను నిర్మించాలి

- జీ-20 దేశాల మధ్య మరింత సహకారం పెరగాలి
- ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ హెడ్ విక్రమ్‌జిత్ రాయ్

రాయదుర్గం: ప్రపంచస్థాయిలో ప్రతిధ్వనించే సినిమాలు రూపొందించాల్సిన అవసరం ఉందని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ హెడ్ విక్రమ్‌జిత్‌రాయ్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో 5వ 'మనూ' నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్ కార్యక్రమాన్ని ఐఎంసీ ప్రాంగణంలో 'జీ-20 దేశాల మధ్య చలనచిత్ర సహ నిర్మాణ అవకాశాలు' అనే అంశంపై మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ ల్యాండ్‌స్కేప్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ నేపథ్యంలో జీ-20 దేశాల మధ్య మరింత సహకారం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. భౌగోళిక సరిహద్దులను అధిగమించే కథలకు జీవం పోయగలవన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ చలనచిత్రాల నిర్మాణాలు, దాని సాంస్కృతిక మూలాలకు సంబంధించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, పరిశోధనాధికారి డాక్టర్ ఎండీ ఇంతియాజ్ ఆలమ్, నిర్మాత ఎండీ అమీర్‌బదర్ ప్రసంగించారు. అనంతరం విక్రమ్‌జిత్‌రాయ్‌ను వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు.



విక్రమ్‌జిత్ రాయ్‌ను సత్కరిస్తున్న వీసీ ఐనుల్‌హసన్ తదితరులు

ప్రజల హృదయాల్లో నిలిచిన గద్దర్

ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చేన్లలో పని చేసుకునే వారు కూడా గద్దర్ పాట పాడుతున్నారంటే ఆయన ప్రజల హృదయాల్లో ఏవిధంగా నాటుకుపోయారో అర్థం అవుతుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్వీకే, ఆవాజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు షోయబ్‌ఉల్లాఖాన్ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ప్రజాగాయకుడు గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌లకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ మౌలిక విలువలను విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. పౌర హక్కులు లౌకిక వాదం గురించి పని చేసిన గొప్ప నాయకులు గద్దర్, జహిరుద్దీన్ ఆలీఖాన్‌లు అని అన్నారు. మత సంకుచిత రాజకీయాలకు వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన లౌకిక వాదానికి, పత్రిక స్వేచ్ఛకు ప్రతీక షోయబ్‌ఉల్లాఖాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ఆవాజ్ సంస్థ కార్యదర్శి ఎండి అబ్బాస్, వివిధ సంస్థల ప్రతినిధులు జి.రాములు, సైబాబా తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ ఉల్లాఖాన్ పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

సెప్టెంబరులో రాజకీయ యుద్ధభేరి

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్ గౌడ్
- టికెట్ల కేటాయింపుపై నిరసన




సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యుగంధర్ గౌడ్

నాంపల్లి: సీఎం కేసీఆర్ బీసీలను విస్మరించారని , వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తీరుతామని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ హెచ్చరించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ కేవలం 23 ఎమ్మెల్యే సీట్లను కేటాయించడాన్ని నిరసిస్తూ మంగళవారం హైదరాబాదులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన తెలిపి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీల త్యాగం వెలకట్టలేనిదని, అమరులైన వారిలో 90 శాతం బీసీలేనన్నారు. అర శాతం కూడా లేని వెలమ సామాజిక వర్గానికి 11 టికెట్లు, 5 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి 40 సీట్లను కేటాయించిన కేసీఆర్ 60 శాతం ఉన్న బీసీలను విస్మరించడం అగ్రకుల దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే బీసీలందరం ఏకమై వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొందపెడతామని హెచ్చరించారు. వచ్చే నెలలో హైదరాబాదులో 5 లక్షల మందితో బీసీల రాజకీయ యుద్ధభేరి సభను నిర్వహించి బీసీల సత్తా చాటుతామని అన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నేతలు విజయభాస్కర్, అనుదీప్, అజయ్, చంద్రశేఖర్, గణేష్, కుమార్, గౌతమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో శిలాజాల ఎగ్జిబిషన్

నేటి నుంచి 3 రోజుల పాటు..

సాక్షి, సిటీబ్యూరో: కోట్ల సంవత్సరాల క్రితం జీవించిన డైనోసార్ల వంటి అరుదైన జీవులు తెలంగాణ నేలపై కూడా మనుగడ సాగించాయని పలు పరిశోధనల్లో నిరూపితమైందని, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో లభ్యమైన శిలాజాలే (ఫాసిల్స్) దీనికి నిదర్శనమని ప్రముఖ శిలాజ పరిశోధకులు సునీల్ సముద్రాల తెలిపారు.ఇందులో సుమారుగా 200 మిలియన్ సంవత్సరాలకు చెందిన శిలాజాలను సైతం ప్రదర్శిస్తున్నామని, ఈ ప్రదర్శన పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో తను సేకరించిన విభిన్న జంతు, వృక్ష జాతుల శిలాజాలతో నగరంలోని రవీంద్రభారతి వేదికగా ఫాసిల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి 3 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. అంతర్జాతీయంగా 'ఫాదర్ ఆఫ్ ఫాసిల్స్'గా ప్రఖ్యాతిగాంచిన జార్జెస్ కువియర్ జన్మదినం సందర్భంగా, గతంలోనే శిలాజాలపైన విశేష పరిశోధనలు చేసి ఖ్యాతిగడించిన రాష్ట్రానికి చెందిన ప్రముఖ పరిశోధకులు డా.పొన్నాల యాదగిరి జ్ఞాపకార్థం ఈ శిలాజాల ప్రదర్శన నిర్వహిస్తున్నామని సునీల్ సముద్రాల వివరించారు.



25 నుంచి సీఎన్‌సీ ఎక్స్‌పో- 2023

పంజగుట్ట: కేబుల్ నెట్ కాన్సెప్ట్స్ (సీఎన్‌సీ) ఆధ్వర్యంలో ఈ నెల 25 నుండి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు హైటెక్స్‌లో 11వ సీఎన్‌సీ ఎక్స్‌పో- 2023 నిర్వహిస్తున్నట్లు సీఎన్‌సీ అధిపతి రాము తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు జితేందర్, ప్రభాకర్ రెడ్డి, సురేష్, భాస్కర్, సతీష్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. కేబుల్, బ్రాండ్, ఓటీటీ, డిజిటల్ టీవీ రంగాల కోసం సీఎన్‌సీ కేబుల్ నెట్ తదితర రంగాల వారు సుమారు 30 వేల మంది ఎక్స్‌పోలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ కూడా ఈ ఎక్స్‌పోలో పాల్గొంటుందని, ఈ యేడు 200 పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు అనేక కంపనీలు తమ ఉత్పత్తులు ప్రదర్శించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ కోసం www.cncxpo.comలో సంప్రదించాలన్నారు.



ఎక్స్‌పో కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం ..

నోటరీ భూముల క్రమబద్ధీకరణను ఆపండి

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా పలువురు అక్రమార్కులు చట్టవిరుద్ధంగా ఇలాంటి భూములను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. 125 చదరపు గజాలు అంతకంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఆస్తులకు స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ నుంచి పూర్తి మినహాయింపు ఇస్తే రాష్ట్ర ఖజానా పెద్దఎత్తున ఆదాయం కోల్పోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నోటరీ భూ విక్రయ లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి సంబంధించి జూలై 26న ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 84 కొట్టివేయాలని కోరుతూ ది భాగ్యనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్‌లను చేర్చింది. ఒకట్రెండు రోజుల్లో ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

ఈవోడబ్ల్యూ అదుపులో శరణ్‌కుమార్

మాదాపూర్: హైదరాబాద్ (ఈవోడబ్ల్యూ) ఎకనామిక్ అఫెండర్స్ వింగ్ పోలీసులు బీజేపీ కార్యవర్గ సభ్యుడు శరణ్‌కుమార్ చౌదరిని మాదాపూర్‌లోని ఆయన నివాసం వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిని ఈ విభాగం అదుపులోకి తీసుకుని విచారిస్తుందని పోలీసులు తెలిపారు. చౌదరిపై గతంలో ఆర్థిక నేరాల ఆరోపణలు ఉన్నందునే ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

'ఆర్టీసీ విలీనంలోపే బకాయిలు చెల్లించాలి'



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సహకార పరపతి సంఘానికి (సీసీఎస్) సంస్థ బకాయి ఉన్న మొత్తం రూ.1,073 కోట్లను ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయ్యేలోపే చెల్లించాలని ఆ సంఘం మేనేజింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో భేటీ అయిన సభ్యులు సీసీఎస్ పరిస్థితిని వివరించారు. చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో కలుపుకొని లెక్కించాలని పేర్కొన్నారు. విలీన ప్రక్రియకంటే ముందే ఈ బకాయి మొత్తాన్ని చెల్లించాలన్న అంశాన్ని కూడా విలీన కమిటీ ముందు ఉంచాలన్నారు. అనంతరం వారు రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిని కూడా కలిసి ఇదే అంశాలపై విన్నవించారు. తదుపరి జరిగే ఆర్టీసీ బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి చర్చించనున్నట్టు ఆర్టీసీ చైర్మన్ హామీ ఇచ్చారని సీసీఎస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాదగిరి, లక్ష్మయ్య, ఎల్ఏ రెడ్డి, సంఘం కార్యదర్శి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

యాదగిరిగుట్ట పైకి ఆటోలను అనుమతించాలి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట కొండపైకి ఆటోలను అనుమతించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. యాదగిరిగుట్ట పునర్నిర్మాణం తర్వాత ఆటోలను పైకి అనుమతించడం లేదని, దీంతో ఆటో డ్రైవర్లుగా పొట్ట పోసుకుంటున్న గుట్టలోని 500 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని లేఖలో పేర్కొన్నారు.

బీసీ ఫెడరేషన్లు నిర్వీర్యం

వేముల వెంకటేశ్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ ఫెడరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీసీ ఫెడరేషన్ల ఐక్యవేదిక అధ్యక్షుడు వేముల వెంకటేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఒక్క బీసీ ఫెడరేషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించలేదని, నిత్యం కులవృత్తుల పాట పాడుతూ ప్రజలను మభ్యపెట్టడం తప్ప బీసీలకు ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు. కేవలం గొర్రెలు, బర్రెల పంపిణీతో బీసీలు బాగుపడ్డారనుకోవడం మూర్ఖత్వమని, జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఏమేరకు ప్రాధాన్యం ఇచ్చిందో ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల జాబితా అద్దం పడుతోందని వెంకటేశ్ అసహనం వ్యక్తంచేశారు. బీసీల ఆత్మగౌరవమని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ముందు బీసీ ప్రత్యేక అభివృద్ధి నిధి కేటాయించాలని, బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వాటిని సకాలంలో ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ముందే ఫీ'జులుం'



రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్నా ట్యూషన్ ఫీ కట్టాల్సిందే


అడ్మిషన్ సమయంలోనే వసూళ్లకు తెగబడుతున్న ప్రైవేట్ కాలేజీలు

పాలిసెట్ ద్వారా ధనుంజయ్ రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లోని ఓ కాలేజీలో సీటు సాధించాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హత ఉంది. ట్యూషన్ ఫీ చెల్లించాల్సిన అవసరం లేదని అనుకున్నాడు. సెల్ఫ్‌రిపోర్టింగ్ పూర్తి చేసిన తర్వాత అడ్మిషన్‌కు కాలేజీకి వెళ్లాడు. అయితే పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే అడ్మిషన్ ఇస్తామని కాలేజీ యాజమాన్యం తేల్చిచెప్పింది. దీంతో ఒక్కసారిగా రూ.18వేలు చెల్లించే పరిస్థితి లేక ధనుంజయ్ సతమతమయ్యాడు. సీటు కోల్పోతాననే ఆందోళనతో తండ్రికి అసలు విషయం చెప్పగా, అప్పు చేసి వెంటనే ఫీజు చెల్లించి కాలేజీలో చేరాడు. ఫీజురీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హత ఉన్న ధనుంజయ్ ఒక్కడే కాదు..ఆ కాలేజీలో కన్వీనర్ కోటాలో వివిధ బ్రాంచ్‌ల్లో సీటు దక్కించుకున్న దాదాపు 500 మందికి పైగా విద్యార్థులంతా ఇదే తరహాలో ట్యూషన్ ఫీజు సొంతంగా చెల్లించి అడ్మిషన్లు తీసుకున్నారు. పలు ఇంజనీరింగ్ కాలేజీలు, ఇతర వృత్తి విద్యా కాలేజీలన్నీ ఇదే తరహాల్లో విద్యార్థుల నుంచి ముందస్తుగా ఫీజు చెల్లిస్తేనే ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్‌విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తోంది. వృత్తివిద్యా కోర్సుల అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఆదాయపరిమితికి లోబడిన, కన్వీనర్ కోటాలో సీటు దక్కించుకున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇంటర్‌లో చేరే విద్యార్థులు, దోస్త్ ద్వారా జనరల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన వారికి కూడా ఈ పథకం అమలవుతోంది. వాస్తవానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సీటు సాధిస్తే నిబంధనలకు లోబడి ఎలాంటి ట్యూషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. నేరుగా కాలేజీలో అడ్మిషన్ తీసుకొని కోర్సు పూర్తిచేసే వరకు ఉచితంగా చదువుకోవచ్చు. కానీ మెజారిటీ కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. అడ్మిషన్ సమయంలోనే కొన్ని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థి నుంచి ముందస్తుగా ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. అలా ఫీజును చెల్లించిన వారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఇప్పుడు చెల్లిస్తే.. అప్పుడు రికవరీ

రాష్ట్రంలో పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 12.65లక్షలు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద అర్హత ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు నిధులు విడుదల చేస్తుంది. నేరుగా కాలేజీ యాజమాన్యం ఖాతాలో అవి జమ అవుతాయి. పాలిటెక్నిక్ కోర్సు మూడు సంవత్సరాలు, ఇంజనీరింగ్ కోర్సు నాలుగేళ్లు... ఇలా ఆయా కోర్సు కాలపరిమితి ఉండగా, విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత ఆ సంవత్సరానికి సంబంధించిన నిధులను తదుపరి అకడమిక్ ఇయర్ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం కాలేజీ ఖాతాలో జమ చేస్తుంది. ఆ తర్వాత కాలేజీ యాజమాన్యం విద్యార్థి చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెక్కు రూపంలో అతనికే చెల్లిస్తుంది. వాస్తవానికి విద్యార్థి నుంచి ఫీజు వసూలు చేసుకోవడం, తర్వాత అతడికి తిరిగి చెల్లించడం నిబంధనలకు విరుద్ధం.



లిఖిత పూర్వక ఫిర్యాదులు నిల్

రెండేళ్ల నుంచి నాలుగేళ్ల వరకు అదే కాలేజీలో చదవాల్సి ఉండడంతో ముందస్తు ఫీజు వసూళ్లపై విద్యార్థులు ఎలాంటి ఫిర్యాదులు చేయడం లేదు. ఇలా ఫిర్యాదు చేస్తే కాలేజీల్లో ఏదైనా యాక్షన్ తీసుకునే అవకాశం ఉంటుందనే భావన మెజారిటీ విద్యార్థుల్లో ఉంది. ఫీజుల చెల్లింపులపై సంక్షేమ శాఖలకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ లిఖితపూర్వకంగా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామంటున్నారు.

రాష్ట్రంలో ఆయా కోర్సులు అందించే కాలేజీలు ఇలా...

కేటగిరీ	ఇంటర్	ఇంజనీరింగ్	పాలిటెక్నిక్	ఐటీఐ	జనరల్ డిగ్రీ/పీజీ	డీఈడీ/బీఈడీ	పారామెడికల్	ఎంబీఏ/ఎంసీఏ	ఫార్మసీ/నర్సింగ్	వ్యవసాయ
కాలేజీల సంఖ్య	2637	173	120	160	1595	86	213	75	140	30

కెమికల్ కిల్లింగ్స్!

ప్రపంచవ్యాప్తంగా రసాయనాల వల్ల ఏటా 20 లక్షల మంది మృత్యువాత

- కెమికల్స్ ద్వారా సోకుతున్న జబ్బుల్లో అత్యధికంగా 40% గుండె వ్యాధులే
- ఊపిరితిత్తుల జబ్బులు, కేన్సర్లూ అధికమే.. కెమికల్స్‌తోనే 20% ఆత్మహత్యలు

ప్రజారోగ్యంపై రసాయనాల ప్రభావం నివేదికలో డబ్ల్యూహెచ్‌వో వెల్లడి

వివిధ రసాయనాలు, పురుగుమందులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని... ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 లక్షల మంది రసాయనాల కారణంగా మృతిచెందుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. ఈ మేరకు ప్రజారోగ్యంపై రసాయనాల ప్రభావం పేరుతో తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. అంతర్జాతీయంగా జరిగే అన్ని రకాల మరణాల్లో 3.6 శాతం కెమికల్స్ ద్వారానే జరుగుతున్నాయని నివేదిక వివరించింది. ముఖ్యంగా భారత్‌లో పురుగుమందుల వల్లే ఏడాదికి 70 వేల ఆత్మహత్యలు జరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొంది.

– సాక్షి, హైదరాబాద్

హృద్రోగాలే అధికం

డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం... కెమికల్స్ వల్ల వచ్చే జబ్బుల్లో అత్యధికంగా 40% గుండె జబ్బులే ఉంటున్నాయి. అలాగే 20% దీర్ఘకాలిక ఊపిరితిత్తుల జబ్బులు, 15% కేన్సర్లు ఉంటున్నాయి. ఏటా లక్ష మంది పురుషుల్లో కెమికల్స్ వల్ల 35 మరణాలు సంభవిస్తుండగా అందులో 32 జబ్బులు దీర్ఘకాలిక జబ్బుల వల్లే జరుగుతున్నాయి. మహిళల్లో లక్షకు 17మంది కెమికల్స్ కారణంగా చనిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యల్లో 20% కెమికల్స్ ద్వారా, రైతు ఆత్మహత్యల్లో 30% కెమికల్స్ ద్వారా, 1.4% నిద్రమాత్రల వంటి మందులు వేసుకోవడమే కారణం.



ఏయే రసాయనాల వల్ల ఎటువంటి జబ్బులు..?



ఆర్సెనిక్, ఆస్‌బెస్టాస్, బెంజీన్, బెరీలియం, క్యాడ్మియం తదితర రసాయనాలు 2.9 శాతం కేన్సర్లకు కారణమవుతున్నాయి. ఆర్సెనిక్ భూగర్భ జలాల నుంచి వస్తుండగా బొగ్గు గనుల్లో పనిచేసే వారిలో ఆస్‌బెస్టాస్ చేరుతోంది. ధూమపానం, వాహన కాలుష్యం ద్వారా బెంజీన్ శరీరంలోకి ప్రవేశిస్తోంది. మురికినీరు లేదా కలుషిత జలాల్లో ఉండే చేపలు తినడం, అలాంటి నీటితో సాగు చేసే ఆలుగడ్డ, వరి, పొగాకు ద్వారా క్యాడ్మియం ఒంట్లోకి చేరుతోంది.

సీసం వాడకాన్ని తగ్గించాలి...



ప్రపంచవ్యాప్తంగా భారత్ సహా 41 శాతం దేశాలు సీసంపై చాలావరకు నియంత్రణ విధించాయి. అయినా పెయింటింగ్స్, వాహన ఇంధనాలు, నీరు, ఫుడ్ ప్యాకేజీలు, చిన్నారుల ఆట బొమ్మల్లో దాని వాడకం ఇంకా కొనసాగుతోంది. ఇది తీవ్ర అనారోగ్యానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా వస్తువుల్లో సీసం వాడకాన్ని నివారించాలి. అన్ని రకాల రసాయనాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 లక్షల మంది చనిపోతున్నారంటే 16 సెకన్లకు ఒకరు మరణిస్తున్నారన్నమాట.

– డాక్టర్ కిరణ్ మాదల,
సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

సీసంతో ఆరోగ్యానికి హాని..

కెమికల్స్ వల్ల హానిలో సగ భాగం సీసం అనే లోహం ద్వారానే జరుగుతోంది. సీసాన్ని పెయింటింగ్స్, ప్లంబింగ్ పనులతోపాటు స్మోకింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మైనింగ్, ఐరన్, ఉక్కు తయారీ, ఆయిల్ రిఫైనింగ్‌లో, పెట్రోల్, విమాన ఇంధనాలు, కాస్మెటిక్స్, సంప్రదాయ మందులు, నగల తయారీ, సిరామిక్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాటర్ పైప్‌లలో సీసం ఉంటోంది. కలర్ కోటింగ్‌తో కూడిన ఆహారాలు తినడం వల్ల గుండె జబ్బుల్లో 4.6 శాతం, కిడ్నీ జబ్బుల్లో 3 శాతం సీసం ద్వారా వస్తున్నాయి. చిన్నారుల్లో మూడో వంతు బుద్ధిమాంద్యం సీసం ద్వారా ఏర్పడుతోంది. పిల్లల్లో ఎక్కువగా పెయింటింగ్స్ ద్వారా సీసం వారిలో చేరుతుండగా ఐదేళ్లలోపు పిల్లల్లో సీసం కలిగించే దుష్ప్రభావం ఐదు రెట్లు ఎక్కువగా ఉంటోంది. సీసం కలిసిన వస్తువుల వాడకం వల్ల గర్భిణుల్లో ముందస్తు ప్రసవాలు లేదా అబార్షన్లు జరుగుతున్నాయి.

ఎస్టీ మహిళపై థర్డ్ డిగ్రీనా?

వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ ఎస్టీ మహిళపై పోలీసులు అత్యంత పాశవికంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఉదంతంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, రాచకొండ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీ, ఎల్బీ నగర్ ఎస్‌హెచ్‌వోకు నోటీసులు జారీ చేసింది. ఘటన జరిగిన ఆగస్టు 15వ తేదీ నాటి స్టేషన్ సీసీ ఫుటేజీని కూడా అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఎల్బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మి అనే ఎస్టీ మహిళపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన ఉదంతంపట్ల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా తీవ్రంగా స్పందించి విచారణ కోసం సీజేకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. దర్యాప్తు నివేదిక అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

48 గంటల్లోగా నివేదిక ఇవ్వండి

అత్యాచార ఘటనపై గవర్నర్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని నందనవనం కాలనీలో 16 ఏళ్ల బాలిక ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి సామూహిక అత్యాచారం జరపడంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 48 గంటల్లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. బాధితురాలి ఇంటిని సందర్శించి అవసరమైన సహాయం అందించాలని రంగారెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని ఆదేశించారు.

ఇలాంటి పాలనపై 'తిరగబడదాం–తరిమికొడదాం'

మీర్‌పేట్ ఘటనపై ట్వీట్ చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మీర్‌పేట్‌లో బాలిక అత్యాచార ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ట్విటర్ వేదికగా స్పందించారు. ''విశ్వనగరం చేశానని కేసీఆర్ గప్పాలు కొట్టే మన హైదరాబాద్ బీఆర్ఎస్ పాలనలో గంజాయికి, మత్తు పదార్థాలకు అడ్డాగా మారింది. నిన్న సింగరేణి కాలనీలో, నేడు మీర్‌పేట్‌లో ఆడబిడ్డలపై అఘాయిత్యాల కలచివేస్తున్నాయి. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని ప్రజల మాన ప్రాణాలను గాలికి వదిలేశారు. ఇలాంటి పాలనపై తిరగబడదాం– తరిమికొడదాం''అని రేవంత్‌రెడ్డి మంగళవారం తన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.

నేరస్తులపై నిఘా పెంచండి

ట్రై కమిషనరేట్ల పరిధిలో నేరాల నియంత్రణపై హోంమంత్రి మహమూద్ అలీ సమీక్ష



సాక్షి,హైదరాబాద్:నేరాలకు పాల్పడుతున్నవారిపై నిఘా పెంచాలని, అవసరమైతే రౌడీషీటర్లపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ఆదేశించారు. చీకటి ప్రదేశాల్లో, భారీ నిర్మాణాల దగ్గర సంఘ వ్యతిరేక కార్యకలాపాలు, ఫ్లై ఓవర్లు, పాఠశాలల వద్ద మద్యం, గంజాయి సేవించడంపై నిఘా ఉంచాలని సూచించారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ట్రై-పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నమోదవుతున్న నేరాలు, హత్యలపై హోంమంత్రి మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో డీజీపీ అంజనీకుమార్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, కమిషనర్లు సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్, సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పాల్గొన్నారు. హోంమంత్రి మాట్లాడుతూ చాంద్రాయణగుట్ట, పహాడీషరీఫ్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో, ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీలోని ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, జిమ్‌లు, పాన్ షాప్‌లు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల ప్రకారం మూతపడేలా చూడాలని సూచించారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో రెచ్చగొట్టే సందేశాలను కొన్ని గ్రూపులు ప్రబలంగా ప్రసారం చేస్తున్నాయని, దీని ఫలితంగా ప్రజలలో తప్పుడు ప్రచారాలు జరిగే అవకాశం ఉందని హోంమంత్రి అన్నారు. ఫంక్షన్ హాళ్లలో అర్ధరాత్రి వరకు గడపవద్దని ప్రజలను కోరారు. విధి నిర్వహణలోని పోలీసులకు ప్రజలు సహకరించాలని, భద్రత కోసం ప్రజలకు సేవ చేయడానికి పోలీసులకు చేయూతనివ్వాలన్నారు.

ఒకే వ్యక్తిలో స్త్రీ, పురుష జననాంగాలు!

- అరుదైన సమస్యకు కిమ్స్‌లో శస్త్రచికిత్స
- దేశంలో ఇప్పటివరకు ఇలాంటి కేసులు 20 మాత్రమేనంటున్న వైద్యులు

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): మంచిర్యాలకు చెందిన ఓ వ్యక్తి వృషణాలు లేకుండా పుట్టాడు. 40 ఏళ్లుగా అలాగే ఉన్నాడు. పెళ్లి చేసుకున్నా.. ఎంతకు పిల్లలు పుట్టకపోవడం, పొత్తి కడుపు కింద నొప్పితో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చాడు. అల్ట్రాసౌండ్, స్కానింగ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలు చేయగా.. ఆ వ్యక్తిలో స్త్రీ, పురుష జననాంగాలు రెండూ ఉన్నట్టు గుర్తించారు. జన్యు ఉత్పరివర్తనం (మ్యుటేషన్) కారణంగా ఈ పరిస్థితి తలెత్తినట్టు తేల్చారు. ఆస్పత్రిలో ఆయనకు ఆండ్రాలజిస్టు, రోబోటిక్ సర్జన్ వైఎం ప్రశాంత్ చికిత్స చేశారు. దీనికి సంబంధించి వైద్యుడు వెల్లడించిన వివరాల మేరకు.. సాధారణంగా పిండం ఏర్పడిన సమయంలోనే హార్మోన్ల ప్రభావంతో ఆడ, మగ అన్నది నిర్ణయమైపోతుంది. అయితే మంచిర్యాల వ్యక్తి కేసులో జన్యు మ్యుటేషన్ కారణంగా.. హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి ఆడ, మగ రెండు రకాల జననాంగాలు ఏర్పడ్డాయి. అందులో గర్భ సంచి, ఫాలోపియన్ ట్యూబ్స్‌తోపాటు వృషణాలు ఉదర భాగంలోనే ఉండిపోయాయి. ఇలాంటి వారు అన్ని అంశాల్లో మామూలుగానే ఉంటారు. హార్మోన్లు, పురుషాంగం, మీసాలు, గడ్డాలు అన్ని సాధారణంగానే ఉంటాయి. అయితే వృషణాలు లోపలే ఉండి, వీర్య కణాలు ఉత్పత్తిగాక పిల్లలు పుట్టే అవకాశం ఉండదు.

ల్యాప్రో స్కోపిక్ శస్త్రచికిత్సతో..

ఈ వ్యక్తికి వైద్యులు చిన్నపాటి కోతతో కూడిన ల్యాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స చేసి.. గర్భసంచి, ఫాలోపియన్ ట్యూబ్స్‌తోపాటు వృషణాలను కూడా తొలగించారు. సాధారణంగా 18 ఏళ్ల వయసు దాటిన తర్వాత కూడా వృషణాలు లోపలే ఉండిపోతే కేన్సర్‌గా మారే ప్రమాదం ఉంటుందని.. అందువల్ల వాటినీ తొలగించాల్సి వచ్చిందని డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఇన్నేళ్లుగా ఆ వ్యక్తి పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని.. కానీ పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలిపారు. 18 ఏళ్ల వయసుకు ముందే ఈ సమస్యను గుర్తించి శస్త్రచికిత్స చేస్తే వృషణాలను సాధారణ స్థితికి తెచ్చే అవకాశం ఉండేదని.. కానీ పేదరికం, నిరక్షరాస్యత కారణంగా ఇన్నేళ్లుగా సమస్యను గుర్తించలేకపోయారని వివరించారు. ఇలాంటి కేసులు అరుదని, ప్రపంచంలో ఇప్పటివరకు 300 కేసులు, దేశంలో 20 కేసులు మాత్రమే బయటికి వచ్చాయని తెలిపారు.

కర్నూలులో జ్యుడీషియల్ సిటీ

- వచ్చే నెలలో నేషనల్ లా యూనివర్సిటీకి ఏపీ సీఎం జగన్‌తో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- అక్కడే హైకోర్టు, జ్యుడీషియల్ విభాగాలు, ట్రిబ్యునళ్ల కార్యాలయాలు
- కర్నూలులో హరిత భవన్ ప్రారంభోత్సవంలో ఆర్థిక మంత్రి బుగ్గన



హరిత భవన్ ప్రారంభోత్సవంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని జగన్నాథ గట్టులో 250 ఎకరాలలో ప్రభుత్వం జ్యుడీషియల్ సిటీ నిర్మించనుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. కర్నూలులో రూ.17 కోట్లతో నిర్మించిన హరిత భవన్‌ను మంత్రి బుగ్గన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యుడీషియల్ సిటీలో హైకోర్టుతో పాటు నేషనల్ లా యూనివర్సిటీ, జ్యుడీషియల్ అకాడమీ, వివిధ ట్రిబ్యునళ్లకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో నేషనల్ లా యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమలు కీలకమని.. వాటి ఏర్పాటుకు సంబంధించిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత సమయంలోగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్‌లో వరుసగా ఏపీ మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ మండలికి అవసరమైన కార్యాలయాలను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తిరుపతి, గుంటూరు, విజయవాడతో పాటు ఇప్పుడు కర్నూలులో నూతన భవనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. త్వరలోనే నెల్లూరు, అనంతపురంలో కూడా నూతన భవనాలు అప్పగిస్తామన్నారు.

వేగంగా, సులభంగా భక్తుల లగేజీ నిర్వహణ

- కొత్తగా బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అందుబాటులోకి..
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



లగేజీ తీసుకునే భక్తుల స్కాన్ కాపీ

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తమ లగేజీని, సెల్‌ఫోన్లను డిపాజిట్ చేసి తిరిగి తీసుకునే ప్రక్రియను మరింత వేగంగా, సులభంగా మార్చేందుకు.. బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో మంగళవారం సీవీఎస్వో నరసింహ కిశోర్‌తో కలిసి ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. నూతన విధానంలో లగేజీ, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను డిపాజిట్ చేస్తే.. ఎక్కువ సమయం వేచి ఉండే అవసరం లేకుండా సులభంగా పొందవచ్చన్నారు. భక్తులు కౌంటర్ వద్ద లగేజీ ఇవ్వగానే.. వారి వద్ద ఉన్న దర్శన టికెట్‌ను స్కాన్ చేసి వాటి వివరాలను ఎలక్ట్రానిక్ డివైస్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు. దర్శన టికెట్ లేని భక్తులకు వారి వివరాలు, పేరు నమోదు చేసుకుని బ్యాగ్‌కు ఆర్ఎఫ్ఐడీతో కూడిన ట్యాగ్ జతపరిచి క్యూఆర్ కోడ్ రసీదు ఇస్తామని చెప్పారు. ఫోన్ డిపాజిట్ కోసం దర్శన టికెట్‌తో పాటు భక్తుల వివరాలు సేకరిస్తామని తెలిపారు. భక్తులకు వారి లగేజీ గురించిన సమాచారం మెసేజ్ రూపంలో అందుతుందన్నారు. భక్తుల రసీదును ఎలక్ట్రానిక్ డివైస్‌తో స్కాన్ చేసిన వెంటనే వారి మొబైల్, లగేజీ భద్రపరిచిన ర్యాక్ నంబర్ తెలుస్తుందని.. తద్వారా సులభంగా లగేజీ తిరిగి పొందే అవకాశం లభించిందన్నారు. తిరుమలలో 16 కేంద్రాల ద్వారా 44 కౌంటర్లలో ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. నూతన విధానం కోసం చెన్నైకి చెందిన చార్లెస్ మార్టిన్ రూ.2 కోట్లు, బెంగళూరుకు చెందిన వేణుగోపాల్ రూ.కోటి, హైదరాబాద్‌కు చెందిన ట్రాక్ ఇట్ సంస్థ సీఈవో వేదాంతం సోమశేఖర్ రూ.17 లక్షలు విరాళంగా ఇచ్చారని నరసింహ కిశోర్ తెలిపారు. సమావేశంలో అధికారులు బాలిరెడ్డి, గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎమ్‌ఐఎమ్‌ఎస్ ఆధ్వర్యంలో జీ–20 రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: జీ–20 రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎన్‌ఎమ్‌ఐఎమ్‌ఎస్ ఆతిథ్యం ఇచ్చింది. జీ–20 అధ్యక్ష పదవికి భారత్ నాయకత్వం వహించడంతో విద్యకు ప్రత్యేక అవకాశం ఏర్పడింది. ఉన్నత విద్య ద్వారా మెరుగైన ప్రపంచాన్ని నిర్మించేందుకు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం, ప్రపంచ అసమానతలను తగ్గించడం, సుస్థిర ప్రపంచాన్ని సాధించే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం వంటి ఆలోచనలను వ్యక్తీకరించడం ఈ సమావేశం ముఖ్య లక్ష్యంగా పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏసీయూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అండ్ సెక్రటరీ జనరల్ జోవన్నా న్యూమాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముంబై సీనియర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషనర్ మోనికా కెన్నెడీ, శాస్త్రి ఇండో కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ ప్రాచీ కౌల్, ముంబైలో జర్మన్ కాన్సుల్ జనరల్, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే ఎన్‌ఎమ్‌ఐఎమ్‌ఎస్ జీ–20 రౌండ్ టేబుల్ వర్కింగ్ కమిటీ వైస్ చాన్స్‌లర్ రమేశ్ భట్, ప్రో వీసీ శరద్ మైస్కార్, డైరెక్టర్ మీనా గల్లియారా తదితరులున్నారు.



తొలి రౌండ్‌లోనే సుమిత్ నగాల్ ఓటమి

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. న్యూయార్క్‌లో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 190వ ర్యాంకర్ సుమిత్ 3-6, 5-7తో ప్రపంచ 95వ ర్యాంకర్ టారో డానియల్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు. గంటా 44 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు.



రవూఫ్ ధాటికి అఫ్గానిస్తాన్ 59 ఆలౌట్

మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్తాన్‌తో హంబన్‌టోటాలో మంగళవారం జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ 142 పరుగుల తేడాతో గెలిచింది. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్‌ను పాకిస్తాన్ పేస్ బౌలర్ హారిస్ రవూఫ్ (5/18) హడలెత్తించాడు. రవూఫ్ ధాటికి అఫ్గానిస్తాన్ 19.2 ఓవర్లలో కేవలం 59 పరుగులకే ఆలౌటైంది. వన్డేల్లో అఫ్గానిస్తాన్‌కిది రెండో అత్యల్ప స్కోరు. అంతకుముందు పాకిస్తాన్ 47.1 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్ ఉల్ హఖ్ (61; 2 ఫోర్లు), షాదాబ్ (39 ; 3 ఫోర్లు) రాణించారు.



రన్నరప్ యువ భారత్

దుసెల్‌దార్ఫ్ (జర్మనీ): నాలుగు దేశాల జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆతిథ్య జర్మనీ జట్టుతో మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 1-6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున సుదీప్ చిర్మాకో (22వ ని.లో) ఏకై క గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (15వ ని.లో), బెన్ హస్బాచ్ (20వ ని.లో), హుగో వాన్ (23వ ని.లో), ఫాబియో సీట్జ్ (38వ ని.లో), నికాస్ బెరెంట్స్ (41వ ని.లో), పాల్ గ్లాండెర్ (43వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మరోవైపు ఇదే వేదికపై జరుగుతున్న నాలుగు దేశాల మహిళల జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు తొలి విజయం నమోదు చేసింది. స్పెయిన్‌తో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1తో గెలిచింది. భారత్ తరఫున అన్ను (21వ ని.లో), సాక్షి రాణా (47వ ని.లో) చెరో గోల్ సాధించారు. భారత్, స్పెయిన్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ అంతరంతో జర్మనీతో జరిగే ఫైనల్‌కు స్పెయిన్ అర్హత సాధించగా... భారత జట్టు 3-4 స్థానాల కోసం నేడు ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

శ్రీజకు స్వర్ణం...
స్నేహిత్‌కు కాంస్యం

సాక్షి, విశాఖపట్నం: జాతీయ ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, స్నేహిత్ రాణించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తరఫున బరిలోకి దిగిన శ్రీజ మహిళల సింగిల్స్‌లో తొలిసారి స్వర్ణం సాధించింది.



ఫైనల్లో శ్రీజ 11-6, 11-7, 13-11, 11-5తో మౌమితా దత్తా (ఆర్‌ఎస్‌పీబీ)పై గెలిచింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తరఫున పోటీపడిన స్నేహిత్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 12-10, 7-11, 13-11, 7-11, 8-11, 4-11తో మనుష్ షా (ఆర్‌బీఐ) చేతిలో ఓడిపోయి కాంస్య పతకం సాధించాడు. శ్రీజ, స్నేహిత్ ప్రదర్శనపట్ల వీరిద్దరి కోచ్ సోమ్‌నాథ్ ఘోష్ ఆనందం వ్యక్తం చేశాడు.

ప్రయోగానికి ఆఖరి అవకాశం

- నేడు ఐర్లాండ్‌తో భారత్ చివరి టి20
- ఇప్పటికే టీమిండియా ఖాతాలో సిరీస్
- తొలి విజయం కోసం ఐర్లాండ్ ప్రయత్నం
- రాత్రి గం.7:30 నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



డబ్లిన్: వెస్టిండీస్‌తో ఐదు టి20 మ్యాచ్‌లు, ఆ తర్వాత ఐర్లాండ్‌తో మూడు టి20 మ్యాచ్‌లు భారత యువ ఆటగాళ్లను ఈ ఫార్మాట్‌లో పరీక్షించేందుకు అవకాశం ఇచ్చాయి. వన్డే ప్రపంచకప్ ఏడాది ఎక్కువ మంది సీనియర్లు విరామం తీసుకోగా, కుర్రాళ్లంతా తమకు లభించిన చాన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నారు. ఈ రెండు పర్యటనల్లో కలిపి ఏడు మ్యాచ్‌లలో ఇప్పటికే ఐదుగురు ఆటగాళ్లు అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశారు. ఇక మరో ఇద్దరు దాని కోసం ఎదురు చూస్తున్నారు. టూర్ చివరి మ్యాచ్‌లో ఆ చాన్స్ దక్కుతుందా అనేది చూడాలి. సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకున్న భారత్ కోణంలో ఇది మాత్రమే ఆసక్తికర అంశం. మరోవైపు వన్డే, టి20 ఫార్మాట్‌లలో కలిపి భారత్‌తో ఆడిన 10 సార్లూ ఓడిన ఐర్లాండ్ ఈసారైనా సొంతగడ్డపై ఒక్క మ్యాచ్ గెలవాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో నేడు చివరి టి20కి రంగం సిద్ధమైంది.

జితేశ్, షహబాజ్‌లకు అవకాశం!

ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌లలోనూ రాణించిన కెప్టెన్ బుమ్రా, పేసర్ ప్రసిధ్ కృష్ణ ఫామ్‌లోకి రావడం, ఆసియా కప్‌కు ఎంపిక కావడంతో ఈ సిరీస్ నుంచి భారత్‌కు ఆశించిన ప్రధాన ఫలితం దక్కింది. అయితే మరింత మ్యాచ్ ప్రాక్టీస్ కోసం వీరిద్దరు ఈ మ్యాచ్‌లోనూ బరిలోకి దిగుతారు. రవి బిష్ణోయ్ కూడా సిరీస్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో రుతురాజ్, సామ్సన్, రింకూ సింగ్ కూడా తమకు లభించిన అవకాశాలు చక్కగా ఉపయోగించుకోగా, శివమ్ దూబే కూడా తన ధాటిని ప్రదర్శించాడు. సిరీస్‌లో విఫలమైన తిలక్ వర్మ చివరి పోరులో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు. యశస్వి కూడా మరో మెరుపు ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. ఈ స్థితిలో తుది జట్టులో మూడు మార్పులకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్ ఆడని వికెట్ కీపర్ జితేశ్ శర్మ, 3 వన్డేలు ఆడిన షహబాజ్ అహ్మద్ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిని తీసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తే సంజు సామ్సన్, వాషింగ్టన్ సుందర్ స్థానాల్లో అవకాశం దక్కుతుంది. మరోవైపు కొంత విరామం తర్వాత టీమ్‌లోకి వచ్చిన అవేశ్ ఖాన్ కూడా టీమ్‌తో పాటు ఉన్నాడు. అతనికీ ఒక మ్యాచ్ ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్‌కు విశ్రాంతినిస్తారు. ఇదే జరిగితే కుర్రాళ్లతో భారత్ ప్రయోగం సంపూర్ణమవుతుంది.

స్టిర్లింగ్ ఫామ్‌లోకి వచ్చేనా!

రెండు టి20 మ్యాచ్‌లలో ఐర్లాండ్ ఆటతీరు మరీ పేలవంగా లేకున్నా భారత్‌లాంటి బలమైన జట్టుకు పోటీనిచ్చేందుకు సరిపోలేదు. గతంలోనూ కొన్ని చక్కటి ప్రదర్శనలు వచ్చినా టీమిండియాను ఓడించడంలో మాత్రం ఆ జట్టు సఫలం కాలేకపోయింది. ఈ నేపథ్యంలో చివరి పోరులోనైనా ఆ జట్టు గెలుపు బాట పడుతుందేమో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా లీగ్‌లలో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ వచ్చిన కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఇక్కడ మాత్రం రెండింటిలోనూ విఫలమయ్యాడు. బల్బిర్నీ మినహా మిగతావారంతా ప్రభావం చూపలేకపోయారు. విజయం సాధించాలంటే జట్టు సమష్టిగా రాణించడం కీలకం. ఐర్లాండ్ కూడా గత మ్యాచ్‌తో పోలిస్తే మూడు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

సింధుకు చుక్కెదురు

- రెండో రౌండ్‌లో ఓడిన భారత స్టార్
- ప్రిక్వార్టర్స్‌లోకి ప్రణయ్, లక్ష్య సేన్



కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ఈ ఏడాది భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు నిరాశజనక ప్రదర్శన కొనసాగుతోంది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈ మాజీ చాంపియన్ రెండో రౌండ్లోనే వెనుదిరిగింది. తొలి రౌండ్లో ఆమెకు 'బై' లభించడంతో నేరుగా రెండో రౌండ్లో పోటీపడింది. ప్రతీసారి కనీసం క్వార్టర్ ఫైనలిస్ట్‌గా నిలిచిన ఆమె బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో 14-21, 14-21తో నొజోమి ఒకుహారా (జపాన్) చేతిలో ఓడిపోయింది. రెండు గేముల్లో కూడా ఆరంభంలో ప్రత్యర్థికంటే మెరుగ్గా, ప్రత్యర్థికి దీటుగా ఆడిన 16వ సీడ్ సింధు గేమ్ సాగే కొద్దీ డీలా పడటంతో వరుస గేముల్లోనే ఓడింది. రెండో గేమ్‌లో సింధు ఒకదశలో 9-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ జపాన్ షట్లర్ వరుసగా పాయింట్లు నెగ్గుకుంటూ రావడంతో మళ్లీ సింధు ఆధిక్యాన్ని, ఆ తర్వాత మ్యాచ్‌నే కోల్పోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్స్ ప్రణయ్, లక్ష్యసేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 21-11, 21-12తో జియోన్ హ్యోక్ (కొరియా)పై, ప్రణయ్ 21-9, 21-14తో చికో అర వర్డొయో (ఇండోనేసియా)పై గెలుపొందారు. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యె (సింగపూర్)తో ప్రణయ్; కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో లక్ష్య సేన్ తలపడతారు.



ప్రజ్ఞానంద, కార్ల్‌సన్ తొలి గేమ్ 'డ్రా'

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగం టైటిల్ కోసం భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య జరిగిన తొలి గేమ్ 'డ్రా'గా ముగిసింది. తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల ప్రజ్ఞానంద ఈ గేమ్‌లో తెల్ల పావులతో ఆడాడు. 35 ఎత్తుల తర్వాత ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు సమ్మతించారు. 'తొలి గేమ్‌లో నేను ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. రెండో గేమ్‌లో కార్ల్‌సన్‌తో గట్టి పోరాటమే చేయాల్సి ఉంటుంది. అతడిని నిలువరించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తా' అని ప్రజ్ఞానంద వ్యాఖ్యానించాడు. వీరిద్దరి మధ్య నేడు రెండో గేమ్ జరుగుతుంది. ఈ గేమ్‌లో కార్ల్‌సన్ తెల్ల పావులతో ఆడతాడు. ఈ గేమ్‌లో గెలిచిన ప్లేయర్‌కు ప్రపంచకప్ టైటిల్ లభిస్తుంది. ఒకవేళ రెండో గేమ్ కూడా 'డ్రా' అయితే గురువారం టైబ్రేక్ గేమ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

హీట్స్‌లోనే జ్యోతి నిష్క్రమణ

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్




బుడాపెస్ట్ (హంగేరి): తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ భారత మహిళా అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఒత్తిడికిలోనై నిరాశపరిచింది. మంగళవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన 23 ఏళ్ల జ్యోతి హీట్స్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన జ్యోతి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం ఓవరాల్‌గా 29వ స్థానంలో నిలిచి సెమీఫైనల్ దశకు అర్హత పొందలేకపోయింది. నాలుగో హీట్‌లో పోటీపడ్డ జ్యోతి 13.05 సెకన్లలో గమ్యానికి చేరి ఏడో ర్యాంక్ లో నిలిచింది. మొత్తం ఐదు హీట్స్ జరగ్గా... ఒక్కో హీట్‌లో టాప్–4లో నిలిచిన వారు నేరుగా సెమీఫైనల్‌కు చేరారు. మిగిలిన వారిలో బెస్ట్–4 టైమింగ్ నమోదు చేసిన అథ్లెట్‌లు కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. జ్యోతి తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన (12.78 సెకన్లు) సమయాన్ని ఇక్కడ పునరావృతం చేసి ఉంటే ఆమెకు సెమీఫైనల్ బెర్త్ కచ్చితంగా ఖరారయ్యేది. ఎందుకంటే ఇక్కడ 12.92 సెకన్ల సమయం నమోదు చేసిన మేకీ జిన్లిమ్ (నెదర్లాండ్స్)కు చివరిదైన 24వ సెమీఫైనల్ బెర్త్ లభించింది.



'సూపర్' షకేరీ...

మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త ప్రపంచ చాంపియన్ అవతరించింది. ఫైనల్లో అమెరికాకు చెందిన 23 ఏళ్ల షకేరీ రిచర్డ్సన్ 10.65 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న తొలిసారే షకేరీ స్వర్ణ పతకం సాధించడం విశేషం. షకేరీ ధాటికి ఐదుసార్లు 100 మీటర్ల వరల్డ్ చాంపియన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ (జమైకా; 10.77 సెకన్లు) మూడో స్థానానికి పరిమితమై కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.

సినిమా



● చిరంజీవి

హీరో చిరంజీవి బర్త్ డే (ఆగస్టు 22) సందర్భంగా రెండు కొత్త చిత్రాల ప్రకటనలు వచ్చాయి. ఒకే రోజు రెండు చిత్రాల అనౌన్స్‌మెంట్‌తో అటు తన ఫ్యాన్స్‌కు ఇటు సినీ ప్రేమికులకు చిరంజీవి మెగా ట్రీట్ ఇచ్చారు. చిరంజీవి హీరోగా నటించనున్న 'మెగా 156' (వర్కింగ్ టైటిల్) చిత్రాన్ని ఆయన కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మించనుండటం విశేషం. 'ఖైదీ నంబర్ 150' చిత్రం నుంచి తండ్రికి స్టైలిస్ట్‌గా వ్యవహరిస్తున్నారు సుస్మిత.

మెగా ట్రీట్

ఆమె నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌ని స్థాపించిన సంగతి తెలిసిందే. ఈ బ్యానర్ పైనే 'మెగా 156' మూవీ రూపొందనుంది. త్వరలోనే ఈ చిత్రదర్శకుడు, సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ ప్రకటిస్తారు.

ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్...

తొలి చిత్రం 'బింబిసార'తో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ వశిష్ఠ క్రేజీ ఆఫర్ అందుకున్నారు. చిరంజీవి హీరోగా నటించనున్న 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమాకి దర్శకత్వం వహించనున్నారు వశిష్ఠ. యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తారు. ''తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిన చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందరి'. అలాంటి మరో ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్‌లో చిరంజీవిని చూడాలని అభిమానులు ఎదురు చూస్తున్నారు. చాలా కాలం తర్వాత చిరంజీవిగారు ఒక ఫ్యాంటసీ మూవీ 'మెగా 157'లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు'' అని చిత్రబృందం పేర్కొంది.

ఎవరు ఏమన్నా నా ప్రయత్నం మారదు
- వరుణ్ తేజ్



● ప్రవీణ్, సాక్షీ వైద్య, వరుణ్ తేజ్, అనిల్ రావిపూడి, బీవీఎస్ఎన్ ప్రసాద్, శ్రీకాంత్ అడ్డాల, బాపినీడు

''కొత్త కథలతో మంచి సినిమాలు చేయాలి, ప్రేక్షకులను అలరించాలనే ఆశతోనే ఇండస్ట్రీకి వచ్చాను. ఎవరు ఏమన్నా, సినిమాల ఫలితం ఎలా ఉన్నా.. సినిమాలు బాగా లేకపోతే ఇంకా బాగా చేసేందుకు ప్రయత్నిస్తాను. అంతే కానీ నా ప్రయత్నం, నా కష్టం ఎప్పటికీ మారదు. మీ (ఫ్యాన్స్, ప్రేక్షకులు) ప్రోత్సాహం ఉంటే ఇంకా బాగా చేస్తాను'' అన్నారు వరుణ్ తేజ్. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి.బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''గాండీవధారి అర్జున' వంటి సామాజిక సందేశం ఉన్న సినిమాలో నటించే చాన్స్ రావడం నా లక్. చాలా మంచి సినిమా చేశాననే అనుభూతి కలిగింది. నటుడిగా ఈ చిత్రం నాకు సంతృప్తినిచ్చింది'' అన్నారు. ''వరుణ్‌తో మేం తీసిన 'తొలిప్రేమ' హిట్ అయింది. ఇప్పుడు మంచి సందేశంతో నిర్మించిన 'గాండీవధారి అర్జున' కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ప్రవీణ్ సత్తారు మాట్లాడుతూ– ''నేను చేసిన సినిమాల్లో నాకు బాగా కనెక్ట్ అయినది 'చందమామ కథలు'లోని భావోద్వేగాలు. కానీ, ఆ సినిమా సరిగ్గా ఆడలేదు. రెండోది యాక్షన్ జోనర్‌లో తీసిన 'పీఎస్‌వీ గరుడవేగ' హిట్ అయింది. యాక్షన్, భావోద్వేగాలు, వినోదం కలిపి చేస్తే 'గాండీవధారి అర్జున'. మనసు పెట్టి చేసిన సినిమా ఇది'' అన్నారు. ''గాండీవధారి..'తో వరుణ్ ప్రేక్షకులకు సంతోషాన్ని ఇస్తాడనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు.



నా సామి రంగా?

'ది ఘోస్ట్' చిత్రం విడుదల తర్వాత నాగార్జున నెక్ట్స్ సినిమా గురించిన ప్రకటన రాని విషయం తెలిసిందే. అయితే ఆ సమయం ఆసన్నమైందని, ఈ నెల 29న నాగార్జున బర్త్ డే సందర్భంగా ఆయన కొత్త సినిమా ప్రకటన అధికారికంగా వెల్లడి కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నారని, వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారని టాక్. శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించనున్నారని తెలిసింది.

● నాగార్జున

అక్టోబర్‌లో 800



● మధుర్ మిట్టల్

టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించిన ప్రముఖ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక క్రికెటర్) జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. మురళీధరన్ పాత్రలో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఫేమ్ మధుర్ మిట్టల్, మురళీధరన్ భార్య మదిమలర్ పాత్రలో మహిమా నంబియార్ నటించారు. ఈ సినిమా ఆల్ ఇండియా పంపిణీ హక్కులను నిర్మాత, శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సొంతం చేసుకున్నారు. తమిళంలో రూపొందించిన ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''ముత్తయ్య మురళీధరన్‌గారు బాల్యం నుంచి పడిన ఇబ్బందులు, ఆయన జర్నీ మొత్తం ఈ సినిమాలో ఉంటుంది. సెప్టెంబర్‌లో ట్రైలర్, అక్టోబర్‌లో సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఆ సెంటిమెంట్ వర్కవుట్ అయితే హ్యాపీ
- కార్తికేయ

''ప్రతి సినిమా హిట్ కావాలనే చేస్తాం. కానీ ఆశించిన ఫలితం దక్కనప్పుడు తప్పు ఎక్కడ జరిగిందో ఆలోచించుకుంటాం. ఈ క్రమంలో పాయింట్ కొత్తగా ఉందని సినిమాలు చేయకూడదని, కథ, ప్రతి సీన్ ఆసక్తిగా ఉన్నప్పుడు మాత్రమే సినిమా చేయాలని అర్థం చేసుకున్నాను'' అన్నారు కార్తికేయ. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కార్తికేయ చెప్పిన విశేషాలు.



● కరోనా సమయంలో క్లాక్స్ నాకు 'బెదురులంక 2012' కథ చెప్పాడు. కరోనా వల్ల ప్రపంచం అంతా అయిపోతుందన్నట్లుగా ప్రచారం జరిగింది కదా. దీంతో 'యుగాంతం' కాన్సెప్ట్‌తో క్లాక్స్ చెప్పిన 'బెదరులంక 2012' కథకు కూడా నేను బాగా కనెక్ట్ అయ్యాను. కథలో కొత్తదనం, వినోదం ఉండటంతో ఈ సినిమాను ఓకే చేశాను.

● సిటీలో గ్రాఫిక్ డిజైనర్‌గా చేసే ఉద్యోగాన్ని మానేసి, పల్లెటూరికి వెళ్లే శివ పాత్ర చేశాను. శివ తన గురించి తోటివారు ఏమనుకుంటున్నారో పట్టించుకోడు. కానీ తన జోలికి వస్తే మాత్రం ఊరుకోడు. సినిమాలో శివకు హై ఓల్టేజ్‌లో రియాక్ట్ అయ్యే సీన్ ఉంది. ఆ సందర్భంలో మంచి వెయిట్ ఉన్న శివశంకర వరప్రసాద్ పేరైతే బాగుంటుందని చిరంజీవిగారి అసలు పేరు వాడాం. ఇక 'బెదురులంక 2012' ట్రైలర్ చూసి రామ్‌చరణ్‌గారు ప్రశంసించడం సంతోషాన్ని కలిగించింది. అలాగే 'ఆర్ ఎక్స్ 100' సినిమాలో నా పాత్ర పేరు శివ. 'బెదురులంక..' లో కూడా ఆ పేరే. రెండు చిత్రాలూ గోదావరి నేపథ్యంలో ఉండటం అనేది యాదృచ్ఛికంగా జరిగింది. ఈ సెంటిమెంట్ కుదిరి 'బెదురులంక 2012' కూడా విజయం సాధిస్తే చాలా సంతోషిస్తాను.

● 'డీజే టిల్లు'లో రాధిక పాత్రలో నేహా శెట్టి బాగా నటించారు. కానీ మా సినిమాలో నేహాది పల్లెటూరి అమ్మాయి పాత్ర. దీంతో తను ఎలా చేస్తుందో? అనే చిన్న సందేహం ఉండేది. కానీ నటనలో వైవిధ్యం చూపించారు.

● 2012 అంటే నాకు యుగాంతమే గురుకు వస్తుంది. అప్పుడు నేను కాలేజీలో ఉన్నాను. 2012లో జీవితం అంటే ఏంటో అర్థమైపోయిన ఓ భ్రమలో ఉండేవాడిని. కానీ ఇప్పుడు ఆలోచనలో పరిపక్వత వచ్చింది. ఇప్పుడు(2023) ఏమీ తెలియదని అర్థమవుతోంది (నవ్వుతూ).

ఓ వింత ఆట

ప్రముఖ నటులు శరత్‌బాబు సినీవారసుడు ఆయుష్ (శరత్‌బాబు సోదరుడి తనయుడు) ప్రధాన పాత్రలో, శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ ఆధ్వర్యంలో రూపొందిన చిత్రం 'దక్ష'. వివేకానంద విక్రాంత్ దర్శకత్వంలో తల్లాడ సాయికృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వివేకానంద విక్రాంత్ మాట్లాడుతూ– ''ఒక వింత గేమ్ ఆడటం వలన కొందరు స్నేహితులు ఎదుర్కొన్న ఊహించని ఘటనలతో పారా నార్మల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు. తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ– ''ప్రతి క్షణం ఉత్కంఠను రేకెత్తించే కథాబలం, ఆకట్టుకునే కథనంతో రూపొందించాం. ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. తన వారసుని విజయాన్ని చూడకుండానే మరణించిన శరత్ బాబుకు 'దక్ష'ను అంకితం ఇస్తున్నాం'' అన్నారు. ఈ సినిమాలో నక్షత్ర, అను, అలేఖ్య రియా, అఖిల్, రవిరెడ్డి, శోభన్ నటించారు.



● వివేకానంద, సాయికృష్ణ

యాక్షన్ రాంబో



● శ్రీతేజ్

'నారప్ప, పుష్ప, ధమాకా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన శ్రీతేజ్ హీరోగా పరిచయం అవుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాకు 'రాంబో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం (ఆగస్టు 22) శ్రీతేజ్ బర్త్ డే సందర్భంగా 'రాంబో' ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఇటీవల జరిగిన వైజాగ్ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ పూర్తయింది. త్వరలోనే పాటలను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రాజీవ్ సాలూరి, ఫర్నాజ్ శెట్టి, మైమ్ గోపి, గోలీసోడ మధు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: శ్యామ్ కె.నాయుడు, సునీల్ కుమార్ నామా.

కామెడీ.. థ్రిల్



● శివారెడ్డి

శివారెడ్డి, జాష్లిని, వనితా రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'రెంట్'. రఘువర్దన్ రెడ్డి దర్శకత్వంలో 'బలగం' జగదీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా వచ్చిన నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''రెంట్' సినిమా ట్రైలర్ చాలా బాగుంది'' అన్నారు. ''చాలా రోజుల తర్వాత నేను హీరోగా చేసిన చిత్రం 'రెంట్'. ఇందులో థ్రిల్లింగ్ కథ, కామెడీ, యాక్షన్, సందేశం ఉన్నాయి'' అన్నారు శివారెడ్డి. ''నాకు మంచి పాత్ర ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు వనితా రెడ్డి.

సాక్షి బిజినెస్

బుధవారం
23-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	4	65,220
నిఫ్టీ ▲	3	19,396

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (పొద్దు రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,494	▽	5
డోజోన్స్	34,277	▽	186
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,271	▲	13
డాక్స్	15,706	▲	102
షాంఘై	3,120	▲	27
నికాయ్	31,857	▲	291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (24 క్యారెట్)	58,657	▲	261
బంగారం (22 క్యారెట్)	58,423	▲	260
వెండి (కిలో)	72,140	▲	1,305

పెరగనున్న హోండా కార్ల ధరలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ కంపెనీ హోండా కార్స్ ఇండియా వచ్చే నెల నుంచి సిటీ, అమేజ్ కార్ల ధరలను పెంచనుంది. ముడిసరుకు వ్యయం క్రమంగా అధికం అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ మంగళవారం ప్రకటించింది. అయితే ధర ఎంత పెంచేదీ వెల్లడించలేదు. ప్రస్తుతం ఎక్స్‌షోరూంలో కాంపాక్ట్ సెడాన్ అమేజ్ ధర రూ.7.05 లక్షల నుంచి, మధ్యస్థాయి సెడాన్ సిటీ రూ.11.57 లక్షల నుంచి, హైబ్రిడ్ మోడల్ అయిన సిటీ ఈ:హెచ్ఈవీ రూ.18.89 లక్షల నుంచి ప్రారంభం.

వీడియో కేవైసీని ప్రవేశపెట్టిన బీవోబీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) వీడియో ఆర్ఈ కేవైసీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం కస్టమర్లు ఎప్పటికప్పుడు తమ కేవైసీ ధ్రువీకరణ చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం బ్యాంక్ శాఖ వరకు రావాల్సిన అవసరాన్ని వీడియో ఆర్ఈ కేవైసీ విధానం నివారిస్తుంది. వీడియో కేవైసీ సదుపాయం వినియోగించుకోవాలంటే కస్టమర్ వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి. భారతీయ పౌరసత్వం కలిగి, ఆధార్, పాన్ ఉండాలని బీవోబీ తెలిపింది. ముందుగా కస్టమర్లు బీవోబీ వెబ్‌సైట్‌కు వెళ్లి ఆన్‌లైన్ ఆర్ఈ–కేవైసీ దరఖాస్తును సమర్పించాలి. ఇందులో అడిగిన వివరాలు ఇవ్వాలి. ఆ తర్వాత బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌కు వీడియో కాల్ చేయాల్సి ఉంటుంది. ఈ కాల్ కంటే ముందు కస్టమర్ తన ఒరిజినల్ పాన్ కార్డ్, ఖాళీ వైట్ పేపర్, బ్లూ లేదా బ్లాక్ పెన్ సిద్ధంగా ఉంచుకోవాలి. వీడియో ఆర్ఈ కేవైసీ కాల్‌ను అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య చేసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
23-8-2023	
విశాఖ	470–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455–00
విజయవాడ	455–00
రిటైల్ ధర (డజను)	72.00
22-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95



భారత్ ఎన్‌క్యాప్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రులు వీకే సింగ్, గడ్కరీ, కార్యదర్శి అనురాగ్ జైన్ (ఎడమ నుంచి కుడికి)

ఇక దేశీయంగా కార్ల క్రాష్ టెస్టింగ్..

భారత్ ఎన్‌క్యాప్ ప్రోగ్రామ్ ఆవిష్కరణ • అక్టోబర్ 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: వాహనాలను మరింత సురక్షితం చేసే దిశగా కేంద్రం దేశీయంగా తొలి కార్ల క్రాష్ టెస్టింగ్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. కేంద్ర రహదారి, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం (భారత్ ఎన్‌క్యాప్)ను ప్రారంభించారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. విదేశాలతో పోలిస్తే చౌకగా దేశీయంగానే కార్ల క్రాష్ టెస్టింగ్‌ను నిర్వహించేందుకు ఇది ఉపయోగపడగలదని గడ్కరీ చెప్పారు. 'విదేశాల్లో ఈ పరీక్షలు చేయించాలంటే దాదాపు రూ. 2.5 కోట్లవుతుంది. అదే భారత్ ఎన్‌క్యాప్ కింద చేస్తే సుమారు రూ. 60 లక్షలవుతుంది. కాబట్టి దీనికి మంచి మార్కెట్ కూడా ఉండగలదు' అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాం కింద కార్ల తయారీ సంస్థలు స్వచ్ఛందంగా తమ వాహనాలను పరీక్షలు చేయించుకోవచ్చు. టెస్టుల్లో వాహనాల పనితీరును బట్టి 0–5 వరకు స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధానం కింద 30 పైగా మోడల్స్‌ను టెస్ట్ చేయించుకునేందుకు పలు కంపెనీలు సంప్రదించినట్లు గడ్కరీ తెలిపారు.

యూఐడీఏఐ చైర్‌పర్సన్‌గా నీలకంఠ్ మిశ్రా



న్యూఢిల్లీ: ఆధార్ సేవలు అందించే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) తాత్కాలిక చైర్‌పర్సన్‌గా నీలకంఠ్ మిశ్రా నియమితులయ్యారు. ఆధార్ చట్టం కింద చైర్‌పర్సన్, సభ్యులకు మూడేళ్ల పదవీ కాలం ఉంటుంది. లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు వీటిల్లో ఏది ముందు అయితే అదే అమల్లోకి వస్తుంది. నీలకంఠ్ మిశ్రా యాక్సిస్ బ్యాంక్‌కు ముఖ్య ఆర్థికవేత్తగా ఉన్నారు. ఇక యూఐడీఏఐ తాత్కాలిక సభ్యులుగా ఐఐటీ ఢిల్లీ కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మౌసమ్, కోటక్ మహీంద్రా అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నీలేశ్ షాని ప్రభుత్వం నియమించింది.

31 శాతం తగ్గిన విస్తారా నష్టాలు

2022–23లో రూ. 1,393 కోట్లు • లాభాల్లో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్



ముంబై: గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో ప్రయివేట్ రంగ విమానయాన కంపెనీ విస్తారా నష్టాలు భారీగా తగ్గాయి. రూ. 1,393 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది(2021–22)లో నమోదైన రూ. 2,031 కోట్లతో పోలిస్తే 31 శాతంపైగా రికవర్ అయ్యాయి. కార్పొరేట్ వ్యవహారాల శాఖకు దాఖలు చేసిన సమాచారం ప్రకారం టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్(విస్తారా) మొత్తం ఆదాయం రెట్టింపై రూ. 11,784 కోట్లను తాకింది. దీంతో నష్టాలు భారీగా తగ్గినట్లు కంపెనీ పేర్కొంది. అయితే నెట్‌వర్త్ రూ. 1,250 కోట్ల నుంచి రూ. 502 కోట్లకు నీరసించింది. దేశీ విమానయాన పరిశ్రమ గతేడాది పటిష్ట వృద్ధిని సాధించినట్లు విస్తారా తెలియజేసింది. కోవిడ్ ముందుస్థాయిని సైతం అధిగమించినట్లు వెల్లడించింది. గత ఆరు నెలల్లో సగటున ప్రతిరోజూ 4 లక్షల మంది ప్రయాణికులు నమోదవుతున్నట్లు తెలియజేసింది.

ఉమ్మడి నష్టం ఇలా..

టాటా గ్రూప్ వెలువరించిన 2022–23 వార్షిక నివేదిక ప్రకారం గతేడాది గ్రూప్‌లోని ఎయిరిండియా, ఎయిరేషియా, విస్తారాల ఉమ్మడి నష్టం రూ. 15,532 కోట్లుగా నమోదైంది. వెరసి 2021–22లో నష్టం రూ. 13,838 కోట్లు మాత్రమే. అయితే ఈ కాలంలో మూడు సంస్థల ఆదాయం పుంజుకున్నప్పటికీ ఎయిరిండియా విమానాలు, ఇంజిన్ల నిలుపుదల కారణంగా రూ. 5,000 కోట్లమేర అదనపు ప్రొవిజనింగ్ చేపట్టడంతో ఉమ్మడి నష్టాలు పెరిగాయి. టాటా సన్స్ వార్షిక నివేదిక ప్రకారం గతేడాది ఎయిరిండియా ఆదాయం రూ. 31,377 కోట్లను దాటగా.. రూ. 11,388 కోట్ల నష్టం నమోదైంది. ఎయిరేషియా టర్నోవర్ రూ. 4,310 కోట్లుకాగా.. రూ. 2,750 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మాత్రం గతేడాది రూ. 5,669 కోట్ల ఆదాయం సాధించింది. అంతేకాకుండా రూ. 117 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కొఠారీ గ్రూప్ స్వర్ణోత్సవం



హైదరాబాద్: పాన్ పరాగ్ తదితర ఉత్పత్తుల తయారీకి సంబంధించిన ప్రముఖ కొఠారీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకుంది. కాన్పూర్‌లో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా 'శూన్య సే గగన్' పేరుతో ఒక పుస్తకాన్ని ఆవిష్కరించింది. కొఠారీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు, మన్‌సుఖ్ భాయ్ కొఠారీ తన జీవితకాలంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు లక్ష్యంగా పుస్తక రచన జరిగింది.

రూపాయి రికవరీ



14 పైసలు అప్; 82.99 వద్ద ముగింపు

న్యూఢిల్లీ: డాలరు మారకం విలువ తగ్గిన నేపథ్యంలో దేశీ కరెన్సీ రూపాయి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి నుంచి కోలుకుంది. డాలర్‌తో పోలిస్తే 14 పైసలు బలపడి, 82.99 వద్ద ముగిసింది. అమెరికా డాలరు బలహీనత దీనికి కారణం.

మళ్లీ జియో ఫైనాన్స్ డీలా

రెండో రోజూ 5% పతనం • ఎల్ఐసీకి 6.66% వాటా



ముంబై: వరుసగా రెండో రోజు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కౌంటర్లో అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో మరోసారి 5 శాతం లోయర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ. 12.5 కోల్పోయి రూ. 239 వద్ద నిలవగా.. ఎన్ఎస్ఈలోనూ ఇదే స్థాయి నష్టంతో రూ. 237 దిగువన స్థిరపడింది. సోమవారం సైతం ఈ షేరు 5 శాతం డౌన్ సర్క్యూట్‌ను తాకిన సంగతి తెలిసిందే. మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ గత నెలలో జరిగిన ధర నిర్ధారణ ట్రేడింగ్‌లో రూ. 262 ధర వద్ద స్థిరపడింది. తదుపరి ఈ కౌంటర్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు సోమవారం(21) నుంచి 10 రోజులపాటు ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో సాధారణ ట్రేడింగ్‌కు తెరతీశాయి. ఫలితంగా రోజుకి 5 శాతం సర్క్యూట్ బ్రేకర్ అమలుకానుంది. తొలి రోజు 5 శాతం పతనమై రూ. 250 సమీపంలో నిలిచింది.

ఇండెక్సులలో..

ధరలో నిలకడను తీసుకురావడం, హెచ్చుతగ్గులను పరిమితం చేయడం వంటి లక్ష్యాలతో స్టాక్ ఎక్స్ఛేంజీలు జియో ఫైనాన్షియల్‌ను ప్రధాన ఇండెక్సులలో తాత్కాలికంగా భాగం చేశాయి. విలీనాలపై సవరించిన తాజా నిబంధనల అమలులో భాగంగా సెన్సెక్స్‌లో 31వ, నిఫ్టీలో 51వ షేరుగా ప్రస్తుతం కొనసాగుతోంది. నిజానికి ఈ షేరుని లిస్టింగ్ తదుపరి మూడు రోజులకు సెన్సెక్స్, నిఫ్టీల నుంచి తొలగించవలసి ఉంది. అయితే వరుసగా సర్క్యూట్ బ్రేకర్లను తాకడంతో ఈ షేరుని ఆగస్ట్ 29వరకూ సెన్సెక్స్, నిఫ్టీలలో కొనసాగించనున్నట్లు ఇండెక్సుల కమిటీ పేర్కొంది. అప్పటికి కూడా సర్క్యూట్ బ్రేకర్లను తాకడం కొనసాగితే.. మరోమారు ఇండెక్సుల నుంచి తొలగింపు వాయిదా పడవచ్చని సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

ఎల్ఐసీకి షేర్లు

ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్‌లను జియో ఫైనాన్షియల్ పేరుతో రిలయన్స్ ఇండస్ట్రీస్ గత నెలలో ప్రత్యేక కంపెనీగా విడదీసింది. దీనిలో భాగంగా వాటాదారులకు ప్రతీ 1 ఆర్ఐఎల్ షేరుకిగాను 1 జియో ఫైనాన్షియల్‌ను కేటాయించింది. ఫలితంగా ఆర్ఐఎల్‌లోగల వాటాలకుగాను ఎస్‌బీఎఫ్‌సీ జియో ఫైనాన్షియల్‌లో 6.66 శాతం వాటాను పొందినట్లు ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ తాజాగా వెల్లడించింది.

ఆటుపోట్ల మధ్య మార్కెట్ అక్కడక్కడే

ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 4 పాయింట్లు బలపడి 65,220 వద్ద నిలిచింది. 3 పాయింట్ల స్వల్ప లాభంతో నిఫ్టీ 19,346 వద్ద స్థిరపడింది. అంతకుముందు ఇంట్రాడేలో సెన్సెక్స్ 147 పాయింట్లు వరకూ పుంజుకుని 65,396కు చేరింది. నిఫ్టీ సైతం 19,443–19,381 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్‌లో వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు సెంటిమెంటును బలహీనపరచినట్లు నిపుణులు పేర్కొన్నారు. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 1 శాతం స్థాయిలో పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 2,165 లాభపడితే 1503 డీలాపడ్డాయి.



పిరమిడ్ టెక్నో ఐపీవో సక్సెస్

ఇండస్ట్రియల్ ప్యాకేజింగ్ కంపెనీ పిరమిడ్ టెక్నోప్లాస్ట్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు మంగళవారాని(22)కల్లా 18 రెట్లు పైగా సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం 75.6 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. దాదాపు 13.83 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఈ ఆఫర్‌తో కంపెనీ రూ. 153 కోట్లు సమకూర్చుకుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

హెచ్‌ఏఎల్ నాసిక్‌లో 647 అప్రెంటిస్‌లు

మహారాష్ట్ర నాసిక్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్).. ఎయిర్‌క్రాఫ్ట్ డివిజన్ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ స్ట్రీమ్‌లో అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 647
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–186, డిప్లొమా అప్రెంటిస్–111,ఐటీఐ అప్రెంటిస్–350
» **ట్రేడ్/విభాగాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: ఏరోనాటికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఆర్ట్స్, కామర్స్, సైన్స్, ఫార్మసీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.
» **డిప్లొమా అప్రెంటిస్:** ఏరోనాటికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్,కంప్యూటర్ ఇంజనీర్,ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, ల్యాబ్ అసిస్టెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, నర్సింగ్ అసిస్టెంట్.
» **ఐటీఐ అప్రెంటిస్:** ఫిట్టర్, టూల్ అండ్ డై మేకర్, టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్,డ్రాఫ్ట్స్‌మ్యాన్,ఎలక్ట్రానిక్స్ మెకానిక్, పెయింటర్, షీట్ మెటల్ వర్కర్, మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, స్టెనోగ్రాఫర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్. »**అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ,డిప్లొమా,డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్‌లకు రూ.9000, డిప్లొమాకు రూ.8000, ఐటీఐకు రూ.8000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.08.2023.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ తేదీలు:** 04.09.2023 నుంచి 16.09.2023 వరకు.
» **వెబ్‌సైట్:** halindia.co.in

బెల్ బెంగళూరులో 63 ఉద్యోగాలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ–16, టెక్నీషియన్ సి–44, జూనియర్ అసిస్టెంట్–03. » **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్, సివిల్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, బీకామ్/బీబీఎం/ఎలక్ట్రానిక్ మెకానిక్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎస్ఎస్ఎల్‌సీ /ఐటీఐ/బీకామ్/బీబీఎం/ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 28 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,500 నుంచి రూ.90,000 చెల్లిస్తారు. » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.09.2023.
» **వెబ్‌సైట్:** www.bel-india.in

బెల్ పంచకులలో 57 ఇంజనీర్ పోస్టులు

పంచకులలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్.. తాత్కాలిక ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 57
» **పోస్టుల వివరాలు:** ట్రెనీ ఇంజనీర్–36, ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్–21. » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, హెచ్ఆర్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, పీజీహెచ్ఆర్ఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ట్రెనీ ఇంజనీర్‌కు రూ.30,000 నుంచి రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్‌కు రూ.40,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
» **వయసు:**01.08.2023నాటికి ట్రెనీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు,ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది:** 26.08.2023.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 14 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ).. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్–02, ప్రాజెక్ట్ అసోసియేట్–12.
» **విభాగాలు:** మైక్రో ఎర్త్‌క్వేక్ మానిటరింగ్,అటామిక్ పవర్, మినరల్ అండ్ బల్క్ కెమిస్ట్రీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ డిప్లొమా/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35ఏళ్ల నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్–నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఉప్పల్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ–500007.
» **ఇంటర్వ్యూ తేది:** 21.08.2023 నుంచి 28.08.2023 వరకు. » **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 8.30 నుంచి 10 వరకు.
» **వెబ్‌సైట్:** www.ngri.res.in

ఇంటర్‌తో.. సెంట్రల్ జాబ్

ఇంటర్మీడియెట్‌తోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం!స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. తాజాగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 1,207 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా స్టెనోగ్రాఫర్ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది.ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి,డి ఎగ్జామినేషన్-2023 వివరాలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో స్టెనో పోస్టులకు నోటిఫికేషన్
» గ్రేడ్–సి, గ్రేడ్–డి స్థాయిలో 1,207 కొలువులు
» ఇంటర్మీడియెట్ అర్హతతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక



స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. సంక్షిప్తంగా ఎస్ఎస్‌సీ. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఇటీవల స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది.

మొత్తం 1,204 పోస్టులు

ఎస్ఎస్‌సీ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం–గ్రేడ్–సి, గ్రేడ్–డి స్థాయిలో మొత్తం 1,204 స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో గ్రేడ్–సి హోదాలో 12 శాఖలు/విభాగాల్లో 49 పోస్టులు, గ్రేడ్–డి హోదాలో 37 విభాగాలు/శాఖల్లో 1,114 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

23.08.2023 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

ఆగస్ట్ 1, 2023 నాటికి గ్రేడ్–సి పోస్టులకు 18–30 ఏళ్లు; గ్రేడ్–డి పోస్టులకు 18–27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

షార్ట్‌హ్యాండ్ అవసరం లేదు

స్టెనోగ్రాఫర్ ఉద్యోగం, విధులను పరిగణనలోకి తీసుకుంటే.. షార్ట్‌హ్యాండ్/ టైపింగ్‌లో ఉత్తీర్ణత ఉండాలని భావిస్తారు. ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్‌లో ఇలాంటి అర్హత నిబంధన ఏదీ లేదు. కాని ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో మాత్రం స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. అవి..రాత పరీక్ష, స్కిల్ టెస్ట్. నియామకాలు ఖరారు చేసే క్రమంలో రాత పరీక్షలో ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. స్కిల్ టెస్ట్‌లోనూ నిర్దేశిత మార్కుల విధానాన్ని అనుసరిస్తారు. ఈ రెండింటినీ క్రోడీకరించి తుది జాబితా రూపొందించి ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష.. 200 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష మూడు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు–100 మార్కులు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

తదుపరి దశ.. స్కిల్ టెస్ట్

- రాత పరీక్ష తర్వాత దశలో నిర్వహించే పరీక్ష.. స్కిల్ టెస్ట్. ఇందులో అభ్యర్థులకు ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది.
- ఇంగ్లిష్ భాషలో నిమిషానికి 100 పదాలు, హిందీ భాషలో నిమిషానికి 80 పదాలు ప్రాతిపదికగా డిక్టేషన్ ఇస్తారు. అభ్యర్థులు ఆ డిక్టేషన్‌ను నోట్ చేసుకుని.. దాన్ని కంప్యూటర్‌పై క్షుణ్నంగా టైప్ చేయాల్సి ఉంటుంది.
- ఇంగ్లిష్ కంప్యూటర్ టైపింగ్‌కు సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి పోస్టుల అభ్యర్థులు 50 నిమిషాల్లో, గ్రేడ్–సి పోస్టుల అభ్యర్థులు 40 నిమిషాల్లో సదరు డిక్టేషన్ టైపింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- హిందీకి సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి అభ్యర్థులు 65 నిమిషాల్లో, గ్రేడ్–సి అభ్యర్థులు 55 నిమిషాల్లో.. సదరు డిక్టేషన్‌ను కంప్యూటర్‌పై టైపింగ్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ భాష ప్రాధాన్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

గెజిటెడ్ హోదా

స్టెనో గ్రాఫర్ గ్రేడ్–సి(గ్రూప్–బి నాన్ గెజిటెడ్), స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి(గ్రూప్–సి) పోస్టులకు ఎంపికైన వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా గెజిటెడ్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఆయా శాఖల్లో సూపరింటెండెంట్ స్థాయి వరకు పదోన్నతులు లభిస్తాయి. ప్రారంభంలో గ్రేడ్–సి ఉద్యోగాలకు నెలకు రూ.9,300 – రూ.34,800 వేతన శ్రేణి, గ్రేడ్–డి పోస్టులకు నెలకు రూ.5,200 –రూ.20,200 వేతన శ్రేణి లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 23.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్ట్ 24, 25 తేదీల్లో
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ప్రాక్టీస్‌తో సక్సెస్

ఎంపిక ప్రక్రియలో రాత పరీక్షలో ప్రతిభే కీలకం కానుంది. కాబట్టి అభ్యర్థులు సిలబస్ అంశాలను సమగ్రంగా పరిశీలించి పూర్తి స్థాయిలో ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టాలి. కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవడంతోపాటు ఎక్కువగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫా న్యూమరిక్), అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్స్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్–డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి. అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా త్రికోణమితి, అల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై పట్టు సాధించాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో కీలక పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు–వాటి తీర్మానాలు, అవార్డులు–విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్

ఇందులో ముఖ్యంగా బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కాంప్రహెన్షన్‌కు సంబంధించి పేరా రీడింగ్‌పై పట్టు సాధించాలి. దినపత్రికలోని ఎడిటోరియల్స్, ముఖ్యాంశాలతో కూడిన వ్యాసాలను చదవాలి.

స్కిల్ టెస్ట్‌కు సంసిద్ధంగా

అభ్యర్థులు స్కిల్ టెస్ట్‌కు కూడా సంసిద్ధత పొందాలి. ఇందుకోసం ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ప్రాక్టీస్ చేయాలి. ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వ్యాఖ్యానాలను పది నిమిషాల్లో రాసుకుని.. వాటిని పరీక్షకు నిర్దేశించిన సమయంలో టైప్ చేయడాన్ని ప్రాక్టీస్ చేయాలి. ఇలా మొదటి నుంచే ప్రాక్టీస్ చేస్తే.. స్కిల్ టెస్ట్ సమయానికి పూర్తి సంసిద్ధత లభిస్తుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

SAMSUNG

Galaxy Z Flip5



samsung.com

Own now at ₹ 4167/month*

Zero down payment | 24 months no cost EMI

HDFC BANK | BAJAJ FINSERV | Samsung Finance+™

Scan to experience the flip side

#JoinTheFlipSide

Please dispose of e-waste and plastic waste responsibly. Customer can WhatsApp on 1800 5 7267864 for information on e-waste / plastic waste pick up.

Image simulated for illustrative purpose only. Actual UX/UI may differ. Color subject to availability. Flex mode supported at angles between 75° and 115°. Offers may be revised or withdrawn without prior notice. *T&C apply. EMI computed on zero down payment. 24 months no cost EMI on the price of ₹ 99999 for 1 unit of Galaxy Z Flip5 8GB | 256GB. Eligibility of EMI at sole discretion of financiers, including those listed on Samsung Finance+ (Financier T&C applies). Samsung disclaims any liabilities with the same.

WhatsApp "Hi" to 9870 494949 to own now at Samsung Exclusive Store

Cheil-16908/23